

# Deccan

# Deccan Land

## February | FEB 2025



ఫిబ్రవరి - 2025

DECCAN LAND, HYDERABAD


150

FEBRUARY - 2025

₹30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక




VOL 13వ వసంతంలో
150 ISSUES నూట యాభై వ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్

- తెలంగాణ తొట్టతొలి స్మారకచిత్రం
- రాఖీగఢీ వద్ద భారీ జలాశయం గుర్తింపు
- ఉమ్మడి చిత్తూరు: శిలా & ఖనిజం
- ఎడితనూర్ - రాతిపుటల్లో రాసిన చరిత్ర

# VOL 13వ వసంతంలో
# 150 ISSUES నూట యాభై వ సంచిక
## పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్





దక్కన్

## పన్నెండు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2025 జనవరి సంచికతో 149 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).








**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007




## సరస్వతీ నది - రాఖీగఢీ

హరియాణాలోని రాఖీగఢీలో గత నెలలో బయటపడిన జలాశయం హరప్పా ఇంజనీరింగ్‌కు సంబంధించిన ఒక అద్భుతం మాత్రమే కాదు, సరస్వతి నదిపై చురుగ్గా సాగుతున్న పరిశోధనలను మరింత ముందుకు కూడా తీసుకువెళుతుంది. రాఖీగఢీలో పురావస్తు శాస్త్రవేత్తల బృందం అక్కడి గ్రామానికి చెందిన కూలీలతో కలిసి కొన్ని వారాల క్రితం 10x10 కందకం నుండి కొన్ని పిడికిళ్ల బురదను బయటకు తీసింది. ఆ బురదను చూస్తుంటే వారి కళ్ళు విప్పారాయి. పురావస్తు శాస్త్రవేత్తలంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. వణుకుతున్న బురద మరకల చేతులతో, వారు శతాబ్దాల నాటి బురదను బయటకు తీశారు. ఆ విశేషాలేంటో తెలుసుకుందాం.

*ప్రత్యేక వ్యాసం : 29 పేజీలో*

TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com    website : www.deccanland.com







## ఐదేళ్లుగా దక్కన్‌ల్యాండ్ అభిమానిని

2021 నుండి ప్రతి మాసం లోకేశ్వర్ గారి ఆర్టికల్స్ (మూసీ ముచ్చట్లు) రెగ్యులర్‌గా చదువుతున్నాను. అలా ప్రతి మాసం వారి ఆర్టికల్ కోసం చదివే నాకు చరిత్ర మీద, హెరిటేజ్ మీద ఆసక్తి కల్గింది. ఈమని శివనాగిరెడ్డి, శ్రీరామోజు హరగోపాల్ ఎంతో పరిశోధనాత్మక వ్యాసాలు అందిస్తున్నారు. వీరి శ్రమకు తగినట్టుగానే సంపాదకవర్గం వ్యాసాల ప్రజంటేషన్ చాలా అద్భుతంగా తీర్చిదిద్దుతున్నది. పత్రిక చూడగానే ఆకట్టుకునేలా అందంగా డిజైన్ చేస్తున్న డెస్క్‌కు, ఎడిటర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు. **-పవన్**

❖ ❖ ❖

## కాకతీయుల వైభవం పెంబర్తి హస్తకళ

మన రాష్ట్రానికి వచ్చిన అతిథులకు, మన దేశానికి వచ్చిన ఇతర దేశాధి నేతలకు సైతం ప్రభుత్వం తరపున జ్ఞాపికలను అందజేస్తుంటారు. అందులో పెంబర్తి హస్తకళ మెమెంటోలు మొదటి స్థానంలో వుంటాయి. ఇవి భారతదేశం యొక్క సంస్కృతి, నాగరికత యొక్క మూలాధారం, సాంప్రదాయ కళలు, చేతిపనుల యొక్క గొప్ప మూలాలు. విశ్వకర్మల యొక్క అద్భుతమైన నైపుణ్యం, విలువైన ప్రాచీనతకు బహుమతి. కాకతీయ సామ్రాజ్య కాలంలో వరంగల్ జిల్లాలోని పెంబర్తి ప్రాంతం వైభవాన్ని సంతరించుకుంది. తెలంగాణ ప్రాంతంలోని చాలా పురాతన దేవాలయాలు కాకతీయ పాలకుల ఆధ్వర్యంలో నిర్మించబడినందున, ఈ దేవాలయాలు పెంబర్తి కళాకారుల సంతకం శైలిని కలిగి ఉన్నాయి. ఈ ప్రాంతం లోని విశ్వకర్మలు లోహ శిల్పంలో అరుదైన నైపుణ్యాలకు ప్రసిద్ధి చెందారు. హిందూ విగ్రహాలు, రథాలు, జ్ఞాపికలకు పెంబర్తి షీట్ మెటల్ పనిని దేశం నలుమూలల నుండి దృష్టిని ఆకర్షించింది. రచయిత సువేగా పెంబర్తి హస్తకళల విశిష్టతను చక్కగా వివరించారు. వీటిని ఖండాంతరాలకు వ్యాపింప చేయాలంటే ప్రభుత్వ తోడ్పాటు అవసరం ఎంతైనా ఉంది. **-ఎస్. పద్మావతి,** వరంగల్

❖ ❖ ❖

## స్త్రీ పాత్రల రూపశిల్పి శ్యామ్ బెనగల్

బెనగళ్ళ శ్యామ్ సుందరరావు జన్మతః కన్నడి అయినప్పటికీ తెలంగాణలో పుట్టి పెరగడం వల్ల తెలంగాణ చైతన్యం ఆయనలో చివరికంటూ ఉంది. సికింద్రాబాద్‌లోని అల్వాల్‌లో జన్మించిన వీరు నగరంలోని నిజాం కాలేజీలో ఇంగ్లీష్ సాహిత్యం తరగతులకు సైకిల్ మీద వెళ్లేవారు. వీరు రాష్ట్ర సైక్లింగ్, ఈత చాంపియన్. దీంతో వారు డైరెక్టరే కాక క్రీడాకారుడు అని మనకు అర్థమవుతుంది. వారి సినిమాలలో హైదరాబాద్‌కు వారికి ఉండే అనుబంధం ప్రతిబింబించేది. పాఠకుల కోసం వీరి గురించి ఎన్నో విషయాలను తెలియజేసిన దక్కన్‌ల్యాండ్ పత్రికకు కృతజ్ఞతలు. శ్యామ్ బెనగల్‌కు నా బాధాప్త హృదయాంజలితో నివాళులు అర్పిస్తున్నాను.

**-ఖదీర్,** సికింద్రాబాద్

❖ ❖ ❖

## పర్యావరణం మన బాధ్యత

పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాల గురించి, భారతదేశంలో పర్యావరణ పరిరక్షణ చరిత్ర గురించి రచయిత ఎసికె. శ్రీహరి చాలా క్లుప్తంగా తెలియజేశారు. జల కాలుష్యం, వాయు కాలుష్యం, భూ కాలుష్యం గురించి చైనా, కెనడా, ఫ్రాన్స్ వివిధ దేశాలు, మన దేశం అనుసరిస్తున్న విధానాలను ఉదాహరణలతో తెలిపారు.

**-జగన్నాథం,** వనస్థలిపురం

## దామగుండం కాపాడుకుందాం

అక్టోబర్ సంచికలో 'దామగుండం కాపాడుకుందాం' సంపాదకీయం తెలంగాణ సమాజం తెలుసుకోవాల్సి ఉంది. అనంతగిరి కొండలలో రాడార్ కేంద్ర నిర్మాణం కోసం 12 లక్షల వృక్ష సంపద, ఔషధ సంపద కోల్పోవాల్సి వస్తుందని తెలిస్తేనే చాలా బాధవుతుంది. ఆ విధ్వంసం జరగకుండ తెలంగాణ తగిన విధంగా స్పందించగలదా? అడ్డుకోగలదా అనే అనుమానం కూడా కలుగుతున్నది. అలాగే పరవస్తు లోకేశ్వర్ గారి నాటి సర్కారీ ఉచిత దవాఖానాలు, ఉచిత సూఫీ వైద్యము ఇప్పటికీ మనం అంటే ఆ తరం వారము, వాడిన వంటింటి చిట్కాలు చాలా వరకు ఇప్పుడొస్తున్న జబ్బులు కూడా అతి తక్కువ ఖర్చుతో తగ్గించుకోగలిగినవే అని నా విశ్వాసం.

**- రాములు చందా,** విశ్రాంత అధ్యాపకులు

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

**- ఎడిటర్**

ISSN 2581-3188

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 13 సంచిక : 6 పేజీలు : 60

ఫిబ్రవరి - 2025

సంపాదకులు
**మణికొండ వేదకుమార్**
9848044713
edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు
**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్
**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు
**సయ్యద్ ఖైజర్ భాష**
9030626288

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**

కవర్‌పేజీ
**సరస్వతీ నది - రాఖీగఢీ**

layout - Composing & Printed @
DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**
దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు
సలహాలు, సూచనలు అందించిన
వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.

విషయసూచిక

# లోపలి పేజీల్లో...




కవర్ స్టోరీ
29వ పేజీలో

తెలంగాణలో
గంగిరెద్దులాట





భారతదేశ
అభివృద్ధిలో
రేడియో పాత్ర

మంత్రి శ్రీనివాసరావు ..... డా. జె. విజయకుమార్ ..... 6
జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం ..... (ఎడిటోరియల్) ..... వేదకుమార్. యం ..... 7
దీప్తిమాన వజ్రః ..... చకిలం వేణుగోపాలరావు ..... 9
జీవితంలో సైన్స్ యొక్క ప్రాముఖ్యత ..... సత్య ప్రసన్న ..... 12
ప్రపంచ పాదయాత్రికుడు ..... పరవస్తు లోకేశ్వర్ ..... 13
తెలంగాణా తొట్టతొలి స్మారకచిత్రం ..... ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ..... 16
ప్రొటీన్ ఇంజినీరింగ్‌లో సంచలనం..!! ..... పుట్టా పెద్దఓబులేసు ..... 17
గౌరాదేవి - చిప్కో ఉద్యమ బీజం ..... డా॥ ఆర్. సీతారామారావు ..... 21
తెలంగాణలో గంగిరెద్దులాట ..... అరుంధతి ..... 23
ఉమ్మడి చిత్తూరు జిల్లా శిలా మరియు ఖనిజ సంపద ..... కమతం మహేందర్‌రెడ్డి ..... 27
రాఖీగఢీ వద్ద భారీ జలాశయం గుర్తింపు ..... కిషన్ మురారి ..... 29
నకాశి కళకు వన్నె తెచ్చిన చేర్యాల స్క్రోల్ పెయింటింగ్ ..... సువేగా ..... 33
భారత దేశ అభివృద్ధిలో రేడియో పాత్ర ..... ఎసికె. శ్రీహరి ..... 35
ఆదివాసీల ఐక్యతారాగం నాగోబా జాతర ..... కె. శ్యామల ..... 38
ఎడితనూర్-రాతిపుటల్లో రాసిన చరిత్ర ..... శ్రీరామోజు హరగోపాల్ ..... 39
విహంగం.. వీక్షణం ..... ఖైజర్ భాష ..... 43
మానవ, వన్యప్రాణులకు 'వన్ హెల్త్' విధానం ..... హిమాన్షు నిత్నావేర్ ..... 44
జీవవైవిధ్య నష్టం - పిల్ల ఆరోగ్యానికి చేటు ..... మధుమితా పాల్ ..... 45
గిరి 'గడబ' ప్రకృతితో మమేకం ..... కె. సచిన్ ..... 47
చాళుక్యుల శిల్ప సంపదకు ముప్పు! ..... గుముడాల చక్రవర్తి గౌడ్ ..... 49
చెమట చుక్కలకు తర్ఫీదు ..... చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ..... 50
కొల్లాపురం సంస్థానం ..... డా॥ కె. కృష్ణమూర్తి ..... 51
చదువురాని సోగ్గాడు ..... డా॥ జనపాల శంకర్ ..... 53
లీలావతి గణితం ..... డా॥ నాగసూరి వేణుగోపాల్ ..... 55
రాగి రకాలు - సాగు మెళుకువలు ..... టి.స్వామి ..... 56
గురు శిష్యుల అనుబంధాన్ని తెలిపే కథలు ..... కందుకూరి భాస్కర్ ..... 57

**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# మంత్రి శ్రీనివాసరావు

నిజాం కళాశాలలో సాధారణ విద్యార్థిగా ఓ తెలంగాణ యువకుడు చదువుతోపాటు నాటకాలపై దృష్టి సారించాడు. ఆ అభిరుచి అంతటితో ఆగిపోకుండా లండన్ వెళ్ళి నాటక రంగంలో అధ్యయనం చేసేలా బాటలు వేసింది. నటశిక్షణలో ఉన్నత విద్యనభ్యసించిన ఆయన తెలుగు నాటకం రంగంలో ఆధునిక నాటక ప్రయోగాలకు మార్గదర్శకుడయ్యాడు. అంతేకాకుండా దక్షిణ భారతదేశంలో తొలిసారిగా ఏర్పడిన రంగస్థలం విభాగానికి యూనివర్శిటీ స్థాయిలో అధిపతి అయ్యారు. ఆయన ఎవరోకాదు మంత్రి శ్రీనివాసరావు.



మంత్రి శ్రీనివాసరావు రంగారెడ్డి జిల్లా కందుకూరు సమీపంలోని బచ్చుపల్లిలో మంత్రి రామచంద్రరావు, రాజ్యలక్ష్మి దంపతులకు 1928 జనవరి 1న జన్మించారు. ఆయన పాత నగరంలోని ముఫీద్-ఉల్-ఆలం హైస్కూలులో ప్రాథమిక విద్యనభ్యసించిన తరువాత నిజాం కళాశాలలో ఇంటర్, డిగ్రీ, మాస్టర్ డిగ్రీలను పూర్తిచేశారు. అప్పట్లో నిజాం కళాశాల గొప్ప సాంస్కృతిక కేంద్రంగా వర్ధిల్లేది. అక్కడ అధ్యాపకుల ప్రోత్సాహంతో విద్యార్థులు షేక్స్పియర్, బ్రెక్ట్, చెకోవ్‌ల ఆంగ్ల నాటకాలను నిజాం కళాశాల వార్షికోత్సవాల్లో విరివిగా ప్రదర్శించేవారు. ఈ నేపథ్యమే కళాశాలలో చేరిన మంత్రి శ్రీనివాసరావుపై ప్రభావం చూపింది. 1945లో నిజాం కళాశాల విద్యార్థిగా చేరిన మంత్రి నాటకాల పట్ల ప్రభావితుడై ఆంగ్ల నాటకాలతోపాటు తెలుగు నాటకాలను ప్రదర్శించడం మొదలుపెట్టారు.

మంత్రి శ్రీనివాసరావు నిజాం కళాశాలలో చదువుతున్నపుడే ప్రముఖ సాహితీవేత్త, జర్నలిస్టు అబ్బూరి వరద రాజేశ్వరరావుతో స్నేహం ఏర్పడింది. మంత్రి నాటక ఆసక్తిని గమనించిన ఆయన ప్రపంచ నాటక రంగాన్ని పరిచయం చేసాడు. అంతేకాదు సరోజినినాయుడి కుమారుడు జయసూర్య ద్వారా కావలసిన నాటక పుస్తకాలను సంపాదించి మంత్రికి ఇచ్చేవాడు. ఈ అధ్యయనమే మంత్రి శ్రీనివాసరావు ఆధునిక తెలుగు నాటకంవైపు దృష్టి సారించేలా చేసింది. అదే సమయంలో నాటకరంగ ప్రముఖులు ఏ.ఆర్. కృష్ణతో పరిచయం ఏర్పడింది.

ఆధునిక నాటక ప్రయోగాలపట్ల ఇద్దరి భావాలు ఏకసూత్రం కావడంతో నాటక వికాసంకోసం నడుంకట్టారు. 1952లో ఇండియన్ నేషనల్ థియేటర్ (INT) హైదరాబాద్‌లో ప్రారంభించారు. హైదరాబాద్‌లో ఆంగ్ల నాటకాల వ్యాప్తికి కృషి చేసిన హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ భార్య కమలాదేవి ఛటోపాధ్యాయ జాతీయ నాట్య సంఘానికి అధ్యక్షులుగా ఉండేవారు. ఆమె ప్రోత్సాహంతో మంత్రి శ్రీనివాసరావు, ఏ.ఆర్. కృష్ణలు INT నాటకోత్సవాలను సిటీ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఇందులో బెల్లంకొండ రామదాసు 'మాస్టార్జీ' నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకం హైదరాబాద్, ఇతర తెలంగాణా ప్రాంతాల్లో విశేషంగా ఆదరించడంతో మరిన్ని కొత్తనాటకాలు ఆవిష్కృతమయ్యాయి.

అబ్బూరి రామకృష్ణారావు బహుభాషావేత్త. ప్రఖ్యాత కవి, తెలుగు నాటక ప్రయోగాల మార్గదర్శిగా ప్రసిద్ధులు. వరద రాజేశ్వరరావు ద్వారా అబ్బూరి వారి పరిచయం ఏర్పడ్డది. అబ్బూరి ఆధునిక నాటక ప్రయోగాల పట్ల మంత్రి ప్రభావితుడయ్యాడు. నాటకాన్ని ఆధునిక దృక్కోణంలో దర్శించడం మొదలుపెట్టాడు. ఆ రోజుల్లోనే మంత్రి నటశిక్షణ, నాటక ప్రదర్శన, శాస్త్రీయ పద్ధతిలో సాగాలని పరితపించాడు. ఇందువల్లనే తరువాత కాలంలో మంత్రి శ్రీనివారావు అబ్బూరికి ప్రియశిష్యుడయ్యాడు.

హైదరాబాద్ నాట్య సంఘం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా సికింద్రాబాద్ మహబూబ్ కాలేజ్ వేదికగా నాటక పోటీలు నిర్వహించారు. మంత్రి సారథ్యంలో 'ఇన్స్‌పెక్టర్ జనరల్' నాటకాన్ని ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. ఈ నాటకం మంత్రికి గుర్తింపు తెచ్చిపెట్టింది. 1957లో ఐఎన్‌టి నాటకోత్సవాల సందర్భంగా కుందుర్తి ఆంజనేయులు వచన కవితాశైలిలో రాసిన 'ఆశ' నాటకాన్ని మంత్రి ఎక్స్పరిమెంట్ డ్రామాగా ప్రదర్శించారు. ఈ నాటకానికి ఆయనే ప్రయోక్త. ఈ నాటకంలో మంత్రి, ప్రొఫెసర్ రమామేల్కొటే కలిసి నటించారు. ఈ నాటకం మంత్రిని సృజనాత్మక నాటక ప్రయోక్తగా నిలబెట్టింది.

1957లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సంగీత నాటక అకాడమీని ఏర్పాటు చేసింది. ఇందులో మంత్రి శ్రీనివాసరావును అకాడమీ సభ్యుడిగా ప్రభుత్వం నియమించింది. అకాడమీ ప్రారంభోత్సవాల సందర్భంగా 'నిచ్చెనలు' అనే నాటికను ప్రదర్శించారు. ఇందులో మంత్రి శ్రీనివాసరావు, పన్నూరి రామారావు మొదలైనవారు నటించారు.

### ఉద్యోగిగా మంత్రి శ్రీనివాసరావు

హైదరాబాద్‌లో పోలీస్ యాక్షన్‌కు పూర్వం నిజాం ప్రభుత్వంలో పోలీసు శాఖలో మంత్రి శ్రీనివాసరావు పనిచేసేవారు. ఆ తరువాత హైదరాబాద్ రాష్ట్రం సెక్రటేరియట్‌లో అనువాదకుడిగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక సమాచార శాఖలోని అనువాద విభాగంలో కొత్త ఉద్యోగంలోకి మారారు. ఆ విభాగానికి ప్రముఖ సాహితీవేత్త డా. బోయి భీమన్న అధిపతిగా ఉండేవారు. తరువాతికాలంలో

(తరువాయి 8వ పేజీలో)




# జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం

జీవ వైవిధ్యం సమస్త ప్రకృతికి సంబంధించిన విలువైన ఒక విలువ. భూమి, గాలి, నీరు అడవుల వంటి సహజ సిద్ధమైన ప్రకృతి వనరుల ఆధారంగానే సకల మానవజాతి, జీవరాశుల మనుగడ సాగుతున్నది. ప్రకృతి అందిస్తున్న అందమైన జీవితాన్ని అందిపుచ్చుకోవడం కాకుండా తన గుప్పిట పట్టుకుని తన ఒక్కరి జేబులోనే వేసుకోవాలనే అత్యాశ మనిషిని, మనిషి జీవితాన్ని వికృతం చేస్తుంది. అడవి ఆదివాసులకే పరిమితమై ఉన్నప్పుడు ప్రకృతి విధ్వంసం జరగలేదు. జీవ వైవిధ్యానికి ముప్పు రాలేదు. ఆదివాసులూ, అడవిలోని సకల జీవరాశుల మధ్య వైరుధ్యాలతో పాటు కలిసి మెలిసి జీవనం సాగింది. అడవిలోనూ, అడవి బయటా అంతటా పచ్చదనమే.

ఎప్పుడైతే ఆధునిక మానవుడు, కార్పోరేట్ వ్యాపారీ అడవిలో పాదం మోపారో అప్పుడే అడవితల్లి జీవన ధ్వంసం ప్రారంభమైంది. అడవుల నరకివేత వివిధ జీవరాశులను నిరాశ్రయుల్ని చేసింది. అడవుల నరికివేతవల్ల వాతావరణ మార్పులు జరిగి విపరీత వర్షాలు, వరదలు, కొండ చరియలు పడిపోవడం భారీ ప్రాజెక్టుల వల్ల నదీ ప్రాంతాల నేలలు నిస్సారమవడం, భూకంపాలు, స్థానిక ప్రజలు నిరాశ్రయులవటం, ఒక అజమాయిషీ లేని పారిశ్రామిక విధానాల వల్ల పరిశ్రమలు కల్పిస్తున్న జలకాలుష్యం, వాయు కాలుష్యం వంటి వాటి వల్ల పర్యావరణ సమతుల్యత నాశనమవుతున్నది. జీవ వైవిధ్యాన్ని వివిధ వ్యవస్థలూ, విధానాలూ తారుమారు చేస్తున్నాయి.

ప్రజల భద్రత పట్ల, జీవరాశుల భద్రత పట్ల జవాబుదారీతనం లేకుండా పోతున్నది. ఈ పద్ధతిని నివారించాలంటే బలమైన పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలు ఒక్కటే మార్గం. పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలకు శతాబ్దాల చరిత్ర ఉంది. 1730లో భిష్ణోయ్ ఉద్యమం జరిగింది. రాజు తన సౌధ నిర్మాణం కలప కోసం చెట్లను నరికించే ప్రయత్నం చేయగా అమృత అనే మహిళా నాయకత్వంలో 356 మంది మహిళలు చెట్లను కావలించుకుని 'ముందు మమ్మలి నరకండి. తరవాత చెట్లను నరకండి' అని నిలబడ్డారు. ఆ సైనికులు వాళ్లందరినీ నరికి తర్వాత చెట్లను నరికారు. రాజు నివ్వెరపోయి చెట్లు నరికివేతను నిషేధించాడు. ఈ సంఘటన ప్రేరణతో తరువాత అనేక ఉద్యమాలు జరిగాయి. 1973 సుందర్‌లాల్ బహుగుణ నాయకత్వంలో చిప్కో ఉద్యమం మొదలైంది. చిప్కో అంటే హత్తుకోవడం, ఆలింగనం చేసుకోవడం అని అర్థం. చిప్కో ఉద్యమానికి గిరిజన మహిళ గౌరాదేవి కూడా నాయకత్వం వహించింది. చిప్కో ఉద్యమం ప్రపంచ వ్యాప్త ఉద్యమాలకు ప్రేరణగా నిలిచింది. చిప్కో మొదలు మన సోంపేట వరకు దేశవ్యాప్తంగా ఇరవై ఉద్యమాలు జరిగాయి. అన్నీ శాంతియుతంగా అహింసా పద్ధతుల్లో జరిగాయి.

మానవ ప్రవర్తన ద్వారాగానీ, పాలనా విధనాల వల్ల గానీ ప్రకృతి సహజ వనరులకు హాని జరగకుండా కాపాడుకోవాలి. అడవుల నరికివేత, ఖనిజ సంపద కోసం తవ్వకాలు, భారీ ప్రాజెక్టుల నిర్మాణాల మీద నియంత్రణ ఉండాలి. జల, వాయు కాలుష్యాలకు తావులేని పారిశ్రామిక విధానాలు అవలంభించాలి. వాతావరణ సమతుల్యత కోసం మొక్కలు నాటటం, చెరువుల నిర్మాణాలు, ఎత్తిపోతల వంటి పథకాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు లేని సేంద్రియ వ్యవసాయం కోసం కృషి చేయాలి.

జీవ వైవిధ్యం మనిషి మనుగడకు అత్యంత అవసరం. ప్రకృతిని, జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత.

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

అదేశాఖలో పౌరసంబంధాల అధిపతిగా నియమితులయ్యారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే నాటక రంగానికి అంకితమై పనిచేశారాయన. ఈ ఉద్యోగం ఎంతోమంది కవులు, కళాకారులను పరిచయం చేసింది. ఆయన చేసే నాటకరంగ కార్యక్రమాలకు దోహదపడేలా చేసింది.

**తొలితరం నటశిక్షణ అధ్యాపకుడు**

నాటకరంగానికి శాస్త్రీయపద్ధతిలో నటీనటులను తయారు చేయాలన్న సంకల్పంతో 1959తో నాట్యవిద్యాలయం హైదరాబాదులో ఏర్పడింది. అబ్బూరి రామకృష్ణారావు డైరెక్టరుగా ఏ.ఆర్. కృష్ణ. మంత్రి శ్రీనివాసరావు అధ్యాపకులుగా విద్యార్థులకు నటనలో శిక్షణ లందించేవారు. ఆనాటి నాట్య విద్యాలయం ఒక థియేటర్ లేబరేటరీగా పనిచేసేది. ఇక్కడ సరికొత్త ప్రయోగాలకు ఓ రూపాన్నిచ్చి ఆధునిక ప్రక్రియలో నాటకాలను ప్రదర్శించేవారు. 'కన్యాశుల్కం', 'మృచ్ఛకటికం' వంటి నాటకాలను ప్రయోగాత్మకంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళారు.

'కన్యాశుల్కం' నాటకాన్ని గొప్ప గొప్ప నటులు ఇదివరకే ప్రదర్శించినప్పటికీ మంత్రి శ్రీనివాసరావు నిర్వహణ, అబ్బూరి రామకృష్ణారావు దర్శకత్వం, అబ్బూరి గోపాలకృష్ణ డిజైన్‌తో పబ్లిక్ గార్డెన్‌లో విభిన్న సాంకేతిక అంశాలతో ప్రదర్శితమైంది. ఆ రోజుల్లో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన చైనీస్ గార్డెన్ (సరోర్‌బాగ్)లో కొత్త తరహా రంగాలంకరణతో వేదికపై తెరలు లేకుండా 'లైట్సాఫ్-లైట్సాన్' లోనే 'కన్యాశుల్కం' నాటకాన్ని ప్రదర్శించారు. ఆనాటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పూర్తి నాటకాన్ని చూసి నటీనటులను అభినందించారు. ఆ రోజుల్లో గొప్ప ప్రయోగంగా ఆ తరంవారు ఇప్పటికీ చెప్పుకుంటారు.

> **నిరంతరం నాటకం గురించి ఆలోచించే మంత్రికి నాటక ప్రయోగాలపట్ల వ్యామోహం తగ్గలేదు. రాష్ట్ర సమాచార శాఖలో పనిచేస్తున్న సమయంలోనే ఆయన 1961లో సంవత్సరం పాటు సెలవు తీసుకుని ప్రముఖ బ్రిటిష్ రంగస్థల నిపుణులు 'హెర్బర్ట్ మార్షల్' బొంబాయిలో నిర్వహిస్తున్న నటశిక్షణ పాఠశాలలో ప్రత్యేక కోర్సును పూర్తిచేశారు.**

నిరంతరం నాటకం గురించి ఆలోచించే మంత్రికి నాటక ప్రయోగాలపట్ల వ్యామోహం తగ్గలేదు. రాష్ట్ర సమాచార శాఖలో పనిచేస్తున్న సమయంలోనే ఆయన 1961లో సంవత్సరంపాటు సెలవు తీసుకుని ప్రముఖ బ్రిటిష్ రంగస్థల నిపుణులు 'హెర్బర్ట్ మార్షల్' బొంబాయిలో నిర్వహిస్తున్న నటశిక్షణ పాఠశాలలో ప్రత్యేక కోర్సును పూర్తిచేశారు. అక్కడ "డైరీ ఆఫ్ అనే ఫ్రాంక్" ఆంగ్లనాటకంలో ప్రాముఖ్యత కలిగిన పాత్రను పోషించి అభినయ ప్రదర్శనలో తన ప్రత్యేకతను చాటాడు. ఆ తరువాత 1963లో నటనలో ప్రత్యేక శిక్షణ నిమిత్తం లండన్‌లోని బ్రిటిష్ డ్రామా లీగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. భారతదేశం నుండి కేవలం నలుగురిని మాత్రమే ఎంపిక చేసే ఈ కోర్సుకు అనేక వడపోతల్లో మంత్రి శ్రీనివాసరావు ఎంపికయ్యారు.

విమానంలో వెళ్ళడానికి ఆయన దగ్గర సరిపడా డబ్బు లేకపోవడంతో 13 రోజులపాటు ఓడపై సముద్ర ప్రయాణం చేసి మంత్రి శ్రీనివాసరావు లండన్ చేరుకున్నారు. లండన్‌లో సంవత్సరం పాటు శిక్షణ కొనసాగింది. ఈ మధ్యలో శ్రీనివాసరావు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. అయినప్పటికీ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత పొంది విదేశాల్లో 'యాక్టింగ్ డిప్లొమా' సాధించిన కీర్తి మంత్రి శ్రీనివాసరావుకు దక్కింది. లండన్ నుండి హైదరాబాదుకు తిరిగి వచ్చిన తరువాత మంత్రి శ్రీనివాసరావు తన చివరి మజిలీ వరకు నాటకాన్ని వదలలేదు. విదేశాల్లో నేర్చుకున్న విద్యను మంత్రి తెలుగునాట నాటక వ్యాప్తికి ఉపయోగించారు.

**ఆంధ్ర విశ్వవిద్యాలయం తొలి రంగస్థల శాఖాధిపతిగా...**

ఆంధ్ర విశ్వవిద్యాలయం 1966లో నాటక శాఖను (Theatre Arts Dept.) ప్రారంభించింది. అప్పటివరకూ భారతదేశంలో కేవలం National School of Drama (NSD) మాత్రమే ఉండేది. ఉద్యోగ ప్రకటన ద్వారా హైదరాబాద్ నాట్య విద్యాలయంలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న మంత్రి శ్రీనివాసరావును ఆనాటి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస అయ్యంగార్ నాటకశాఖ ఆచార్యుడిగా ఎంపిక చేశారు. విశ్వవిద్యాలయ స్థాయిలో బోధనార్హతలు ఆ రోజుల్లో మంత్రి శ్రీనివాసరావుకు ఉండటంతో దక్షిణ భారతదేశంలో ఏర్పడిన తొలి రంగస్థల శాఖకు ఆయన మొదటి శాఖాధిపతిగా నియమితులయ్యారు.

మంత్రి తెలంగాణ భాషను, యాసను ఎంతగా ప్రేమించేవాడో తాను పనిచేస్తున్న ప్రాంత మాండలికాన్ని కూడా అంతే గౌరవించేవాడు. మాండలికాల్లోనే ప్రజల జీవితం దాగుందని ఆయన భావన. ఇక్కడి మాండలికాల్లో ప్రదర్శిస్తే ప్రజలు నాటకాన్ని ఆదరించి బ్రతికిస్తారని మంత్రి విశ్వసించాడు. ఆ ప్రయత్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటక ప్రయోగాల్లో కనిపిస్తుంది. ఆ ప్రాంత సంస్కృతిని ప్రతిబింబించేలా గణేశ్‌పాత్రోచే శ్రీకాకుళం మాండలికంలో 'కొడుకు పుట్టాల' నాటకాన్ని, అత్తిలి కృష్ణారావుచే విశాఖ మాండలికంలో 'యుగసంధ్య' నాటకాన్ని రచించేలా మంత్రి దోహదపడ్డారు. విద్యార్థులచే ప్రదర్శితమైన ఈ నాటకాలకు ఆ రోజుల్లో ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. దానికి మంత్రి మార్గదర్శకత్వమే మూలకారణం.

తెలుగు అకాడమీ ప్రచురించిన 'రంగస్థలశాస్త్రం' అనే పాఠ్యగ్రంథానికి మంత్రి రచయితగా ఉన్నారు. సుదీర్ఘకాలంగా నాటకరంగంలో తలమునకలై పనిచేస్తున్న మంత్రి శ్రీనివాసరావుకు తన ఆరోగ్యం పట్ల శ్రద్ధ ఉండేదికాదు. ఆంధ్ర యూనివర్శిటీలో పనిచేస్తున్న కాలంలోనే అనారోగ్యంతో బాధపడ్డారు. రంగస్థల కళల శాఖ విద్యార్థులు ప్రదర్శించబోయే నాటక ఏర్పాట్లలో మునిగి పోయిన సమయంలోనే మంత్రి తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. అత్యవసర వైద్య నిమిత్తం విశాఖలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ 9 అక్టోబరు 1974లో అకాల మరణం చెందారు. అప్పటికాయనకు 46 ఏండ్లే. తెలుగు ఆధునిక నాటక వికాసానికి, తెలంగాణ ఆధునిక నాటక చైతన్యానికి మంత్రి శ్రీనివాసరావు చేసిన కృషి చిరస్మరణీయం.

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన 'తెలంగాణ తేజోమూర్తులు' నుంచి)*

**- డా. జె. విజయకుమార్**

# దీప్తిమాన వజ్రః

"దీప్తిమాన వజ్రః" ప్రకాశవంతంగా ఉండటం వజ్రం యొక్క లక్షణం అని బుద్ధభటుడు తన రత్న పరీక్షలో పేర్కొన్నారు.

**వజ్రపరీక్ష:**

వజ్రాలను పరీక్షించటానికి ముఖ్యంగా దాని రంగు (Colour), ఖండన (Cut), బరువు (Caratage), స్వచ్ఛత (Clarity)లను పరిశీలించడం ద్వారా దాని విలువ నిర్ణయిస్తారు. వీటిని సంక్షిప్తంగా వజ్రాల వ్యాపారంలో 4సి (4C) అని కూడా అంటారు. అయితే వజ్రం యొక్క విలువ, నాణ్యత నిర్ణయం చేయడానికి 4సిలే కాకుండా దాని ప్రదీప్తి (Florescence), నునుపు (Polish), క్యూలెట్ (Culet) అనే లక్షణాలు కూడా పరిశీలించి నాణ్యత నిర్ణయం చేయబడుతుంది. సర్టిఫికెట్ లేదా రిపోర్ట్‌లో సాధారణంగా ఈ విషయాలను క్లుప్తంగా పొందుపరచటం జరుగుతుంది. వజ్రం విలువ ఈ రిపోర్ట్‌లోని అంశాలు ఒక్కటే కాకుండా అనేక ఇతర అంశాలపై ఆధారపడి ఉంటుంది.

**వజ్రదీప్తి:**

వజ్రం యొక్క రంగును దాని ఆకర్షణను ప్రభావితంచేసే ఈ "ఫ్లోరోసెన్స్" అంశం సాధారణంగా పైకికనిపించదు. ప్రయోగశాలలో అతినీలలోహిత కిరణాలు వజ్రంపైన ప్రసరింప చేసినప్పుడు వజ్రాలలో సాధారణంగా ఏరకమైన మార్పు ఉండదు. కాని కొన్ని వజ్రాలు ఆ కాంతిని పరావర్తిస్తూ ఇంకా ప్రకాశవంతంగా అవుతాయి. కాంతిని వేరే తరంగదైర్ఘ్యంలో పరావర్తనంచేసే ఈ లక్షణాన్ని ప్రదీప్తి (Florescence) అంటారు. నూటికి దాదాపు ముప్పై శాతం వరకు వజ్రాలు ఈ లక్షణాలు కలిగిఉంటాయి.



ప్రదీప్తి నీలంరంగులోనే కాకుండా ఎరుపు, పసుపు ఇంకా అనేక ఇతర రంగులలో కూడా ఉంటుంది. దీనిని రిపోర్ట్‌లో పొందుపరచటం కోసం ఏమీలేదు (None) తక్కువ (Faint) మధ్యస్థ (Medium) ఎక్కువ (High) మరియు చాలా ఎక్కువ (Very high) అనే గ్రేడ్‌లో వర్గీకరిస్తారు.

ఈ ఫ్లోరోసెన్స్ వజ్రం యొక్క మార్కెట్‌ను ఎలా ప్రభావితం చేస్తుంది అనే విషయాన్ని పరిశీలిస్తే, మార్కెట్ వర్గాలు ఇలాంటి వజ్రాల పట్ల అనేక కారణాలవల్ల తక్కువ సుముఖత కలిగిఉంటాయి. ఈ లక్షణం వల్ల వజ్రాలు కాస్త జిడ్డుగా కనిపించి రంగు తక్కువగా అనిపిస్తుంది. లేత పసుపు రంగు వజ్రాలు ఫ్లోరోసెంట్‌గా ఉంటే ఆ పసుపు రంగు కనిపించకుండా ఉండే అవకాశం ఉంది. ఇలా 4సి లోని కలర్, క్లారిటీల పై ప్రభావం వల్ల మార్కెట్‌లో ఫ్లోరసెంట్ వజ్రాలు తక్కువధర పలుకుతాయి. ఆభరణాలలో వీటిని సాధారణ వజ్రాల తోపాటు మిశ్రమంగా వాడినప్పుడు, ఫ్లోరోసెంట్ వజ్రాలు రాత్రి వెలుగులో మెరుస్తూ మామూలు వజ్రాలకు వేరుగా కనిపించవచ్చు. ముఖ్యంగా మ్యాచింగ్ పెయిర్‌గా ఉండవలసిన చెవికమ్మలు ఒకటి ఒకరకంగా మరోటి ఇంకోరకంగా కనిపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

మరో సమస్య ఏమిటంటే కృత్రిమ వజ్రాలు (CVD Diamonds) అన్ని ఫ్లోరోసెంట్‌గా ఉంటాయి. అయితే ఇవి ఎక్కువగా అతినీలలోహిత కిరణాల షార్ట్ వేవ్‌లో, సహజ వజ్రాలు లాంగ్ వేవ్‌లో ఫ్లోరోసెంట్‌గా ఉంటాయి. ఫ్లోరోసెన్స్‌తో పాటు కొన్ని వజ్రాలు ఫాస్ఫోరసెన్స్‌ను కూడా కలిగి ఉండవచ్చు. అంటే వజ్రంమీద కాంతి ప్రసరణ ఆగిపోయిన తర్వాత కూడా వజ్రాలు అలాగే కొంచెం సేపు ప్రకాశిస్తూ ఉంటాయి. ఈ లక్షణాన్ని శీతలదీప్తి అనవచ్చు. బహుశా వజ్రాలు చీకటిలో కూడా ప్రకాశిస్తాయి అనుకోవడం ఈ లక్షణం వల్లనే కావచ్చు. సహజ వజ్రాల తోపాటు CVD వజ్రాలు ఈ లక్షణాలు కలిగి ఉంటాయి.

ఈ ఫ్లోరోసెన్స్, ఫాస్ఫరసెన్స్ వల్ల సహజ వజ్రాలు కూడా కృత్రిమ వజ్రాలేమో అన్న భ్రమ కలుగుతుంది. కాబట్టి వ్యాపార వర్గాలు వీటికి తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయి. అయితే ఇది వాణిజ్య పరంగా ఉన్న అంశం మాత్రమే. ఫ్లోరోసెన్స్ లేని లేదా తక్కువ ఫ్లోరోసెన్స్ ఉన్న వజ్రం మార్కెట్‌లో ఎక్కువ విలువ కలిగి ఉంటుంది. అధిక ఫ్లోరోసెన్స్ ఉన్న వజ్రం J,K వంటి కలర్ గ్రేడ్‌లో ఉన్నా అంతకన్నా నాణ్యత గల గ్రేడ్‌లో ఉన్నట్లు కనిపిస్తుంది.

**ఏడు రాళ్ళ కమ్మలు/ బ్లూ జాగర్స్:**

ఒక్కో సారి నీలం రంగులో ఫ్లోరోసెన్స్ ఉండటం వల్ల సహజ వజ్రాలు ఎక్కువ విలువగలవి అవుతాయి. "బ్లూజాగర్స్"గా మార్కెట్లో ప్రసిద్ధి చెందిన వజ్రాలు చాలా ఎక్కువ ధర పలుకుతాయి. వీటితో చేసిన "ఏడు రాళ్ళ కమ్మలు" దక్షిణ భారత దేశంలో చాలా ఆదరించి బడ్డాయి. వీటి ప్రస్తావన తెలుగు జానపద గీతాలలో తరచూ కనిపిస్తుంది. తెలుగు జానపద పాటలలో "ఏడురాళ్ల కమ్మలు" తరచుగా అందం, గాంభీర్యం మరియు దాంపత్య ఆనందానికి చిహ్నంగా పేర్కొనబడ్డాయి.

కొన్ని ఉదాహరణలు:

*"ఏడురాళ్ళ కమ్మలు, పువ్వు ముత్యాల హారాలు*
*ఏడురాళ్ళ కమ్మలు కుంకుమబిందెలే"*

ఇలాంటి పద ప్రయోగాలు తెలుగు జానపద గీతాలలో తరచూ కనిపిస్తాయి.

వేమన శతకంలో..

*"ఏడురాళ్ళ కమ్మలు, పువ్వుల హారములు*
*చెడును గల నెఱటి యుండెదె వేమా?"*


రంగనాథ రామాయణంలో


*"ఏడురాళ్ళ కమ్మలు, ముత్యాల హారములు*
*సీతాదేవి ధరించిన ఆభరణములు"*

భాస్కం రామాయణంలో

*"ఎడురాళ్ళ కమ్మలు, రత్నాల హారములు*
*మండోదరి ధరించిన ఆభరణములు"* అని పేర్కొనబడింది.

ఇలా తెలుగువారికి దగ్గరైన ఏడురాళ్ళ కమ్మలు సాధారణంగా వజ్రాల కమ్మలే!





వీటిని బ్లూజాగర్స్ వజ్రాలతో చేయిస్తే దాని విలువ ద్విగుణీకృతం అవుతుంది. ఈ బ్లూజాగర్స్ నిజానికి నీలిరంగులో ఉండవు. ఇవి ఏరంగు లేని D రకం వజ్రాలు. వీటిలోఉన్న ఇతర చేరికల వల్ల అధిక ఫ్లోరోసెన్స్ కలిగి సూర్యకాంతిలో కూడా నీలంరంగులో కనిపిస్తాయి. దక్షిణఆఫ్రికాలో ఉన్న జాగర్స్ ఫోన్‌టైన్ (Jagersfontein) గనిలో దొరికేవజ్రాలు ఈ లక్షణాన్ని కలిగి ఉండటం వల్ల ఈవజ్రాలు "బ్లూ జాగర్స్"గా మార్కెట్లో చెలామణి అవుతున్నాయి. అయితే ఈ గనులు 1971లో మూతపడ్డాయి. అందువల్ల మార్కెట్‌లో వీటి ధర ఇంకాఎక్కువ అయింది.

**జాగర్స్ఫోంటేన్ గనుల చరిత్ర:**

బ్లూ జాగర్స్ ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన దక్షిణ ఆఫ్రికాలోని జాగర్స్ఫోంటేన్ అనే పేరు డైమండ్స్ చరిత్రలో చాలాచోట్ల కనిపిస్తుంది. ప్రసిద్ధి చరిత్రకారులు, యాత్రికుల రచనలో కూడా దీని ప్రస్తావన ఉంటుంది. మొదటి రోజుల్లో ఇక్కడ జాన్ జాగర్స్‌కు చెందిన ఒక వ్యవసాయ క్షేత్రం మాత్రమే ఉండేది. దాని యజమాని పేరుమీద క్రమంగా అక్కడ ఒక పట్టణం వెలసింది.

ఈ గనుల్లో మొదటిసారి అల్లువియల్ డైమండ్ కాకుండా గనుల్లో వజ్రాలు దొరకటం ఆరంభం అయింది. దక్షిణాఫ్రికాలో మొదటిసారి 1867లో వండలిమట్టిలో వజ్రాలను కనుగొన్నారు. అప్పటిలో వజ్రాలు గులక రాళ్ళలో మాత్రమే దొరుకుతాయని నమ్మేవారు. జాగర్స్ఫోంటేన్ ఎర్రనినేలలో దాగివున్న వజ్రాలపట్ల అవగాహన ఉండేదికాదు. 1868లో వాల్ నది ఒడ్డున వజ్రాలు కనుగొన్నారు అక్కడ నుండి వస్తున్న ఒక వజ్రాల అన్వేషకుడు తనదారిన పోతూ ఈ వ్యవసాయ క్షేత్రం యజమాని బంధువైన ఒక యువకునికి ఇక్కడ వజ్రాలు దొరికే అవకాశం ఉందని చెప్పి వాటి కోసం ఎలా త్రవ్వాలి, ఎలా వజ్రాన్ని గుర్తించాలి మొదలైన విషయాలను వివరించాడు. ఆ యువకుడు మాత్రం అక్కడ రూబీ, గార్నెట్ వంటివి ఉన్నాయి అనుకున్నాడు. అయితే అతనికి ఒక చిన్న వజ్రం దొరకడంతో స్థానిక గడియారాలు బాగుచేసే వ్యక్తికి 16 పౌండ్లకు అమ్మాడు. ఆ గడియారాలు బాగుచేసే వ్యక్తి కూడా మెదట అది వజ్రం అని నమ్మలేదు. క్రమంగా ఇక్కడ వజ్రాలు ఉన్నాయనే విషయం ధ్రువపడింది. క్రమంగా ఇక్కడ మైనింగ్ అభివృద్ధిచెంది, దశలవారీగా అనేక న్యాయపోరాటాల తరువాత కేప్ టౌన్ కాలనీలో భాగంగా 1876లో ఆరంజ్ ఫ్రీ స్టేట్ నుండి 90,000 పౌండ్ల చెల్లింపు మీద బదిలీ అయింది. క్రమంగా అమ్మకాలు వ్యాపార ఒడంబడికల ద్వారా చివరికి డి బీర్స్ సంస్థ చేతుల్లోకి వచ్చింది. అక్కడ పారిశ్రామిక నగరం కూడా వచ్చింది అలా ఒక వ్యవసాయ క్షేత్రం యజమాని నుండి సార్వజనిక క్షేత్రంగా మారి ప్రఖ్యాత వజ్రాల గనిగా ప్రసిద్ధిమైంది.

ఇక్కడ దొరికే వజ్రాలు నీలంఛాయతో ఎక్కడాలేని విధంగాఉండి "జాగర్" అనే పేరుతో చెలామణీ అయ్యేవి. ఈ వజ్రాలకు ఉన్న నాణ్యత వల్ల "జాగర్స్ఫోంటేన్ గ్రేడ్" అనే నాణ్యత గ్రేడ్ అధికారికంగా గుర్తించబడింది. ఉత్తరోత్తరా ఈ గ్రేడ్ D అని మార్చబడింది. D అనే గ్రేడ్ వజ్రాలు ఏరంగు లేనివిధంగా అత్యంత నాణ్యమైనవిగా ఉంటాయి. ఈ D కలర్‌లో నీలంరంగు ఫ్లోరసెన్స్ ఉండటం ఒక అదనపు గుణంగా గుర్తింపు పొందింది. ఈ నీలం ఫ్లోరసెన్స్, UV light లోనే కాకుండా సూర్యరశ్మిలో కూడా గుర్తించవచ్చు. వీటి ప్రాధాన్యత అర్థం చేసుకున్న తర్వాత వీటిపై అనేక పరిశోధనలు చేశారు. ఈ వజ్రాలు 400 నుండి 670 కిలోమీటర్ల లోతులో ట్రాన్సిషన్ జోన్ నుండి 180 కి.మీ క్రింద ఏర్పడినట్లు తెలుసుకున్నారు

వీటి వయస్సు 3.3 బిలియన్ సంవత్సరాలుగా గుర్తించారు. ఈ ప్రత్యేకతవల్ల ఈ కింబర్‌లైట్లను "సూపర్ కింబర్‌లైట్స్" అంటారు. జాగర్స్ఫోంటేన్ ప్రాంతం భూవిజ్ఞాన శాస్త్రపరంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. క్రమంగా ఈ గనులు దాని దగ్గర ఏర్పడిన పట్టణం ప్రాధాన్యత కోల్పోయాయి. 2010 తర్వాత ఈ గనులు డీ బీర్ నుండి వేరే కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లింది. పునరుద్ధరణ ప్రయత్నాలు జరుగుతున్నాయి. మళ్ళీ మార్కెట్‌లో బ్లూ జాగర్లు కనిపిస్తాయని ఆశిద్దాం.


**రత్న పరీక్షలో యు.వి. లాంప్ ఉపయోగం:**

రత్నంలో ఈ ఫ్లోరసెన్స్ పరీక్షించడానికి మూడు రకాల UV light లాంగ్ వేవ్ (320-400nm), మీడియం వేవ్ (290-320nm) షార్ట్ వేవ్(220-290nm) తరంగం దైర్ఘ్య కల అతినీలలోహిత కిరణాలను వాడుతారు. దీనిలో షార్ట్ వేవ్ వల్ల రత్నాలకు ఒక్కొసారి నష్టం వాటిల్లవచ్చు. ఫ్లోరసెన్స్ పరీక్ష రత్నం యొక్క స్పెక్ట్రోస్కోపీ వంటి ఇతర లక్షణాల పరీక్ష తోపాటు మిశ్రమంగా వాడినప్పుడు అధిక ఫలితం కనిపిస్తుంది.

**రత్నకాంతులు:**

చీకటిలో అతినీలలోహిత కిరణాల ప్రభావం వల్ల ప్రకాశించే స్వభావం (ప్రదీప్తి/ ఫ్లోరసెన్స్) వజ్రాలతోపాటు ఇతర రత్నాలకు కూడా ఉంటుంది. బెనిటోయైట్ ( కాలిఫోర్నియా రాష్ట్రం అధికారిక / జాతీయ రత్నం)ను UV light ద్వారా సులభంగా గుర్తించవచ్చు.

నీలాలు, కెంపులు, మరకతాలలో కూడా ఫ్లోరసెన్స్ ఉంటుంది. దీనిద్వారా ఆయా రత్నాలు ఎక్కడనుంచి వచ్చింది,ఏదైనా ప్రక్రియ ద్వారా మార్పుచేయబడిందా లేదా ఇంకా అది కృత్రిమంగా తయారు చేయబడిందా, అనే అంశాలను తెలుసుకోవచ్చు. రత్నాలకు ఫ్లోరసెన్స్ రెండురకాలుగా ఉంటుంది. దాని సహజగుణం (Intrinsic) అంటే దాని రసాయనిక కూర్పు వంటి వాటివల్ల వచ్చింది రెండవది బాహ్యమైన



కారణాలు (Extrinsic), అంటే వేడిచేసే ప్రక్రియ లేదా రేడియోధార్మిక వికిరణం ద్వారాకూడా సంక్రమించవచ్చు. ఈ లక్షణాన్ని ఆధారంగా చేసుకుని రత్నాల నాణ్యత పుట్టుకవంటి విషయాలు పరీక్షించవచ్చు. కెంపులు ఎరుపు లేదా గులాబీరంగు ఫ్లోరసెన్స్ కలిగి వుండవచ్చు, కాని ఇది దాని సహజరంగుకన్నా తక్కువ తీవ్రత కలిగి ఉంటుంది.

**రూబీల వెలుగు:**

- బర్మా రూబీ లాంగ్ వేవ్‌లో ఎక్కువ ఫ్లోరోసెంట్‌గా ఉంటాయి.
- థాయిలాండ్ రూబీ తక్కువ ఫ్లోరసెన్స్ కలిగివుండవచ్చు.
- వియత్నాం రూబీ ఎక్కువ ఎరుపు ఫ్లోరసెన్స్ కలిగి వుండవచ్చు.
- మడగాస్కర్ రూబీ మిశ్రమంగా ఫ్లోరసెన్స్ కలిగిఉంటుంది.
- క్రృత్రిమ రూబీ తీవ్రత ఎక్కువగా గల అన్నివైపులా సమానంగాఎరుపు ఫ్లోరసెన్స్‌తో ప్రకాశిస్తాయి.

**నీలం కాంతులు:**

నీలాలు ఎరుపు నుండి పసుపురంగు తక్కువగా తీవ్రతగల ఫ్లోరసెన్స్ కలిగివుండవచ్చు. క్రృత్రిమ నీలం తక్కువ తీవ్రతగల ఫ్లోరసెన్స్ అన్నివైపులా సమానంగా ఉంటుంది. నీలిరంగు రత్నం గురించి, నీలకాంతి వజ్రం గురించి ప్రస్తావన మన ప్రాచీన సాహిత్యంలో చాలాచోట్ల ఉంది.

*“నీలం నీలరత్నం భూషణం భూషణాని*
*శ్యామం శ్యామరత్న భూషణం భూషణాని”* – (ఋగ్వేదం)

మేము నీల (ఆకాశం)వంటి నీల దేవతను, మరియు ఆభరణాలతో అలంకరించబడిన దేవతను ఆరాధిస్తాము: రాల్ఫ్ ఇ గ్రిఫిత్ ద్వారా అనువాదం)

*‘తస్యైవం వ్యవస్థితే శ్యామాంతహా కౌస్తుభః.*
*శ్రీ వత్స కౌస్తుభ– శ్యామాంత శ్రీ వత్స కౌస్తుభః’*

మహావిష్ణువు వక్షస్థలంపై సముద్రంవంటి నీలంరంగులో ఉన్న కౌస్తుభ రత్నం ప్రకాశిస్తుంది అని భాగవతంలో ప్రస్తావించబడింది.

‘నీలవజ్ర కుండలం కృష్ణస్య శిరే శోభితే’ అని కూడా భాగవతంలో, ‘నీలవజ్ కుండలం శివపూజాయా ప్రయోజయత్’ అని అగ్ని పురాణంలో చెప్పబడింది.

మన పోతన భాగవతంలో *“కుప్పించి ఎగసిన కుండలమ్ముల కాంతి గగనభాగంబెల్ల గప్పికొనగా...”* అని శ్రీకృష్ణుని గురించి చెప్పిన పద్యం అందరికీ చిరపరితం.

**వజ్రం–పరదేశాలు:**

ఐరోపా వాసులకు మాత్రం 15వ శతాబ్దంలో వీటితో పరిచయం జరిగింది. టైటానిక్ సినిమాలో సముద్రంలోకి విసిరి వేయబడిన కాల్పనిక వజ్రం కూడా నీలంరంగు వజ్రమే!

సమకాలీన కాల్పనిక సాహిత్యంలో “బ్లూడైమండ్” ప్రసక్తి వాణిజ్య సంస్థలు, ఉత్పత్తులు పేరు గాను కాల్పనిక పాత్రల పేరు గాను కనిపిస్తుంది.

**బ్లూ డైమండ్:** బ్లూ జాగర్స్ వాటి ఫ్లోరసెన్స్ వల్ల నీలి కాంతి ప్రతిబింబిస్తాయి కాని నిజమైన నీలిరంగులో ఉండవు. నిజమైన నీలిరంగులో ఉండే వజ్రాలు చాలా అరుదుగా మాత్రమే దొరుకుతాయి. మొత్తం రత్నం ప్రజాతి వజ్రాల్లో 0.02 శాతం మాత్రమే నీలిరంగులో ఉంటాయి. వీటికి నీలిరంగు బోరాన్ చేరికవల్ల, లాటిస్ హైడ్రోజన్ డిఫెక్ట్ వల్లకాని, రేడియో ధార్మిక వికిరణంవల్ల కాని వస్తుంది. ఒక్కోసారి బూడిదవంటి రంగు సూక్ష్మచేరిక (Micro inclusion) వల్ల వచ్చే అవకాశంఉంది. ఈ వజ్రాలలో లేతనీలిరంగులో ఉండే వజ్రాలు ఎక్కువ ఆకర్షణీయ మైనవిగా ఉంటాయి. వీటిలో నీలం, ఆకుపచ్చ నీలం, ఊదారంగు, బూడిదరంగుతో కూడిన నీలం, తదితర ఛాయలు ఉండవచ్చు. వీటిని రంగును బట్టి లేతనీలం నుండి ఫ్యాన్సీబ్లూ వరకు అనేక గ్రేడ్‌లుగా వర్గీకరించారు. బోరాన్ చేరిక వల్ల వచ్చే నీలిరంగు Type IIb వజ్రాలలో ఉంటుంది. వీటికి అసలైన నీలవజ్రాలుగా పరిశ్రమలో గుర్తింపు ఉంది. నైట్రోజన్ లేకపోవడం బోరాన్ చేరిక ఉండే భౌమపరిస్తితి అత్యంత అరుదుగా మాత్రమే ఉంటుంది. ఇవి అత్యధిక లోతుల్లో Sub-lithospheric mantleలో 600 కిలోమీటర్ల లోతుల్లో తయారు అవుతాయని, దీనికి కావలసిన బోరాన్ సబ్డక్షన్ చెందుతున్న సముద్ర తలం లిథోస్పియర్ ద్వారా అందుతుంది అని పరిశోధకులు చెబుతున్నారు. (Smith et al 2018).

ఫ్యాన్సీ బ్లూ డైమండ్‌కు ఉన్న మార్కెట్ విలువ కారణంగా టైప్ IIb రకం వజ్రాలను HPHT ట్రీట్మెంట్ ద్వారా బూడిద రంగును తగ్గించి బ్లూ డైమండ్‌గా అమ్మే ప్రయత్నం చేస్తున్నారు. హైడ్రోజన్ డిఫెక్ట్ వల్ల నీలిరంగులో ఉండే ఆర్గేల్ డైమండ్‌ను కూడా బ్లూ డైమండ్‌గా చెలామణి చేస్తున్నారు.అయితే ఇవి కూడా సహజ వజ్రాలే కావటం వల్ల ధర ఎక్కువగా పలుకుతాయి. ఇంకా క్రృత్రిమ బ్లూ డైమండ్‌లు కూడా మార్కెట్‌లో ఉన్నాయి. కాబట్టి సరి అయిన నీలి వజ్రాలు గుర్తించటంలో జాగ్రత్తలు అవసరం. చరిత్ర ప్రసిద్ధి చెందిన నీలంరంగు type IIb వజ్రాలు ఒకప్పుడు భారతదేశం నుంచి వచ్చినవే. కాని ఇప్పుడు దక్షిణం ఆఫ్రికా కుల్లినాన్ గనులు నుంచి వస్తున్నాయి. హైడ్రోజన్ డిఫెక్ట్ వల్ల నీలిరంగులో ఉండే వజ్రాలు ఆస్ట్రేలియా లోని ఆర్గేల్ గనుల నుంచి వస్తున్నాయి.

**కొన్ని ప్రసిద్ధ నీలంరంగు వజ్రాలు**

హోప్ డైమండ్, విటెల్స్ బ్యాచ్ గ్రెఫ్ డైమండ్, ఒకవాంగా బ్లూ వంటి అనేక వజ్రాలు ఈ రకమైనవే.

–చకిలం వేణుగోపాలరావు
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e:venugopal.chakilam1@gmail.com

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e:akshara25@gmail.com

# జీవితంలో సైన్స్ యొక్క ప్రాముఖ్యత

## ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ దినోత్సవం

**భూ**మిపై ప్రతి ఒక్కరి జీవితంలో సైన్స్ ముఖ్యమైనది. కొన్నిసార్లు మనకు తెలియనప్పుడు కూడా, మనం సైన్స్ మరియు దాని అనువర్తనాలను మన దైనందిన జీవితంలో ఉపయోగిస్తూ ఉంటాము. సైన్స్, దాని అనువర్తనాలు మన జీవితాలను సరళీకరించిన మార్గాలను, అది మనకు విషయాలను ఎంత సులభతరం చేసిందో గుర్తించడం చాలా ముఖ్యం. మన జీవితంలో సైన్స్ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచుకోవడానికి, మన జీవితాలను సరళతరం చేయడానికి అహర్నిశలు శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయత్నాలను గుర్తించడానికి ప్రతి సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటారు.



### జాతీయ సైన్స్ దినోత్సవం చరిత్ర

చంద్రశేఖర వెంకట రామన్‌ను సాధారణంగా CV రామన్ అని పిలుస్తారు. ప్రతిభావంతులైన పిల్లవాడు. అతను చాలా త్వరగా పాఠశాలను ముగించాడు. తన మాధ్యమిక విద్యను 11 సంవత్సరాలకు మరియు ఉన్నత మాధ్యమిక విద్యను 13 సంవత్సరాలకు పూర్తి చేసాడు. తరువాత 16 సంవత్సరాల వయస్సులో బ్యాచిలర్ డిగ్రీని అందుకున్నాడు. అతను భౌతిక శాస్త్రాన్ని అభ్యసించినప్పుడు గౌరవాలతో ఉత్తీర్ణత సాధించాడు. వీరు అకౌంటింగ్‌ను 'సురక్షితమైన ఎంపిక'గా స్వీకరించాడు. చివరకు 1917లో భారతదేశంలోని కలకత్తా లోని ఒక కళాశాలలో అధ్యాపకుడుగా పని చేస్తూ పదవీ విరమణ చేశారు.

ఐరోపా పర్యటనలో, రామన్ మంచుకొండలు మరియు మధ్యధరా సముద్రం యొక్క అద్భుతమైన నీలం రంగును మొదట గమనించాడు. అతను ఈ రంగు ఎలా కనిపించిందో గుర్తించలేక పోయాడు. భూమి యొక్క వాతావరణంలోకి ప్రవేశించినప్పుడు సూర్యరశ్మి చెల్లాచెదురుగా వివిధ రంగులు కనిపించడానికి కారణమైన ఆ సమయంలో ఉన్న సిద్ధాంతాన్ని తిరస్కరించడానికి బయలుదేరాడు. రామన్ స్వయంగా ప్రయోగాలు చేయడం ప్రారంభించాడు. తరువాత తన విద్యార్థి KS కృష్ణన్‌కి పరిశోధన బాధ్యతలను అప్పగించాడు. కాంతి పారదర్శక పదార్థం గుండా వెళుతున్నప్పుడు, కొంత కాంతి వివిధ దిశల్లో వెదజల్లుతుందని వారు కనుగొన్నారు.

"పారదర్శక పదార్థం గుండా కాంతి ప్రయాణించినప్పుడు. అది చెల్లాచెదురుగా ఉంటుంది. ఇది తరంగదైర్ఘ్యం మరియు శక్తిలో మార్పులకు దారితీస్తుంది. దీనినే రామన్ ఎఫెక్ట్ అంటారు". 1928, ఫిబ్రవరి 28న సి.వి.రామన్ ఈ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారు. 1928లో ప్రచురించబడిన ఈ ఫలితాలు శాస్త్రీయ సమాజాన్ని తుఫానుగా తీసుకువెళ్లాయి. రామన్‌కు అదే సంవత్సరంలో నోబెల్ బహుమతి లభిస్తుందని పూర్తిగా ఆశించారు. అయితే ఆ సంవత్సరం, ఆ తరువాత సంవత్సర కూడా నోబెల్ బహుమతి లభించలేదు. 1930 జులైలో వారు తనకు తానుగా రెండు టిక్కెట్లను బుక్ చేసుకున్నాడు. ఒకటి తన కోసం, మరొకటి తన భార్య కోసం. స్టాక్‌హోమ్‌కు స్టీమ్‌షిప్‌లో నోబెల్ బహుమతి ప్రకటన నవంబర్‌లో ఉంటుంది. వారు ఆ సంవత్సరం భౌతిక శాస్త్ర రంగంలో ఆయన చేసిన విశేష కృషికి గాను నోబెల్ బహుమతి కూడా లభించింది. రామన్ భారతీయ శాస్త్రీయ సమాజం దృష్టిని ఆకర్షించాడు. రామన్ ఎఫెక్ట్‌కు జ్ఞాపకార్థంగా, ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటాము. ఈ సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవం థీమ్: సైన్స్ మరియు అన్వేషణ

– సత్య ప్రసన్న m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# ప్రపంచ పాదయాత్రికుడు

## (గాస్పర్ ఒరేహేక్ - స్లోవేనియా)


అతను మనకు ఎదురవగానే అతని ముందు మోకరిల్లి ఆ పాదాలకు ప్రణామం చేయాలనిపిస్తుంది.

అతనొక నిరంతర పాదయాత్రికుడు. లోకసంచారి, ఘుమక్కడ్, ఆవారాబాదల్.

అతను ప్రపంచాన్ని తన పాదముద్రలతో గ్రంథస్థం చేస్తున్నవాడు.

అతను గాస్పర్ ఓరెహెక్. స్లోవేనియా దేశస్తుడు. ఆ దేశం ఒకప్పుడు యుగోస్లావియాలో అంతర్భాగం.

చరిత్రలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి సరిగ్గా పైలా వచ్చీనం వయస్సులో ఇల్లు వదిలి 1984 జూన్ 29న మహాభినిష్క్రమణంగా ప్రపంచ మార్గం పట్టి నేటికి 23 సంవత్సరా లయింది. (ఈ కథ నేను 2005లో రాసాను). ఈనాటికీ ఇంటి ముఖం చూడనేలేదు. తన 46 సంవత్సరాల వయస్సులో 45 దేశాలను, లక్షా ఏభై వేల కిలోమీటర్లను తిరిగిన "ఈ లోకం చుట్టిన వీరుడు" మహారాష్ట్ర సరిహద్దులుదాటి నిజామాబాద్ జిల్లాలోని పిట్లం చేరుకున్నాడన్న వార్త దినపత్రికలలో చదివిన నేను ఆత్రమాత్రంగా ఎదురేగి బిర్కూర్ గ్రామ పొలిమేరలో అతి వెచ్చని సూర్య కిరణాలుసోకే సుప్రభాతపు వేళలలో అతడిని కలిసి కావలించుకున్నాను. అతడిని కొత్తగా, మొదటిసారిగా కలిసినట్లనిపించ లేదు నాకు.



"ఖ్వాబోమే మిలే అఖ్బుర్".

టాలెమీ, మెగస్థనీస్, హ్యుయాన్‌త్సంగ్ - ఫాహియాన్, ఇబన్ బటూ టా, మార్కోపోలోలకు ఇంకా ఎందరెందరికో వారసుడతను.

బుద్ధుడు, శంకరాచార్యుడు, గాంధీ, కన్ఫ్యూషియస్, మావో మాదిరిగానే పాదయాత్రల ద్వారా లాంగ్‌మార్చ్‌ల ద్వారా ప్రపంచ మార్గాన్ని మార్చటానికి ప్రయత్నిస్తున్నవాడు. బహుశా పాదయాత్ర సంస్కృతి ఆసియా సంస్కృతిలో నుండే ఉద్భవించిందేమో!

చల్ అకేలా ముసాఫిర్ లాగే వీపున ఒక రక్‌సాక్ తగలించుకొని, సాదాసీదా టీషర్ట్ - ప్యాంట్‌తో, తలకో క్యాప్, పాదాలకు జాగింగ్ షూస్‌తో ఖాళీ ఖాళీ గ్రామీణ రోడ్ల మీద, కాలిబాటల మీద, పిల్లబాటల మీద చకచకా నడుస్తూ వెళ్లే అతనిని చూస్తుంటే ప్రపంచ యాత్రికుడని ఎవరికీ అనిపించదు. ఆమ్ ఆద్మీలాగా, మన చల్నేదో బాలకిషన్ లాగ కనబడుతడు తప్ప అతనొక "దేశ్ విదేశీ బంజారా" అని ఎవరూ గుర్తించరు.

ప్రపంచ యాత్రికులను కలుసుకోవాలని, వారి అనుభవాలను తెలుసుకోవాలని నేను చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాను. చివరికి నా కోరిక నెరవేరింది. రెండు మూడు రోజులు ఆ పాదయాత్రికుడి వెంబడి తిరుగుతూ, తింటూ పడుకుంటూ బిర్కూర్, వర్ని, రుద్రూర్, బోధన్, ఆర్మూర్ గ్రామాలలో పర్యటించాను. ఒక గ్రంథాలయంలో, కొన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఆయన ఉపన్యాసాలకు అనువాదకుడిగా పనిచేసి నాకు తెలిసిన కొంచెం ఇంగ్లీషు, కొంచెం తెలుగును సార్థకం చేసుకున్నాను. ఆ ఉపన్యాసాల సారాంశమే ఈ రచన. ఆ నాలుగైదు రోజులు అతడి సహవాసంలో ముట్టుకుంటే అంటుకునే ముచ్చట్లు అండ్ ముచ్చట్లలో మునిగిపోయాను. ఆ నిరంతర యాత్రికుడి "యాత్రా కథనం" ఇది.

నాది స్లోవేనియా దేశం. సోవియట్ యూనియన్ పతనానంతరం 1992-93 లలో యుగోస్లోవియా కూడా నాలుగు ముక్కలయ్యింది. ఆ నాలుగు ముక్కలలో ఓ ముక్క మా స్లోవేనియా, స్మాల్ ఈజ్ బ్యూటీ అన్నట్లు కేవలం రెండు కోట్ల జనాభా. భూభాగం మీ తమిళనాడులో సగం ఉంటుంది. చలికాలంలో ఉష్ణోగ్రత మైనస్ పదిహేను ఉంటుంది. వేసవిలో ఉష్ణోగ్రత ఇరవై డిగ్రీలు దాటదు. ఆ మాత్రం ఎండకే మేం అపసోపాలు పడిపోతాం.

మాది స్లావ్ జాతి. మా మాతృభాష పేరు స్లోవియా. మా పూర్వీకులు సైబీరియా మంచు ఎడారి ప్రాంతంలో నివసించేవారు. ఆనాటి రష్యాకు, ఇంకా కింది యూరపు దేశాలకు సైబీరియా వలస పక్షుల మాదిరిగా ఆయా దేశాలకు వలస వచ్చారు. యూరపు దేశాల జాతులలో స్లావ్ జాతి బాగా బలమైన, సాహసమైన జాతి. బహుశా నా లోపల ప్రవహించే నా పూర్వీకుల రక్తమే నన్నిట్లా దేశ దేశాల వెంబడి త్రిప్పుతున్నదేమో!

1984లో నేను అప్పటి యుగోస్లావియా నుండి బయలుదేరిన తర్వాత నా దేశం నాలుగు ముక్కలయ్యింది. అలీన ప్రపంచ విదేశాంగ విధానాన్ని రూపొందించిన మార్షల్ టిటో, మీ దేశంలో స్థిరపడిన మదర్ థెరిసా మా యుగోస్లావియాకు చెందినవారే. ప్రపంచాన్ని చుట్టుముట్టిన మార్కోపోలో మా స్లోవేనియాకు చెందినవాడు. అంతెందుకు జగజ్జేత అలెగ్జాండర్ కూడా మా స్లోవేనియాలోని మాసిడోనియాకు సంబంధించినవాడే.

మాది ఆదర్శ కుటుంబం. నాన్న కెమికల్ ఇంజనీర్. అమ్మ హౌస్ వైఫ్ మరియు సోషల్ వర్కర్. ఆ దయగల తల్లి అనేక మంది అనాథ పిల్లల్ని సొంత తల్లిలా పెంచి పెద్ద చేసింది. ఇంటికి నేనే పెద్ద కొడుకును. నాకో తమ్ముడు, ముగ్గురు చెల్లెళ్లు. అప్పుడు వారంతా పెళ్లి చేసుకుని, ఇల్లు చూసుకుంటూ చక్కగా కాపురాలు చేసుకుంటున్నారు.

ఇక నేనేమో బ్రహ్మచారిగానే ఉండిపోయి బహుదూరపు బాటసారిగా దేశ దేశాల రహదారులపై ఒకటి – ఒంటరి అంకెలా సాగిపోతున్నాను. ఈ తిరుగుడు పిచ్చి నాకు చాలా చిన్నప్పుడే పట్టుకుంది. నా బాల్యంలో నాకు ఆటపాటలేమీ లేవు. కాని విపరీతంగా కథల పుస్తకాలు చదివేవాడిని. ఈజిప్టు, ఇరాక్, ఇండియా, చైనా దేశాలు నన్ను బాగా ఆకర్షించాయి. భారతదేశానికి సంబంధించిన కథలు నన్ను వెంటాడి వేధించినాయి. రాజులు, రాణులు, వజ్రాలు, వైఢూర్యాలు, ఏనుగులు, కోతులు, దయ్యాలు, దొంగల కథలు నన్ను కలల ప్రపంచంలోకి నెట్టివేశాయి. ఏదో ఒకరోజున ఈ దేశాలన్నింటినీ కాలి నడకతో వెళ్లి చూస్తాను అని అందరితో అంటుంటే వారందరూ నా ముఖం మీదనే నవ్వేసి 'పిచ్చి మాలోకం' అని వెక్కిరించేవారు.

పెరిగి పెద్ద కాలేజీకి వచ్చి చరిత్రలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసే సరికి నా 'పిచ్చి' మరింత ముదిరిపోయింది.

రోడ్లు నన్ను 'రా రమ్మని' పిలువసాగినాయి.

కిం కర్తవ్యం?

ఉద్యోగం, పెళ్లి, ఇల్లు, 'మకాన్ సే దుకాన్, దుకాన్ సే మకాన్' లాంటి 'కుటుంబరావుల' జీవితాన్ని ఎంచుకోవాలా లేక 'ఎల్లలోకములొక్క ఇల్లై' అన్నట్లు సైబీరియా స్వేచ్ఛా విహంగంలా ఎగిరిపోవాలా అని జీవితం చౌరస్తాలో నిలుచున్నాను. చివరికి మనస్సు చెప్పిన మార్గమే, అంతరాత్మ ప్రబోధాన్నే అనుసరించి ఇట్లా 'జంగమ దేవరగా' మారాను.

రెండు వేల డాలర్లను మూటకట్టుకొని ఇల్లు వదిలాను. అందులో ప్రతి డాలర్ నా స్వార్జితమే. విద్యార్థిగా ఉన్నప్పుడే సెలవు రోజులలో పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేసి నా ప్రపంచ పాదయాత్ర కోసం పైసా పైసా చీమ మాదిరిగా పోగు చేసుకున్నాను. కాని అది ఏ మూలకు కూడా సరిపోలేదు. ఇప్పటి వరకూ దేశదేశాల ప్రజలందించే ఆర్థిక సాయంతోటే ఈ అనంతయాత్ర కొనసాగుతుంది.

ఇక అమ్మానాన్నల సంగతంటారా?

నేను ఏ మార్గాన్ని ఎంచుకుంటే సుఖంగా ఉంటుందో మా అమ్మకు తెలుసు. అందుకే అమ్మ నాకు అడ్డు చెప్పలేదు.

'అర్భకపు ఎధవ, ఇంటి మీద బెంగతో వారం పది రోజులలో ఇంటికి తిరిగి రాడూ?' అని నాన్న అందరితో అన్నాడట.

అట్లా నన్ను తక్కువ అంచనా వేసి నాన్న 'తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయినాడని నాకు ఫోన్ ద్వారా తెలిసినా నేను ఇంటికి తిరిగి వెళ్లనే లేదు. అప్పుడప్పుడు అమ్మతో ఫోన్లో మాట్లాడుతుంటాను అన్నాడు చెమర్చిన కండ్లతో దరహాసపు పెదాలతో.

ఇంటి నుండి బయలుదేరి పొరుగు దేశం రుమేనియా చేరుకున్నాను. అంతా కొత్త. అలవాటు లేని ప్రాణం అపసోపాలకు గురైంది. ఆకలి, నీరసం. ఒక పార్కులో బెంచీ మీద వాలి మగత నిద్రలోకి వెళ్లి లేచి కూచోని చూసేసరికి తల కింది బ్యాగ్ మాయం. సర్వం గోవిందా! కృష్ణార్పణం. ఆకలి నీరసంతో వున్న నేను ఆ బ్యాగును మోయలేననుకుని భగవంతుడే నాకు సహాయం చేయటానికి ఆ 'దొంగగారిని' పంపించాడని నాకు నేను సర్దిచెప్పుకున్నాను.

జోర్డాన్‌లో నడుస్తున్నప్పుడు అమావాస్య కటిక చీకటి రాత్రి. ఆకాశం పందిరి కింద ఎడారి ఇసుక తిన్నెలపైన్నే నడుం వాల్చి నిద్రపోయాను. తెల్లారి లేచేసరికి నా పక్కనే ఒక పెద్ద ఎడారి పాము. నన్ను ఆనుకుని వెచ్చగా నిద్రపోతుంది. ఎడారి పాములు ఎంత విషపూరితమో మీకు తెలియదు. అయినా దాన్ని చూసి నేనేం కంగారుపడలేదు. ఒంటరి చలిరాత్రిలో నాకు తోడూ నీడా – నెచ్చలీ నేస్తమూ ఆయిన ఆ పాముకు కృతజ్ఞతలు చెప్పి లేచి వెళ్లిపోయాను.

మరోసారి సూడాన్ దేశపు అరణ్యమార్గంలో ఒక పొద పక్కన హఠాత్తుగా సింహం కనబడింది. ఆశ్చర్యంగా అది నన్ను చూస్తూ నిలబడిపోయింది. భయంతో నేను శిలలా నిల్చున్నాను. ఒకరి కండ్లలోకి మరొకళ్లం కాసేపు సూటిగా చూసుకున్నం. కాసేపటికి అది లంఘించి అదృశ్యమైంది. నేను బతుకు జీవుడా అని ముందుకు సాగాను. సింహం నన్ను తినలేదు. బహుశా దానికప్పుడు ఆకలిగా లేదేమో? లేక నా తెల్ల తోలు తినటం దానికి నచ్చలేదేమో?

ఆఫ్రికా కుగ్రామాలలో పర్యటించేటప్పుడు ఆకలితో చచ్చే చావు వచ్చిపడింది. ఆ నల్లనయ్యలు అందరూ ఆతిథ్యమిచ్చేవారే. భోజనానికి పిలిచేవారే, కాని నాకే వారు భోజనం చేసే పద్ధతి సయించక పస్తులు పడుకునేవాణ్ణి. ఎందుకంటారా? ఒకే ఒక పెద్ద పళ్లెం ముందు పది మంది ఇంటిల్లిపాది చుట్టూ గుండ్రంగా కూచునేవారు. ఎంగిలి చేతుల్ని పళ్లెంలోకి జొప్పిస్తూ, ఒకొక్కటి ఐదు వేళ్లూ పూర్తిగా నాకుతూ నాలుక చప్పరిస్తూ, లొట్టలు వేస్తూ భోజనాలు చేసేవారు. ఆ 'ఎంగిలి – మంగలం' పద్ధతి చూసేసరికి నాకు వాంతికొచ్చేది. నాకు ప్రత్యేకంగా పళ్లెం పెట్టమని అడగటం మర్యాద కాదు కదా! ఆ భోజనం, ఎంగిలి సయించక ఆకలి

లేదని అబద్ధమాడి పస్తులు పడుకున్నాను. ఏ గ్రామానికి వెళ్లినా ఇదే పద్ధతి. ఇక ఆకలితో చస్తానన్న భయంతో చివరికి ముఖం వెనక్కి తిప్పి చేయి ముందుకు చాచి ఆ ఎంగిలి తంతు చూడకుండా భోజనం చేసేవాణ్ణి. ఆ రుచి మాత్రం పరమాద్భుతం.

ఆఫ్రికా దేశాలలో తిరుగుతున్నప్పుడు పాములు, తేళ్లు, క్రిమికీటకాలు భయంతో నేల మీద కాకుండా చెట్ల కొమ్మల మీద పడుకొనేవాణ్ణి. ఈ అలవాటు నాకు బంగ్లాదేశ్‌లో ఉపయోగపడింది. అక్కడ వరదలలో చిక్కుకొన్నాను. నలభై గంటలపాటు చెట్ల కొమ్మల మీదే గడిపాను. వరద నీళ్లలో కొట్టుకుపోకుండా నన్ను నేను బట్టపేలికలతో చెట్ల కొమ్మలకు బంధించుకునే వాణ్ణి.

సాహసం సమక్షంలో మృత్యువు ఒక లెక్కకాదు. మృత్యువుకు మనం ఎందుకు భయపడాలి. జీవితం ఒక పుస్తకం లాంటిది. ఏ పేజీ దగ్గర జీవితం ఆగిపోతుందో ఒక్క భగవంతుడికి మాత్రమే తెలుసు. పుట్టిన ప్రతి ప్రాణి గిట్టక తప్పదు కదా! మరి మనం చావు గురించి నిరంతరం భయపడటం కంటే బతికినంత కాలం మంచిగా బతకటం, ఇతరులకు మంచి చేయటం మన లక్ష్యంగా ఉండాలి.

'యుగోస్లావియా హోం మినిస్టర్' కొడుకు మన దేశంలో పాదయాత్ర అని పెద్ద పెద్ద హెడ్డింగులతో వార్తలు వచ్చాయి. పోలీసులు, ప్రభుత్వ అధికారులు అందరూ నాకు రాచమర్యాదలు చేయడం ప్రారంభించారు.

ఈజిప్టు దేశంలో ఒక చోట చిన్న పిల్లలు కట్టె ముక్కల్ని తమ పండ్లతో కొరుకుతూ తినటం చూశాను. ఎంత దరిద్రమో అని దుఃఖమొచ్చింది. తినటానికి మరేమీ దొరకలేదా? ఎంత దరిద్రం అని వారిని పరామర్శించాను. వారంతా ఒకటే నవ్వు. కట్టె ముక్కలు కాదు 'షుగర్‌కేన్' అని వారి జవాబు. అట్ల మొదటిసారి జీవితంలో చెరుకు గడల్ని చూశాను. రుచి కూడా చూశాను. మా శీతల దేశాలలో షుగర్‌కేన్‌లు పండవు. భూమిలో షుగర్ బీట్స్ పండించబడతాయి. వాటి నుండి షుగర్ ఉత్పత్తి చేయబడుతుంది.

అట్లా దేశ దేశాలు తిరుగుతూ టర్కీ సరిహద్దులో చెక్‌పోస్టుకు చేరుకునేసరికి ప్రశ్నల మీద ప్రశ్నలు. వారి భాష నాకు, నా భాష వారికీ అర్థం కాక పెద్ద సీన్ క్రియేట్ అయింది. నిజానికి నాకు ఇంగ్లీష్ భాష కూడా సరిగ్గా రాదు. నా యాత్రలో రోడ్ల మీదనే ఆ భాష నేర్చుకున్నాను. నా మాతృభాష 'స్లోవియా' ఒకటే నాకు వచ్చు.

ఎక్కడ్నుంచి, ఎట్లా వస్తున్నావు అని అక్కడి అధికారి ప్రశ్నించాడు. కాలినడకన అన్న నా జవాబు నమ్మకం కలిగించక తన కార్యాలయం నుండి ఇవతలికి వచ్చి ఇటూ అటూ కలియజూశాడు. ఏదైనా కారు లేదా మోటార్ సైకిల్ అయినా కనబడుతుందేమోనని! ఏమీ లేకపోయేసరికి 'చాగిసెల్, చాగిసెల్' అని గట్టిగా అరిచాడు.

తిడుతున్నాడేమోనని నేను భయపడ్డాను. కాని తర్వాత తెలిసింది. చాగిసెల్, చాగిసెల్ అంటే వెరీగుడ్, వెరీగుడ్ అని. ఆ తర్వాత ఆ అధికారి నాకు మంచి భోజనం పెట్టాడు. దారి బత్తెంగా వెయ్యి 'లీరా'లు జేబులో పెట్టాడు. తోవల తినటానికి 'తోషాదాన్' కట్టించాడు. బహుదూరపు బాటసారిని ప్రేమించనిదెవరు?

అక్కడ్నుంచి టర్కీ రాజధాని ఇస్తాంబుల్ చేరుకున్నాను. అక్కడ విలేకరులు అనేక ప్రశ్నలు అడిగారు. మీ అమ్మ ఏం చేస్తుంది అన్న ప్రశ్నకు హౌస్‌వైఫ్ అనే బదులు హాస్యంగా 'హోం మినిస్టర్' అని అన్నాను. అంతే తెల్లారి అన్ని పత్రికలలో 'యుగోస్లావియా హోం మినిస్టర్' కొడుకు మన దేశంలో పాదయాత్ర అని పెద్ద పెద్ద హెడ్డింగులతో వార్తలు వచ్చాయి. పోలీసులు, ప్రభుత్వ అధికారులు అందరూ నాకు రాచమర్యాదలు చేయడం ప్రారంభించారు.

వారి సంతోషాన్ని భగ్నపరచడం ఇష్టం లేక ఆ దేశం వదిలేవరకూ మౌనం వహించాను.


యూరపు దాటి ఆసియా ఖండపు ప్రవేశ ద్వారం టర్కీ నుండి ఇరాక్‌లోకి ప్రవేశించాను. నేను మొదటిసారిగా భారతీయులను కలుసుకున్నది ఆ దేశంలోనే. ఇరాక్‌లో రెండు లీటర్ల పెట్రోల్ ఉచితంగా సంపాదించవచ్చు గానీ రెండు గ్లాసుల మంచినీళ్లు డబ్బిచ్చినా దొరకవు. ఆ ఎడారి దారులలో నాకు దాహం వేసినపుడల్లా ట్రక్కు డ్రైవర్ల దగ్గరికి వెళ్లాను. వారు నలుగురైదుగురు ఒక చోట కూర్చుని తమ రెండు చేతులతో చప్పట్లు చరుస్తున్నట్లు ఏదో పనిలో నిమగ్నులై ఉన్నారు. వారి దగ్గరికెళ్లి మీరు చప్పట్లు కొడుతున్నారా అని ప్రశ్నించాను. వారు పకాలున నవ్వి కాదు రెండు చేతులతో చపాతీలు చేస్తున్నాం అని హిందీలో అన్నారు. నా అవసరాన్ని గమనించి మంచినీళ్లేకాదు వారితో పాటు రొట్టెలు కూడా తిని వెళ్లమని ఆహ్వానించారు. సంతోషంగా భోజనం ముగిసింది. వారి తలల మీద బాండేజీల మాదిరిగా ఏవో కనిపించాయి. అంత ఉక్కపోత ఎండలలో వాటిని ధరించారంటే ఏదో అనారోగ్యంతో ఉన్నారని అనుమానించి మీరు తలలకు ఏం కట్టుకున్నారూ? అని ప్రశ్నించాను.

"వి ఆర్ సిక్" అన్నారు వాళ్ళు. సిక్ అంటే Sick అనుకొని ఏం మందులు వాడుతున్నారు? ఏ డాక్టరు దగ్గరికి వెళ్లారు అని మళ్లీ ప్రశ్నించాను. నా ప్రశ్నలకు వారు తమ పొట్టలు చెక్కలయ్యే టట్లు నవ్వి, ఆ తరువాత సిక్కుమతం గురించి వారి తలపాగాల గురించి అంతా వివరించారు. ఈసారి నవ్వటం నావంతయ్యింది.

నేను ఆఫ్ఘనిస్తాన్ వైపు వెళ్తున్నట్లు తెలుసుకున్నవారు కొంత దూరం వరకు తమ ట్రక్కులో లిఫ్ట్ ఇస్తాం రమ్మని ఆహ్వానించారు. "సారీ" నేను పాదయాత్రికుడిని "నడవటమే నా ధర్మం" అని వారికి నచ్చచెప్పి ముందుకు నడిచాను.

*(తరువాయి వచ్చేసంచికలో)*

-పరవస్తు లోకేశ్వర్,
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com



# తెలంగాణా తొట్టతొలి స్మారకచిత్రం

పాతరాతియుగపు మానవుడు, తోటి మానవుడు మరణిస్తే, ఆ మృత కళేబరాన్ని అతడు ఎక్కడ మరణిస్తే అక్కడే వదిలి పెట్టాడు. కొత్తరాతియుగంలో తమ కుటుంబ సభ్యుల్లో ఒకరు ఏకారణం చేత మరణించినా ఆ శవాన్ని తామున్న స్థావరంలోనే పూడ్చి పెట్టాడు. ఆ తరువాత మానవ జీవన వికాస క్రమంలో, ఇనుమును కనుగొనటం ఒక అద్వితీయ ఘట్టంగా పురావస్తు శాస్త్రవేత్తలు భావిస్తారు. క్రీ.పూ. 2000– క్రీ.శ.200 సం॥ల మధ్య కాలంలో తెలంగాణలో విలసిల్లిన ఈ కాలాన్ని ఇనుప యుగమనీ, మరణించిన వారి శవాలను భూమిలో పాతిపెట్టి గుంటను పూడ్చి, చుట్టూ పెద్ద పెద్ద గుండు రాళ్లను గుండ్రంగా అమర్చే ఆచారాన్ని కొనసాగించటం వల్ల బృహత్ శిలా (మెగాలిథిక్) యుగమనీ పిలిచారు. ఇలాంటి సమాధుల్ని భూమిలోపల పాతిపెట్టి నిర్మించేవి, భూమిపైన రాతిగోడలతో నిర్మించేవీ అని రెండు రకాలు. వీటిని తెలంగాణలో రాకాసి గుళ్లనీ, రాక్షసగూళ్ళని, రక్కీసబండలనీ, పాండువల గుళ్లని, వీర్లపాడులనీ పిలుస్తారు.

ఈ ఇనుపయుగపు సమాధుల్ని గుంట సమాధులని, గూడు సమాధులనీ, రాళ్ల గది సమాధులనీ, రాతిని తొలచిన సమాధులనీ నాలుగు రకాలుగా విభజించారు. వీటికి అనుబంధంగా నిలిబెట్టే ఎత్తైన రాళ్లను నిలువురాళ్లనీ, నిలువు రాళ్ల వరుసలనీ, నిలువురాళ్ల గుంపులనీ, మానవాకారశిల్పాలనీ, శిలువాకృతులనీ పిలిచారు. సమాధుల్లో, ప్రత్యేకించి గుంట సమాధుల్లో మట్టి శవపేటికల్లో శవాల్ని ఉంచి పాతి పెట్టడం, భూమిపైన నిర్మించే రాతి గూళ్ల సమాధులల్లో రాతి శవపేటికల్లో అస్థికలను నిక్షిప్తం చేసుకొన్నారు. సమాధి ఏ రకానికి చెందినా, మరణించిన వారు, వారి జీవితకాలంలో వాడిన మట్టిపాత్రలు, ఆహారధాన్యాలు, ఇనుప పనిముట్లు, మట్టి, లోహపు ఆభరణాలను కూడ వారితో పాటే నిక్షిప్తం చేసేవారని తెలంగాణాలో జరిపిన అనేక తవ్వకాలు రుజువు చేశాయి.

మరణించిన వారి జ్ఞాపకంగా సమాధి పక్కన ఎత్తైన నిలువురాతిని పాతిపెట్టడం, స్మారక కట్టడ ప్రారంభదశను సూచిస్తుంది. అలా నిలబెట్టిన నిలువున్న రాళ్లను, శిలువా కారంగా తీర్చిదిద్ది వాటి పై మరణించిన వారు ఆడ, మగ అని తెలియజేయటానికి వీలుగా, మగవారిని సాదా శిలువాకారపు బొమ్మగానూ, ఆడవారిని, ఆదే శిలువాకృతిపైన వక్షస్థలాన్ని చెక్కి, స్మారకశిల నిర్మాణంలో ప్రత్యేకతను కనబరిచారు.

ఇదే కాలంలో మరో అడుగు ముందుకేసి, ప్రస్తుత నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపురం మండలంలోని చిన్నమారూరు వద్ద జరిపిన తవ్వకాల్లో ఇనుపయుగపు గూడు సమాధిపై నుంచే రాతిపైన మరణించిన వారి చిత్రాన్ని, గీతల్లో చెక్కారు. ఇదే తొట్టతొలి స్మారక చిత్రంగా గుర్తింపుపొంది, తెలంగాణా చరిత్రలో మైలురాయిగా ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందింది.

–ఈమని శివనాగిరెడ్డి–స్థపతి
m : 9848598446
e : nagireddy@malaxmi.in

# ప్రోటీన్ ఇంజినీరింగ్‌లో సంచలనం...!! @ రొసెట్టా, ఆల్ఫా ఫోల్డ్ 2

*(గత సంచిక తరువాయి)*

**ప్రోటీన్లపై పరిశోధనలో డేవిడ్ బెకర్ కృషి ఏమిటి??**

ప్రోటీన్ల యొక్క నిర్మాణాన్ని (Structure) అంచనా వేయడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలందరూ 1994 వ సం॥ నుండి మొదలుకొని ప్రతీ రెండు సం॥రాలకొకసారి సమావేశమై పరిశోధనలు జరిపేవారు. ఈ కార్యక్రమాన్ని క్రిటికల్ అసెస్‌మెంట్ ప్రోటీన్ స్ట్రక్చర్ ప్రిడిక్షన్ లేదా Critical Assement of structure prediction (CASP) అని పిలిచేవారు. దీనిలో డేవిడ్‌బెకర్ సహ సైంటిస్టుగా చేరి పరిశోధనలు కొనసాగించారు.

ఇలా పరిశోధనలు కొనసాగిస్తూ 2003లో డేవిడ్‌బెకర్ "కంప్యూటేషనల్ ప్రోటీన్ డిజైన్"ను కనుగొన్నారు. సాధారణంగా అమైనో ఆమ్లాల అమరిక, అవి ఎలా అమర్చబడి, ప్రోటీన్‌గా ఏర్పడ్డాయి అన్న విధానంలో కాకుండా తద్విరుద్ధంగా అతను మొదట ప్రోటీన్‌ను తయారుచేసి, తరువాత ఆ ప్రోటీన్‌లో అమైనో ఆమ్లాల అమరిక ఎలా ఉండాలన్నది అంచనావేసి, తదనుగుణంగా ప్రోటీన్‌లో అమైనో ఆమ్లాలను అమర్చాడు. తద్వారా సహజంగా తయారయ్యే ప్రోటీన్లలాగే, అతను ప్రయోగశాలలో కృత్రిమంగా ప్రోటీన్లను తయారుచేశాడు. వీటినే సింథటిక్ ప్రోటీన్లు అంటారు.

Top 7 Protein



ఇందుకొరకు డేవిడ్‌బెకర్ **రొసెట్టా** అన్న ఒక కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసి ఇదివరకే కనుగొన్న ప్రోటీన్లు, వాటి నిర్మాణాలను కలిగి ఉన్న డేటా బేస్‌ను నిశితంగా అధ్యయనం చేశాడు. రొసెట్టా సాఫ్ట్‌వేర్‌కు అమైనో ఆమ్లాల సీక్వెన్స్‌ను అందజేసినట్లయితే, రోసెట్టా సహజ ప్రోటీన్లలాగే, అమైనో ఆమ్లాల అమరికను తనే నిర్ణయించి పూర్తిస్థాయిలో కొత్త ప్రోటీన్లను కృత్రిమంగా తయారుచేస్తుంది. తద్వారా మనం ఆశించినట్లుగా విభిన్న రకాల శారీరక క్రియలను నిర్వర్తింపజేసేందుకు, విభిన్న రకాల ప్రోటీన్లును రొసెట్టా సాఫ్ట్‌వేర్ ద్వారా కృత్రిమంగా తయారుచేసుకోవచ్చు. సహజ ప్రోటీన్లు చేయని విధులను కూడా ఈ కృత్రిమ ప్రోటీన్లు సమర్థవంతంగా నిర్వర్తిస్తాయి.

ఈ విధంగా ప్రయోగశాలలో రొసెట్టా సాఫ్ట్‌వేర్ ద్వారా 'టాప్–7" అన్న ప్రోటీన్‌ను మొట్టమొదటిసారిగా కృత్రిమంగా తయారుచేశారు. ఇది ఇప్పటికే ఉన్న అన్ని ప్రోటీన్లతో పోల్చితే వాటికి పూర్తి భిన్నంగా ఉంది. ఇలాంటి ఎక్స్‌ట్రార్డినరీ ఫీట్‌ను సాధించి నందుకుగాను నోబెల్ బహుమతిలో సగభాగం డేవిడ్‌బెకర్‌కు కేటాయించారు.

**డెమిస్ హసాబిస్, జాన్ ఎం.జంపర్‌ల పాత్ర ఏమిటి??**

ప్రయోగశాలలో కృత్రిమంగా ప్రోటీన్లను డేవిడ్ బెకర్ తయారుచేశాడు గానీ, ప్రకృతిలోనున్న మొత్తం 200 మిలియన్ల ప్రోటీన్ల నిర్మాణం కనుగొనడం అసంపూర్తిగా మిగిలిపోయింది. ఈ సమస్య పరిష్కారం కోసం గూగుల్ డీప్‌మైండ్ సంస్థకు చెందిన యునైటెడ్ కింగ్‌డమ్ దేశ శాస్త్రవేత్తలు డెమిస్ హసాబిస్ మరియు జాన్, ఎం.జంపర్‌లు **ఆల్ఫాఫోల్డ్** అన్న సాఫ్ట్‌వేర్‌ను తయారు చేశారు. ఈ సాఫ్ట్‌వేర్ పరిణామ క్రమం కింది విధంగా ఉంది.

**ఆల్ఫాఫోల్డ్1 (2018):**

దీనిద్వారా ప్రోటీన్ల పరిశోధనలో గణనీయమైన పురోగతి సాధ్యమైంది. దీని ద్వారా ప్రోటీన్ల నిర్మాణాలను అంచనా వేయగలిగారు. దీనిద్వారా ప్రోటీన్ల స్ట్రక్చర్స్‌ను గుర్తించడంలో 60 శాతం ఖచ్చితత్వాన్ని మాత్రమే సాధించగలిగారు.

**ఆల్ఫాఫోల్డ్ 2 (2020):**

దీని ద్వారా ఎక్స్‌రే క్రిస్టలోగ్రఫీతో పోల్చదగిన ఖచ్చితత్వాన్ని సాధించారు. ఇది సాంప్రదాయికంగా ప్రోటీన్ నిర్మాణాలను గుర్తించడానికి వినియోగించే పద్ధతని చెప్పవచ్చు. ఆల్ఫా ఫోల్డ్ ద్వారా ప్రోటీన్ల స్ట్రక్చర్స్‌ను గుర్తించడంలో 90% ఖచ్చితత్వాన్ని సాధించారు.

**ఆల్ఫాఫోల్డ్3:**

ఈసాఫ్ట్‌వేర్ ద్వారా ప్రోటీన్ల నిర్మాణాలను అంచనావేయడం మాత్రమే కాకుండా ప్రోటీన్లు, ఇతర ప్రోటీన్లు మరియు అణువులతో ఎలా సంరక్షణం చెందుతాయో అంచనా వేయవచ్చు.

ఆల్ఫాఫోల్డ్ సాఫ్ట్‌వేర్‌కు అమైనో ఆమ్లాల స్వీక్వెన్స్‌ను అందజేసినట్లయితే, సాఫ్ట్‌వేర్ తనలోని న్యూరల్ నెట్‌వర్క్స్ సహకారంతో 90శాతం ఖచ్చితత్వంతో సహజ ప్రోటీన్ల త్రిమితీయ నిర్మాణాన్ని నిర్మిస్తుంది. దీనికి ఖర్చు, శ్రమ తక్కువ మరియు గతంలో చెప్పుకున్న సాంప్రదాయ విధానాలతో పోలిస్తే కొన్ని ని॥ల వ్యవధిలో ప్రోటీన్ స్ట్రక్చర్‌ను నిర్మిస్తుంది. కాబట్టి కాలహరణం

జరగదు.

**అనువర్తనాలు**

**1. కంప్యుటేషనల్ ప్రోటీన్ డిజైన్ యొక్క అనువర్తనాలు:**


కంప్యుటేషనల్ ప్రోటీన్ డిజైన్ సాంకేతిక పరిజ్ఞానంతో కృత్రిమ లేదా సింథటిక్ ప్రోటీన్లను రూపొందించే సామర్థ్యం ఫార్మా మరియు రసాయన శాస్త్రాలతో సహా వివిధ రంగాలలో విస్తృత ప్రభావాలను కలిగి ఉంది.

**i. కోవిడ్ -19 కోసం యాంటీ వైరల్ నాసల్‌స్ప్రే:**

కోవిడ్ 19 యొక్క స్పైక్ ప్రోటీన్‌ను లక్ష్యంగా చేసుకొని, డేవిడ్ బేకర్ బృందం కంప్యుటేషనల్ విధానాలను ఉపయోగించి ప్రోటీన్లను అభివృద్ధి చేసింది. ఇది కోవిడ్-19 చికిత్సలో యాంటీవైరల్ నాసల్ స్ప్రేని రూపొందించడానికి దారితీసింది

**ii. ఆర్గానిక్ కెమిస్ట్రీకోసం ఎంజైమ్ డిజైన్:**

డేవిడ్ బేకర్ మరియు అతని నేతృత్వంలోని బృందం **అటోర్వాస్టాటిన్** (కొలెస్ట్రాల్ తగ్గించే ఔషధం) మరియు విటమిన్ B6 ద్వారా జరిగే ముఖ్యమైన రసాయనిక ప్రతిచర్యల వేగాన్ని పెంచేందుకు రోసెట్టా సాఫ్ట్‌వేర్ ద్వారా నూతన ఎంజైమ్‌లను రూపొందించారు.




**iii. బయోసెన్సర్లుగా:**

కంప్యుటేషనల్ ప్రోటీన్ డిజైన్లను మధుమేహం ఉన్న వారిలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను పర్యవేక్షించడానికి బయోసెన్సర్లుగా ఉపయోగించవచ్చు.

**iv. బయోఫ్యూయల్ ఉత్పత్తిలో:**

సుస్థిరాభివృద్ధిని సాధించడంలో భాగంగా ఇటీవలే భారత ప్రభుత్వం బయో ఇ3 పాలసీని ప్రకటించింది. ఈ నేపథ్యంలో నూతన ప్రోటీన్ డిజైన్లను బయోఫ్యూయల్ ఉత్పత్తిలో కూడా వాడవచ్చు.

**v. ఆహార ఉత్పాదన రంగంలో:**

వృథాను అరికట్టి, నాణ్యమైన మంచి రుచికలిగిన ఆహార పదార్థాలను తయారుచేసేందుకు వినియోగించవచ్చు.

**vi. రోగ నిర్ధారణలో:**

కంప్యూటేషనల్ విధానాల ద్వారా రూపొందించిన సింథటిక్ ప్రోటీన్లతో రోగాలను నిర్ధారించవచ్చు.

**vii. బయో ఫార్మాస్యూటికల్స్ రంగంలో:**

అంతర్జాతీయ స్థాయిలో ప్రోటీన్ డ్రగ్స్ వాటా రమారమి 400బిలియన్ల డాలర్లుగా ఉంది. ఈ నేపథ్యంలో సింథటిక్ ప్రోటీన్లను మోనోక్లోనల్ యాంటీ బాడీస్, ఇన్సులిన్, గ్రోత్ హార్మోన్‌లను తయారు చేయడంలో వినియోగించడం జరుగుతోంది.

**viii. క్యాన్సర్ చికిత్సలో:**

సింథటిక్ ప్రోటీన్‌లను క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే CAR-T_Cell థెరపీలో కూడా వాడతారు.

**ix. యాంటీబయోటిక్ రెసిస్టెన్స్‌ని అర్థం చేసుకోవడంతో:** యాంటీ బయాటిక్ రెసిస్టెన్స్‌కు కారణమయ్యే బ్యాక్టీరియా ఎంజైమ్‌లను అర్థం చేసుకోవడం, దానిని నివారించే మార్గాలను కనుగొనడంతో సహాయ పడుతుంది.

**x. ప్లాస్టిక్ డీ కంపోజిషన్:**

ఈ సాధనాన్ని వినియోగించి ప్లాస్టిక్‌ను కుళ్ళిపోయేలా (డీ కంపోజ్) చేయగల సింథటిక్ ఎంజైమ్‌లు మరియు ప్రోటీన్‌లను రూపొందించవచ్చు.

**xi. బయోప్రొడక్ట్‌ల అభివృద్ధి:**

కృత్రిమ ప్రోటీన్‌లను డిజైన్ చేసే సామర్థ్యం, సరికొత్త నానో మెటీరియల్స్, లక్ష్య నిర్దేశిత ఫార్మాస్యూటికల్స్, మరింత వేగవంతమైన వ్యాక్సిన్ల అభివృద్ధితో హరిత రసాయన పరిశ్రమ వృద్ధికి దోహదం చేస్తుంది.

**ఆల్ఫాఫోల్డ్2 అనువర్తనాలు:**

డేవిడ్ బెకర్ కనుగొన్న కంప్యూటేషనల్ ప్రోటీన్ డిజైన్ల అనువర్తనాలకు మరియు ఆల్ఫా ఫోల్డ్2 అనువర్తనాలకు మధ్య అంతర సంబంధం ఉంది. ఆల్ఫాఫోల్డ్2 అనువర్తనాలు కింది విధంగా ఉన్నాయి.

**i. ప్రోటీన్ – ప్రోటీన్ పరస్పర చర్యలలో:**

ఆల్ఫాఫోల్డ్ ద్వారా ప్రోటీన్ స్ట్రక్చర్‌ను నిర్దిష్టంగా గుర్తించడం వల్ల, కణంలో ఒక ప్రోటీన్, మరొక ప్రోటీన్‌తో ఎలా పరస్పరం చర్య జరపగలదో తెలుసుకోవచ్చు.

**ii. బయోలాజికల్ మెకానిజం ఆఫ్ యాక్షన్:**

జీవ క్రియలు నిర్వహించేటపుడు ఏదైనా ప్రోటీన్ ఒక కణానికి అతుక్కొని, దాని చర్యలను ఎలా నిర్వర్తించగలదో తెలుసుకోవచ్చు

**iii. ప్రోటీన్ విధుల అంచనా:**

ప్రోటీన్ స్ట్రక్చర్‌ను ముందుగానే గుర్తించడం వల్ల ఏ ప్రోటీన్ ఎలాంటి విధులు నిర్వర్తించగలదో అంచనా వేయవచ్చు.

**iv. అరుదైన వ్యాధుల చికిత్సలో:**

పార్కిన్సన్, అల్జీమర్స్, సిస్టిక్ ఫైబ్రోసిస్ లాంటి వ్యాధుల చికిత్సకు అవసరమైన ఔషధాలు, వ్యాక్సిన్లను రూపొందించవచ్చు.

**v. ప్రోటీన్ల పరిణామక్రమాన్ని అంచనా వేయడంలో:** మానవశరీరంలో ఒక అవయవం నుండి మరొక అవయవానికి వెళ్తున్న క్రమంలో ప్రోటీన్లు ఎలా పరిణామం చెందాయో

**2024 కెమిస్ట్రీ నోబెల్ బహుమతి గురించి కొన్ని ఆసక్తికర విషయాలు**

- సాధారణంగా శాస్త్రవేత్తలు తమ పరిశోధనల ద్వారా కనుగొన్న విషయం, మానవాళికి ఉపకరిస్తుందన్న విషయం నిర్ధారణ కావడానికి కొన్ని దశాబ్దాల సమయం పడుతోంది. తర్వాతే ఆ శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి అందిస్తారు. ఉదా॥ లిథియన్ అయాన్ బ్యాటరీలపై 1970లో చేసిన పరిశోధనకుగానూ జాన్ గూడెనఫ్ అన్న సైంటిస్ట్ 2019 చివర్లో నోబెల్ అందుకున్నారు.
- కానీ డెమిస్ హసాబిస్, జాన్ ఎం జంపర్‌లు తాము చేసిన పరిశోధనకు గానూ కేవలం 4 నుండి 6 సం॥రాల వ్యవధిలోనే నోబెల్ అందుకోవడం విశేషం.
- 2024 సం॥రానికి గానూ కెమిస్ట్రీ నోబెల్ బహుమతిని గతంలో లాగానే (ఈసారికూడా) రసాయన శాస్త్రవేత్తలు కానటువంటి సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన నిపుణులకు ప్రకటించడం ప్రత్యేకం ఇది గత సంప్రదాయాన్ని కొనసాగించిందని చెప్పవచ్చు.
- AI ప్రాధాన్యం మరోసారి నిరూపితమైంది.

గుర్తించవచ్చు.

**vi. నూతన ప్రోటీన్ల డిజైన్ల కొరకు:**

ఆల్ఫాఫోల్డ్ ద్వారా ప్రోటీన్ల స్ట్రక్చర్‌ను తెలుసుకొన్నట్లయితే మనం కోరుకున్న విధంగా నూతన ప్రోటీన్లను డిజైన్ చేసుకోవచ్చు.

**vii. ప్రతికూలతలు:**


- డేవిడ్‌బెకర్, డెమిస్ హసాబిస్, జాన్ ఎం జంపర్‌లు ప్రోటీన్లపై చేసిన పరిశోధనలు బయోసైన్సెస్ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నప్పటికీ ఈ పరిజ్ఞానం తీవ్రవాదుల చేతికి చిక్కితే దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.
- ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని వ్యాధికారక సూక్ష్మ జీవుల జన్యువులలో మార్పులు చేసి వాటి వ్యాధికారక సామర్థ్యాన్ని మరింత పెంచే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- ఈ ప్రోటీన్ ఇంజనీరింగ్ ప్రక్రియను వినియోగించుకొని ప్రోటీన్‌లద్వారా సరికొత్త విష పదార్థాలను తయారుచేయడం లేదా ఇది వరకే ఉన్న విష పదార్థాల సామర్థ్యాన్ని పెంచే ప్రమాదముందన్న, ఆయారంగాల నిపుణుల హెచ్చరికలు తోసిపుచ్చలేము.

**చివరిగా:**

ఎలన్‌మస్క్ మానస పుత్రిక స్టార్‌లింక్ ప్రాజెక్ట్ ప్రయోజనాలను తీవ్ర వాదులు వినియోగించుకుంటున్నారన్న వార్తలు అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనలు పెంచుతున్న నేపథ్యంలో... డేవిడ్ బెకర్, డెమిస్ హసాబిస్, జాన్ ఎం జంపర్‌లు ప్రోటీన్ ఇంజనీరింగ్‌పై చేసిన పరిశోధనా ఫలాలు విశ్వకళ్యాణానికి వినియోగించాలి. వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ దుర్వినియోగం కాకుండా అన్ని దేశాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే ఎబోలా, జికా, ఎంపాక్స్, కోవిడ్-19 తరహాలో మరో మహమ్మారి మానవాళి పాలిట పెను ఉపద్రవంగా మారే ప్రమాదం పొంచి ఉంటుందన్న సంగతిని మరువరాదు.

**-పుట్టా పెద్ద ఓబులేసు,**
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం, కడప,
m : 9550290047

## పర్యావరణంపై ప్రత్యేక వ్యాసాలు



**మన దక్కన్‌ల్యాండ్** మాసపత్రికలో పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై కథనాలు, వ్యాసాలు, ఇంటర్వ్యూల పట్ల దృష్టి సారించాలని దక్కన్‌ల్యాండ్ ఎడిటోరియల్ బోర్డు భావిస్తున్నది. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కోరుతున్నాం. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం.

**రచయితలు పై అంశాల మీద లోతైన విశ్లేషణలు, విషయాలతో తమ కథనాలను పంపగలరు.**

**చిరునామా :**

TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

# మనిషి భావాలను వ్యక్తపరిచేది మాతృభాష

## ఫిబ్రవరి 21న మాతృభాష దినోత్సవం

అమ్మ మాటే మాతృభాష.. తెలుగు మాట్లాడితే 7200 నరాలు యాక్టివేట్ అవుతాయి అంటారు. మనిషి తన భావాలను వ్యక్తిపరిచేందుకు సాధనం భాష. మాతృభాషతోనే మనిషి జీవితం మొదలవుతుంది. అమ్మ నేర్పించే మాతృభాష అమృతంలాగా ఉంటుంది. తేనె కంటే తియ్యగా ఉంటుంది. చిన్ననాటి నుంచి.. చివరి శ్వాస వరకూ.. మనిషి జీవితాంతం తోడు ఉండేది మాతృభాష. కమ్మనైన అమ్మపాట లాంటిది మన తెలుగు భాష. కొన్ని వందల ఏళ్ల చరిత్ర కలిగిన గొప్ప వారసత్వ సంపద. అందుకే అంతటి గొప్ప వ్యక్తి.. శ్రీకృష్ణదేవరాయాలు 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని వ్యాఖ్యానించాడు. తల్లే మొదటి గురువు, తల్లి ఒడి బిడ్డకు మొదటి బడి. జీవితంలో మొదటగా నేర్చుకునేది ఏదైనా ఉందంటే.. అది మాతృ భాషే. అమ్మ పలికే.. ప్రతీ పలుకు నేర్చుకునేందుకు ప్రయత్నిస్తుంటుంది బిడ్డ. అందుకే ప్రతీ ఒక్కరూ అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కాపాడుకోవాలి. పరభాషను ప్రేమించాలి. మాతృభాషను గుండెల్లో పెట్టుకోవాలి. అందుకోసమే ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహిస్తారు.




అమ్మ భాషను రక్షించుకోవడానికి 1999లో 30వ యునెస్కో మహాసభ.. ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా ప్రకటించింది. ఆత్మగౌరవాన్ని ప్రసాదించే.. అమ్మ భాషను గౌరవించడం ప్రతీ ఒక్కరి బాధ్యత. ఏ జాతి అయితే మాతృభాషను కీర్తిస్తుందో ఆ జాతి మరింత అభివృద్ధి చెందుతుంది. ఇక తెలుగు భాష విషయానికి వస్తే.. వేల ఏళ్ల నుండి మనుగడలో ఉంది. భాషలో కాస్త మార్పులు రావొచ్చు.. కాలం మారుతుంది. భాషలోనూ మార్పులు వస్తున్నాయి. అయితే అందులోని మాధుర్యం మాత్రం అలానే ఉంది. అది తెలుగు భాష గొప్పదనం.

తెలుగులోని ప్రతి పదం అచ్చు శబ్దంతో ముగుస్తుంది. మన తెలుగులోనే అత్యధిక సంఖ్యలో సామెతలు ఉన్నాయి. భారతదేశంలో తెలుగు మాట్లాడేవారు ఎక్కువే ఉన్నారు. ఇటాలియన్ వర్తకులు.. తెలుగు భాషను ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా పిలిచారు. క్రీస్తుపూర్వం 400 నుంచి తెలుగు భాష ఉనికిలో ఉంది. తెలుగులో భాష మాధుర్యం గొప్పది. అయితే తెలుగును మాట్లాడితే 7200 నరాలు యాక్టివేట్ అవుతాయి. ఇది సైంటిఫిక్‌గా నిరూపితమైంది.

తెలుగు రాష్ట్రాలతోపాటుగా భారత దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ తెలుగు మాట్లాడేవారు ఉన్నారు. శ్రీలంకకు చెందిన జిప్సీ జాతి ప్రజలు కూడా తెలుగు మాట్లాడుతారు. భారతదేశంలో స్థానిక భాషలు మాట్లాడే స్థానంలో తెలుగుది మూడో స్థానం. తెలుగులో తియ్యదనం ఉంది. ప్రతి పదం పలుకుతుంటే.. అమ్మతో మాట్లాడినట్టుగా ఉంటుంది. అందుకే మాతృభాషగా తెలుగును మాట్లాడే వ్యక్తులుగా ఆనందిద్దాం... మాతృభాష గొప్పతనాన్ని నలుదిశలా చాటుదాం. అందరికీ అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ శుభాకాంక్షలు.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

DECCAN
దక్కన్
సామాజిక, సాంస్కృతిక ఛానల్
CHANNEL

# గౌరాదేవి - చిప్కో ఉద్యమ బీజం

ఈ అడవి మా తల్లిగారిల్లు అన్నారు ఆ తల్లులు. ఈ ఇంటి నుంచే మేం కట్టెపుల్లలు తెచ్చుకుంటాం. గడ్డికోసుకుపోతాం. మూలికలు ఏరుకుంటాం. ఈ ఇంటి నుంచే కూరలు, కాయలు, పండ్లు ఫలాలు సంపాదించుకుంటాం. ఈ అడవిని నరొకొద్దన్నారు. ఈ అడవిని కొట్టివేస్తే కొండచరియలు విరిగి మా ఊరి మీద పడతాయి. వరదలొస్తాయి. మా పొలాలు కొట్టుకుపోతాయి. మా తల్లిగారింటిని ధ్వంసం చేయొద్దు. మా ఇల్లు కూల్చొద్దు అన్నారా మహిళలు. ఆ అన్నవారితో ఏభై ఏళ్ల గౌరాదేవి ఉంది. అట్లా పలికిన వారిలో యాభై రెండేళ్ల మూంగాదేవి ఉంది. బాలదేవి, రూప్సా బాడి, మూసి, హర్కి, మాల్మతి, ఫగుణ లాంటివారు మొత్తం గౌరాదేవితో కలిపి ఇరవై ఒక్క మంది. ఏడుగురు ఆడపిల్లలు అడవులను నరుక్కుపోయే, ఆరణ్యాలను మాయం జేసే ముఠాలకు కాంట్రాక్టర్లకు ఎదురు నిలిచారు. సంఘర్షించారు. అవమానితలయ్యారు. అయినా అదరక బెదరక తలపడ్డారు. అదొక చరిత్ర అయ్యింది. పర్యావరణ ఉద్యమాలకు, పోరాటాలకు, ప్రతిఘటనలకు తలమానికంగా నిలిచిన చిప్కో ఉద్యమమైంది. వారికి మార్క్స్ తెలియదు. లెనిన్ ఎరుగురు. గాంధీ, వినోబా బావేలూ తెలియరు.



ఎప్పుడు చిప్కో ఉద్యమం ప్రస్తావనకు వచ్చినా రెండేరెండు పేర్లు ప్రముఖమంగా వినిపిస్తాయి. ఒక పేరు సుందర్‌లాల్ బహుగుణ అయితే, రెండవ పేరు చండీప్రసాద్ భట్. ఇద్దరూ ఇద్దరే. పర్యావరణ ఉద్యమ చరిత్రలో చిరఃస్మరణీయులే. పర్యావరణ పోరాటాలకు పర్యాయపదాలుగా ఉన్నవారే. అయినప్పటికీ చిప్కో ఉద్యమం గురించి శేఖర్ పాఠక్ ప్రజల చరిత్రగా అభివర్ణించి మరుగున పడ్డ అనేక విషయాలను తన పరిశోధనాత్మక గ్రంథం 'ది చిప్కో మూమెంట్'ను వెలువరించాడు. ఎన్నో విలువైన విషయాలను పాఠక్ ఈ గ్రంథంలో వివరించాడు.

మార్చి 26 నాడు హిమాచల్ ప్రదేశ్ నుండి కూలీలు పదిగంటల ప్రాంతంలో జోషీమఠ్ నుండి రేని గ్రామానికి బస్సులో బయలు దేరారు తమను గుర్తు పట్టకుండా తలపాగాలు తగిలించుకున్నారు. బస్సు కిటికీలకు పరదాలు కట్టుకున్నారు. వారి వెనుక అటవీ శాఖ అధికారులు, ఉద్యోగులూ జీపులో అనుసరిస్తూ బయలుదేరారు. గ్రామ ప్రజల కంట పడకుండా అడవికి ప్రధాన రహదారి ద్వారా కాకుండా రిషిగంగా నది ఒడ్డున దారి ద్వారా అడవికి చేరాలి.

వారు అడవికి వెళుతున్న సంగతిని రేని గ్రామంలోని ఒక బాలిక చూసింది. గ్రామంలో పురుషులు ఎవరూ అందుబాటులో లేరు. ఎవరో అపరిచితులు అడవి దిశగా సాగుతున్నారనే విషయం ఎవరికి చెప్పాలి. మహిళా మంగళ్‌దళ్ పెద్ద దిక్కైన గౌరాదేవికి తాను చూసిందేమిటో వివరించి చెప్పింది. గ్రామంలో చిప్కో కార్మికులు పెట్టే సమావేశాల్లో వెనకెక్కడో కూర్చునే స్త్రీలు మహిళాదళ్ సభ్యులు అటువంటి సమావేశాలకు గౌరాదేవి పెద్దగా హాజరయ్యేది కాదు. కొడుకు మాత్రం అటువంటి సమావేశాలకు వెళ్లేవాడు.

రేని గ్రామంలో పదకొండు గంటల సమయమంటే ప్రతీ ఇంట్లోనూ వంట చేసే పనులను స్త్రీలు మొదలెడతారు. తన పనులను విడిచి పెట్టి గౌరాదేవి కొంతమంది తోటి మహిళలను కూడదీసింది. కార్పెట్ నేతలో మునిగిన ఓ స్త్రీ తన నేత ఆపింది. ఇస్త్రీ చేస్తున్న మహిళ ఒకరు పనిని ప్రక్కకు పెట్టింది. ఒకామె వండుతోంది. ఇంకొకరు పిల్లకు నీళ్ల పోసుకుంటోంది. తమ తల్లుల హైరానా, వడివడిగా నడుస్తూ పోవటం చూసిన ఏడుగురు ఆడపిల్లలు తల్లుల వెనకే పరుగుపెట్టారు. గౌరాదేవితో పాటు ఆ మహిళలు కూలీలు ఎక్కడ జమయ్యారో అక్కడికి అడ్డదారిలో చేరుకున్నారు. కూలీలు వంటలు చేసుకోవడంలో మునిగి ఉన్నారు. కాంట్రాక్టరు తరఫున పనిచేసే క్లర్కులు అటవీ శాఖ ఉద్యోగులు ప్రణాళికలు వేస్తున్నారు. చెట్లు కొట్టడానికే వాడే పనిముట్లు, ఇతర సాధనాలు నేలమీద పరచి ఉన్నాయి.

కొండ ఎక్కుతూ వచ్చిన మహిళలు ఆయాసంతో వేగంగా శ్వాస తీసుకుంటున్నారు. గుమస్తాలు, అటవీ సిబ్బంది వీరిని చూసి కొంత వెనక్కి తగ్గారు. కానీ వాళ్లు తమ ఆశ్చర్యాన్ని బయటకు వ్యక్తం కానీయలేదు. హిమాచల్ నుంచి వచ్చిన కూలీలు ఆశ్చర్యపోయారు. అప్పుడా స్త్రీలు చెప్పిన మాట చెట్లు కొట్టొద్దు. చెట్లను కొట్టనీయం.

తల్లులు కనుక కూలీలు వంటవండుకోవటం చూశారు.

వందుకున్నవి తిని కొండ దిగి వెళ్లిపోండి అని సూచించారు. తమ పనిని అడ్డుకుంటున్నందుకు కాంట్రాక్టరుకు చెందిన వ్యక్తులు అటవీ ఉద్యోగులు తాగి ఉండటం చేత గౌరాదేవితో వచ్చిన మహిళలను దూషించారు. బెదిరించారు. అరెస్టు చేస్తామని హెచ్చరించారు. ఆ సిబ్బందిలో ఒకరి దగ్గర తుపాకీ కూడా ఉంది ఆ గన్ మాన్ తమవైపు తూలుతూ రావటం చూసి గౌరాదేవి అతడికి ఎదురునిలిచి "నన్ను ఇక్కడ కాల్చి, నా తల్లిగారి ఇల్లైన ఈ ఈడవిని కొట్టి తీసుకుపో" అని గర్జించింది. ఆమెకు దిగువన రిషిగంగా ప్రవాహం. ఆమెకు ఎగువన పర్వతాలు ఆమె విసిరిన సవాలు అక్కడి వారినందరినీ నిశ్శబ్దంలోకి నెట్టింది. ఉత్తరాఖండ్ చరిత్రలో అదొక అసాధారణమైన రోజు. ఆ రోజు మార్చి 26, 1974 ఒక గౌరాదేవి ఒక్కరే మాట్లాడలేదు. ఉత్తరాఖండ్‌తో పాటుగా దేశంలోని అటవీ సంపదమీద ఆధారపడి బ్రతుకులు వెళ్లదీసే వారంతా మాట్లాడినట్లైంది. ఈలోపు గ్రామంలోని మిగతా మహిళలంతా అక్కడికి చేరుకున్నారు. అడవులు నరకడానికొచ్చిన కూలీలు రేషన్ కొండపైకి తీసుకురావటం చూశారు. ఆ మహిళలు వారిని అక్కడే ఆపి, భోజనం చేశాక కొండ దిగి రమ్మని చెప్పారు. అడవికి చేర్చే దారిని సిమెంటు దిమ్మలు పగలగొట్టి మూసివేశారు. ఆ దారిలో సమీప వంతెన దగ్గర 1800 బ్యాగుల రేషన్ రోడ్డు పక్కన ఉండటమూ చూశారు. అంటే ఆ అడవిలో కలపను ఎంతగా కొట్టివేయడానికి సిద్ధపడ్డారో గమనించవచ్చు. అడవికి వెళ్లేదారిలో జంక్షన్ వద్ద మహిళలు బైఠాయించారు. కాంట్రాక్టర్ మనుషులు ఆ సాయంత్రం గౌరాదేవిని ప్రక్కకు పిలిచి బెదిరించారు. ఆమెపై ఉమ్మివేశారు. అయినా ఆమె చలించలేదు. మౌనంగానే వారి దూషణలను అవమానాలను సహించింది. ఆ రాత్రంగా ఆ మహిళలు అక్కడే కూర్చుని అడవికి కాపలా కాశారు. నందాదేవి, ఇతర స్థానిక దేవతల గురించి పాటలు పాడుకున్నారు. వారేమీ నినాదాలు ఇవ్వలేదు.





దౌల నది వెనక ఉన్న పర్వత శిఖరాగ్రం మీంచి సూర్యుడు ఉదయించాడు. అది 1974 మార్చి 27. ఉదయం తొమ్మిదిగంటల ప్రాంతంలో నాయకులు రావటం మొదలైంది. జోషిమఠ్ నుంచి గోవింద్‌సింగ్ రానర్, గోపేశ్వర్ నుండి చండీప్రసాద్ తదితర నాయకులు వచ్చారు. వారినందరినీ ఆ మహిళలు స్వాగతించారు. వారిలోంచి గౌరాదేవి ముందుకు వచ్చి "మేం ఏది చేయాలో అదే చేశాం. మాకు పశ్చాత్తాపం లేదు. మేమేమీ భయపడనూ లేదు. హింస లేదు. ఎవరూ ఎవ్వరినీ కొట్టలేదు. మేం వాళ్లతో హుందాగానే మాట్లాడాం. ఒక వేళ పోలీసులు అరెస్టు చేస్తే అందుకు వేం భయపడం. వేం మా పుట్టింటిని కాపాడుకున్నాం. మా పొలాలు, నేలను రక్షించుకున్నాం" అని పలికింది. జరిగిన సంఘటనలను మహిళలు వచ్చిన నాయకులకు వివరించారు. మిగతాది అంతా పర్యావరణ ఉద్యమ చరిత్ర.

చిప్కో ఉద్యమం భారతీయ అటవీ విధానాలపై పెద్ద చర్చనే లేవనెత్తిందంటారు రామచంద్ర గుహ. వ్యాపార ధోరణుల సంకుచితత్వాన్ని ఎత్తి చూపించి కొద్దోగొప్పో చిప్కో ఉద్యమ మూలంగానే ప్రభుత్వాలు అటవీ ఉత్పత్తులమీద దృష్టి నిలుపగలిగాయి. చిప్కో ఆకస్మికంగా పుట్టుకొచ్చిన ఉద్యమం కాదు. వేలాది సంవత్సరాలుగా గ్రామీణ ప్రజల నియంత్రణలో ఉన్న వనరులను ఎవరికో ధారాదత్తం చేస్తుంటే ప్రతిఘటిస్తూ వచ్చిన శతాబ్దాల పోరాట చరిత్రల సంగమస్థితి. గౌరాదేవి లాంటి మహిళలు మన చుట్టుప్రక్కల కూడా ఉండే ఉంటారు. వారికి అండగా నిలబడటమంటే ప్రభుత్వాలకి వ్యతిరేకంగా నిలవటంకాదు. ప్రకృతికి అనుకూలంగా స్పందించటం ప్రతిస్పందించటం.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# తెలంగాణలో గంగిరెద్దులాట

**పరిచయం:**

ప్రజల జీవనవిధానంలోనే పుట్టి, ఒక జాతి ఔన్నత్యాన్ని చాటేవి జానపదకళారూపాలు. ప్రాచీన సంస్కృతిని ప్రతిబింబించే జానపదకళలెన్నో ఇప్పటికే కాలగర్భంలో కలిసిపోయాయి. ఈ జానపదకళారూపాలు జాతిజీవనంలో పెనవేసుకొని ఒక దేశానికి ప్రాంతానికి పరిమితం కాకుండా ఏదేశంలో, ఏప్రాంతంలో ఉన్నా అక్కడి ప్రజల ఆశలకు, ఆశయాలకు ప్రతిరూపాలుగా ఉంటున్నాయి. మహోన్నత సంస్కృతికి పట్టుకొమ్మలైన కళలు కొన్ని కొనవూపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. అంతరించిపోతున్న ఒక వృత్తికళావైభవ సౌందర్యాన్ని పరిచయం చేస్తున్న జానపద కళారూపాలలో గంగిరెద్దాటలు ఒకటి.

**గంగిరెద్దు – ఆటల పరిచయం**



పూర్వం కళారూపాలన్ని రాజాశ్రయాన్ని పొంది ఆదరింపబడినవి. రాచరికవ్యవస్థ రద్దైపోయినప్పటికీ కళాకారులు కులవిద్యల్ని వీడలేక, దేశదిమ్మరులై సంచారం చేస్తూ యాచించడం మొదలుపెట్టారు. సమాజంలో వివిధ కులగాథల్ని వినిపిస్తూ పొట్టపోసుకుంటూ వచ్చినవారు కొందరైతే, మూలపురుషుని చరిత్రని పురాణకథలుగా చెప్తూ మరికొందరు జీవిస్తూ వచ్చారు. వీరికంటే భిన్నమైన కళాజీవితం గంగిరెద్దు యాచకులది. ఈ కళారూపం వేయిసంవత్సరాల క్రితం నుండే ప్రదర్శింపబడుతూ వస్తుంది.

ప్రతి జానపద కళారూప ఆవిర్భావానికి ఉన్న చారిత్రక ప్రస్తావన మనకు సాహిత్యంలో కనబడుతుంది. క్రీ.శ. 14వ శతాబ్దానికి చెందిన శ్రీనాథుడు తన పల్నాటి వీరచరిత్రలో

*"గంగిరెద్దులవాడు కావరమణిచి*

*ముకు తాడు పొడిచి పోట్లెద్దులాట"* అంటూ

ఉదాహరించడాన్ని బట్టి అతిప్రాచీనకాలం నుండి గంగిరెద్దులాటలు ప్రాచుర్యంలో ఉన్నట్లు తెలుస్తుంది. పూర్వం రాజుల కోటల్లోనో, జమీందార్ల ప్రాంగణాల్లోనో గంగిరెద్దుల ప్రదర్శనలు జరిగేవని తెలుస్తుంది. కేవలం వినోదంగానే గాక గంగిరెద్దుల నేర్పు విజ్ఞానదాయకంగానే ఉండేది కాబట్టి జానపదులు వాటిని తిలకించేవారు.

డా. పల్లాదుర్గయ్యగారు ఎవరు రాయని సరికొత్త వస్తువును స్వీకరించి 1956లో "గంగిరెద్దు" కావ్యం రాశారు. ఇందులో అవలక్షణాలు కలిగిన కోడెను గంగిరెద్దులవాడు తన ఆధీనంలోకి తీసుకొని రకరకాల విద్యలు, విన్యాసాలు నేర్పి ఊరూరు తిప్పుతూ దానిపై ఆధారపడి జీవిస్తూ ఉంటారని వివరించారు.

గంగిరెద్దులవారు తెలంగాణ, ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలలో కూడా వున్నారు. వీరిలో ఎక్కువమంది తెలుగు ప్రాంతాలలో తెలుగుభాష మాట్లాడేవారు ఉండటం విశేషం. వ్యవసాయ ప్రధానమైన మన ప్రాంతాల్లో, జీవనవిధానంలో పాడి పశుసంపదకి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎద్దు శివుడి వాహనమైన నందీశ్వరుడిగా, బసవన్నగా పూజలందుకుంటుంది. ఏరువాక పున్నమి సమయంలో ఎడ్లని చక్కగా అలంకరించి పూజచేయడంతో వ్యవసాయారంభం అవుతుంది. దేశానికి వెన్నెముక రైతు అయితే రైతుకి వెన్నెముకగా ఎద్దు నిలుస్తుంది. అలా పర్వదినాల్లో ముఖ్యంగా రైతులకు పంటలు చేతికివచ్చే సమయంలో సంక్రాంతి పండగ సందర్భాలలో గంగిరెద్దులవారు ప్రజలను వినోదపరుస్తూ యాచిస్తూ వుంటారు. కేవలం సంక్రాంతి పండగకే పరిమితం కాకుండా వివిధ ప్రాంతాలు తిరుగుతూ గంగిరెద్దులతోనే యాచించడం వాళ్ళ వృత్తిగా చెప్పవచ్చు. ఇంచుమించు ఒక ప్రదేశంలో కాకుంటే మరొక ప్రదేశంలోనైనా నిరంతరం ఈ యాచకవృత్తి నడుస్తూనే ఉంటుంది. కారణం గంగిరెద్దే గంగిరెద్దులవాని ఆస్తి.

**కులోత్పత్తిగాథ:**

గంగిరెద్దులవారికి సూత్రధారులనే మరో పేరుంది. తరతరాలుగా ప్రజలు చెప్పుకునే పురగాథ ఈ సూత్రధారులనే పేరు ఎలా వచ్చిందో తెల్పుతుంది. గజాసురుడు తపస్సు చేసి పొందిన వరం వల్ల గర్వంపొంది విర్రవీగుతుంటే వాడి చావుకి విష్ణుమూర్తి సూత్రధారిగా అవతరించి, తనతోపాటుగా బ్రహ్మని, తుంబుర, నారదులని సన్నాయి పాటకులుగా మార్చి, శివుని వాహనమైన నందీశ్వరుని వెంట తీసుకొని వెళ్ళి ఆటాడించి గజాసురున్నీ పొడిపించి వాడి కడుపులో నున్న శివుణ్ణి విముక్తం చేయిస్తాడు. ఆనాటి బసవన్నే ఈనాటి గంగిరెద్దు. ఆనాటి సూత్రదారుల సంతతి ఈనాటి గంగిరెద్దులవారు. కేశవుడే ఈ కులానికి మూలపురుషుడని పౌరాణికంగానే ఈ కులోత్పత్తిగాథ ధృవపరుస్తుంది. వీరు "పూజగొల్ల" తెగకు చెందినవారని జానపద పరిశోధక సంస్థ "Folk Arts of Andra Pradesh" వివరించింది.





ఎవరేది చెప్పినప్పటికి వీరు దాసరి వర్గానికి చెందినవారనిపిస్తుంది.

**వేషధారణ:**

బిక్షుకవృత్తి వేషదారణలోనూ విలక్షణత కనిపిస్తుంది.

*"డుం డుం గంగిరెద్దు దాసరొడొచ్చాడు*
*డూ డూ డూ బసవన్నని తోలుకొచ్చాడు"* అని

ఒక సినీకవి గంగిరెద్దులవాని వేషమును కళ్ళకి కట్టించాడు. నెత్తికి కిరీటంలా ఎర్రని రుమాలు, చేతిలో కంచుగుంట, చేతికి కడియాలు, చెవికి కమ్మలు, నుదుట తిరునామాలు, తెల్లని అంగి, దానిమీద నల్లటి కోటు, తెల్లని పంచ అచ్చం జానపద హీరోల వేషాన్ని ధరిస్తాడు. నాయకుని వెంట ఆయనలానే వేషం వేసుకొని ఒకడు శృతి, బూర మరొకరు డోలు వాయిస్తూ సహకారాన్ని అందిస్తూ వుంటారు.

ఇక బసవన్నని వేషధారణ అసాధారణంగా ఉంటుంది. ఆ బసవన్న ఆటని నేర్చిన కోడెగిత్త దాని మూపురం వద్ద నుంచి తోక దాకా రంగురంగుల గుడ్డలు చుట్టి కొమ్ముల చివరలో దగదగలాడే ఇత్తడిగొట్టాలు తొడుగుతారు. నొసట తొలుకుచ్చులు కట్టి పసుపు, కుంకుమలు దిద్దుతారు. మూపురం పైభాగంలో ఎర్రని గుడ్డతో గోపురంలా చుట్టేస్తారు, కాళ్ళకి గజ్జెలు కడుతారు. మూతికి తోలుతోకుట్టిన శికమారును లేదా ఇత్తడిరేకులాంటి బాషికంకట్టి అచ్చం నందీశ్వరునిలా తయారుచేస్తారు. ఈవిధమైన సుందర గంగిరెద్దుకి చిట్టి ముకుతాడు కట్టి, దానికి పొడగాటి నూలుతాడు వేసి తన చంకలో ఇరికించుకొని సూత్రదారుడు ప్రదర్శనకు బయలుదేరుతాడు.

**3) అద్భుత విన్యాసాలు:**

జానపద కళారూపాలలో గంగిరెద్దుల విన్యాసాలకు గొప్ప ఆధారణ ఉండేది. గంగిరెద్దులవారికి ప్రతి ఊరిలోనూ మధ్యనున్న పెద్దబజారే రంగస్థలం. గ్రామపెద్దలను ఆశ్రయించి వారి అనుమతితో ప్రదర్శనం ఏర్పాటు చేసుకుంటారు. విన్యాసాలకు ముందు వారి వాయిద్యాలతో రణగొణధ్వనులు చేసి ప్రజలను రప్పించిన తరువాత మేళతాళాల మ్రోతలో గజ్జెలకాళ్లతో గంగిరెద్దు రంగప్రవేశం చేస్తుంది. మొదట వాయిద్యం, సన్నాయి రాగాలకు అనుగుణంగా అడుగులు వేయిస్తారు. ముందటి కాళ్ళతో దండం పెట్టిస్తారు. మనిషిని ముందు ఉరికించి వాన్ని కుమ్మినట్టుగా పరుగులెత్తిస్తారు. మైదానం మధ్యలో బొంతపరిచి అందులోకి నాల్గుకాళ్ళు చాచి పడుకునేటట్టుగా చేయిస్తారు. ఎద్దునోటిలో మెడను ఇరికించి. ఆ దృశ్యాన్ని అందరికీ చూపిస్తారు. అయ్యగారికి దండం పెట్టమంటే నమ్రతతో తల వంచేది. అయ్యగారికి శుభం కలుగుతుందా? అనుకున్న పనులు జరుగుతాయా? అంటే అవునన్నట్లు తల ఊపుతుంది. చివరగా ప్రదర్శించే విన్యాసాలు ఉత్కంఠగా మార్చేస్తారు అద్భుతమైన ప్రదర్శనకు పూనుకొని ప్రేక్షకులను మెప్పించే సాహసాలు చేస్తుంటారు. గంగిరెద్దులవాడు వెల్లకిలా పడుకొని తనగుండె మీదకి బసవన్నీ ఎక్కించుకొని జోలపాట పాడుతూ ఉయ్యాలలూగిస్తాడు బసవా! దానధర్మాలు చేసే దాతలకు కొండేలు చెప్పి పుండాకోర్లనోట్ల మట్టి ఎలా కొడతావో చూపించుమనగా అది చేసి చూపిస్తుంది. గంగిరెద్దుల వాడు గంగిరెద్దుతో చేయించిన విన్యాసాలను ప్రజలు మెచ్చుకొని విరాళాలు ఇవ్వడం జరుగుతుంది.

**4) దీవెనల సాహిత్యం**

గంగిరెద్దులాట అనేది జానపదబహుజన కళారూపం. వీరు ప్రదర్శించే విన్యాసాలలో విజ్ఞానం, వినోదంతో పాటు దేశానికి, జాతికి మంచి జరగాలనే దీవెనలుంటాయి. గంగిరెద్దుల కోసం శిక్షణ వున్నట్లే ఆట, పాట మాటల్లో సూత్రధారులకి కూడా శిక్షణ వుంటుంది. కొంత వంశపారంపర్యంగా అబ్బుతుంది. ప్రదర్శనలో ప్రజలని ఆకర్షించే చమత్కారాల్ని, పౌరాణిక పాత్రల మహాత్యాన్ని దీవెనల్ని సమ్మేళనంలో చేసే నేర్పుతో తర్ఫీదు పొందుతారు. ఈ కళారూపంలో గంగిరెద్దాట, సన్నాయి పాట, సూత్రదారి మాటలు





లయాత్మకంగా, రసాత్మకంగాను ఉంటాయి. వరికల్లానికి, దింపుడుకల్లానికి మాటలు, పాటలు, ఆటలు వేరువేరుగా వుంటాయి. గంగిరెద్దులాట మధ్యమధ్యలో వచనగేయం లాంటి సాహిత్యమే సాగుతుంటుంది. ఇది కూడా అందరికీ దండం పెట్టించడంతో మొదలవుతుంది.

*"అయ్యగారికి దండం బెట్టు*
*అమ్మగారికి దండం బెట్టు*
*మునసబు గారికి దండం బెట్టు*
*కరణం గారికి దండం బెట్టు*
*పోరా బసవన్నా"* అనగా అది వారివారి వద్దకు వెళ్లి తల ఊపుతుంది.



గంగిరెద్దులవాడు తనకు దానం చేయమని అడుగుతూ పల్లెల్లో, పట్నాల్లో దొరలు, దొరసానుల పేర్లు సంతోషముతో చెప్పుకుంటానని బీదలకిచ్చిన సొమ్ము ఎప్పుడు వృధాగా పోదని గంగిరెద్దులవాడు అందరి దగ్గర కావలిసినవి రాబట్టుకున్న తర్వాత నూరేళ్ళు వర్ధిల్లాలి, సిరిసంపదలతో కళకళలాడాలి దొరబాబు దబ్బిచాడు. దొరసాని సీరలిచ్చింది. వారి కొడుకులు బిడ్డలు సల్లంగుండాలి అంటూ సన్నాయి డోలు, లయాల్లో రాగయుక్తంగా దీవెనలిస్తాడు.

ఏ ఊరిలోనైనా ఎవరైనా చనిపోతే గంగిరెద్దులవారు అక్కడ క్షణంలో వాలిపోయి బాధలో వున్న బంధువులకి సంతృప్తిని కలిగించేందుకు "అయ్యగారంటే మహాగొప్ప మనిషి, అచ్చెగాన్ని, బిచ్చగాన్ని ఉట్టిగపంపలే" అంటూ మరణించినవ్యక్తి మంచిగుణాల్ని కీర్తిస్తూ వారి ఇంటిముందే గంగిరెద్దులని ఆడిస్తుంటారు. శవయాత్ర స్మశానానికి తరలగానే పాడెముందు గంగిరెద్దులను నడిపిస్తూ అనేక విన్యాసాలు చేయిస్తుంటారు. దింపుడుకల్లంకాడ "మహాదొడ్డ మనిషి వైకుంఠం పోతడు" అంటూ మరణించిన వ్యక్తికి స్వర్గం ప్రాప్తించాలని పాడుతూ బంధువుల వద్ద దానాలు పొందుతారు. చావుదప్పుల కంటే గంగిరెద్దుల సన్నాయి, డోలు చప్పుల్లే ఎవరిదో చావు అవుతుందని తెలిపే సంగీత సంకేతాలవుతాయి.

సామాన్య రోజుల్లో ఊళ్ళోకి బిక్షాటనకి వెళ్ళినపుడు త్యాగయ్య అన్నమయ్య కీర్తనలు, జానపదపాటలు, ఉయ్యాలపాటలు, బతుకమ్మపాటలు

*చిత్తు చిత్తుల బొమ్మ*
*శివుని ముద్దుల గుమ్మ*
*బంగారు బొమ్మ దొరికేనమ్మో ఈ వాడలోన*
*చెట్టులెక్కగలవా! ఓ నరహరి*
*గుట్ట లెక్కగలవా!*
*చెట్టు లెక్కి ఆ చిటారు కొమ్మన చిగురు కోయగలవా! ఓ నరహరి, చేతిలో చెయ్యేసి* చెప్పుబావా లాంటి సినీయుగళ గీతాలు, రాములమ్మ ఓ రాములమ్మ ఓహో రాములమ్మ లాంటి ప్రజాదరణ పొందిన పాటలు. తమ సన్నాయి రాగాల్లో మేళవించి తమ ప్రతిభను చాటుతూ ప్రజలనుండి దానధర్మాలు స్వీకరించి వారు ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని దీవిస్తారు.

**ముగింపు:**

మనకళలు జాతికి జీవనాడులు వంటివి. పరిపూర్ణకళా స్వరూపమై జానపదులకు అత్యంత సన్నిహితమై రసానుభూతినీ, ఆత్మానందాన్ని కలిగిస్తున్న ఈ గంగిరెద్దాటలు క్షీణించకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది. ఎద్దులను బ్రతికిస్తూ ఎద్దుల ద్వారా కళను బ్రతికిస్తూ తద్వారా వారు బ్రతుకుతూ దేశసంచారం చేస్తున్న గంగిరెద్దుల వారి ఈ మహోన్నత కళారూపం అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదీ, మనందరిదీ.

**ఆధారగ్రంథ సూచి:**


1. తెలుగువారి జానపద కళారూపాలు – డా. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
2. పల్నాటి వీరచరిత్ర – శ్రీనాథుడు
3. గంగిరెద్దుకావ్యం – డా. పల్లాదుర్గయ్య
4. జానపద కళారూపాల్లో వృత్తిపురాణాలు – ప్రొ. నమమాసస్వామి


– అరుంధతి
m : 9704964860

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

## ప్రచురణలు

చెలిమి అంటే స్నేహం. బడిలో చెలిమి.. ఇంట్లో కలిమి... బాల చెలిమి... చదువు కోదానికి పాఠ్య పుస్తకాలు మినహా ఇతర బాల సాహిత్యం అందుబాటులో లేని విద్యార్థుల్లో లోకజ్ఞానం పెంచి, రోజు రోజుకు విస్తరిస్తున్న ప్రపంచ జ్ఞానాన్ని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు కూడా ఎప్పటికప్పుడు అందించి వారిని ఎవరికీ తీసిపోని విధంగా తయారు చేసే లక్ష్యంతో ప్రారంభమైన బాలల వికాస పత్రిక 'బాలచెలిమి'.



చందదారులుగా చేరండి! **బాల చెలిమి** చందదారులను చేర్పించండి!

'యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువదుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

మా చిరునామా : **BALA CHELIMI**
"BHOOPATHI SADAN" 3-6-716, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.Mob: 9030626288,
Email:desk.chelimi@gmail.com, www.balachelimi.com

చందా వివరాలు :
విడి ప్రతి : రూ. 40, వార్షిక చందా : రూ. 400, 2 సం॥లకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందా మొత్తం చెల్లించవచ్చు.

ACCOUNT DETAILS :
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

### తెలంగాణ బడి పిల్లల కథలు



10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300

### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)




10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300

### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



Printed at : Deccan Press, Azamabad, Hyderabad. Ph.+91 90599 50055



చిత్తూరు జిల్లా జియోలాజికల్ భౌగోళిక చిత్రం

# ఉమ్మడి చిత్తూరు జిల్లా శిలా మరియు ఖనిజ సంపద

ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతంలో 15,140 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నది. దేశంలోనే ప్రసిద్ధి చెందిన వెంకటేశ్వరస్వామి మందిరం ఈ జిల్లాలో తిరుమల కొండల్లో కలదు. ఇది తిరుపతి పట్టణానికి ఉత్తరాన ఉన్నది. మరియు ప్రతిరోజు లక్షల మంది భక్తులు ఈ క్షేత్రాన్ని సందర్శించి స్వామివారి దర్శనం చేసుకుంటారు. ఈ జిల్లాలో మదనపల్లి పట్టణం వద్ద 1314 మీ॥ ఎత్తుగల హార్సిలీ కొండను ఆంధ్రప్రదేశ్ పర్యాటక విభాగం దీన్ని ఒక ఆకర్శవంతమైన పర్యాటక స్థలంగా మార్చారు. ఇక్కడ వేసవి కాలంలో చల్లగా ఉండటం వల్ల ఇక్కడ టి.బి. సానిటోరియంని ఏర్పాటు చేశారు. ముంబయి, చెన్నై, బెంగళూరు-చెన్నై, ధర్మవరం-పాకాల, గూడూరు-కాట్‌పాడి మరియు జాతీయరహదారి NH-4 ఈ ప్రాంతం ద్వారా వెళ్తుంది.

ఈ జిల్లాలోని ఈశాన్య ప్రాంతం చాలా రగ్గెడ్‌గా కడప బేసిన్‌లోని కొండలతో కూడి ఉంటుంది. ఈ కొండలు రిడ్జస్‌గా NW-SE దిశల్లో విస్తరించి యుంటవి. ఈ ప్రాంతం 57 మీ॥ నుండి 1314 మీ॥ వరకు ఎత్తు పల్లాలు ఉన్నాయి. వీటన్నిటిలో తిరుమల కొండలు ప్రముఖమైనవి. 100 మీ॥ వర్టికల్ డ్రాప్‌ని చూడగలము. తూర్పు ప్రాంతం చాలా వరకు ప్లాటుగా ఉంటుంది. మధ్య మధ్యలో కొండలు, లోయలతో కూడి ఉంటుంది. మిగతా ప్రాంతం ప్లేన్‌గా 50 మీ॥ ఎత్తులో ఉంటుంది.


ఈ జిల్లా ప్రాంతంలోని ప్రముఖమైన నదులు బహుదా, కాలంగి, స్వర్ణముఖి, ఆరని, నగరి, పొయిని, కౌండిన్య మరియు పాలార్. ఈ నదులు వీటి డ్రైనేజి ఈ ప్రాంతం యొక్క నీటి అవసరాలను తీరుస్తాయి. వీటి డ్రైనేజీ ప్యాటర్న్ డెండ్రిటిక్ నుండి సబ్ డెండ్రిటిక్‌గా ఉంటుంది.

ఈ జిల్లాలో ఆర్క్యన్, ప్రొటిరోజోయక్, జురాసిక్-క్రిటేశ్యస్ మరియు టర్ష్యరి-క్వాటర్‌నరికి చెందిన పీరియడ్స్‌కు చెందిన శిలలు కలవు. చాలా భాగం ఈ జిల్లాలో పెనిన్సులర్ నైసిక్ కాంప్లెక్స్ యొక్క నైసెస్, గ్రానైట్స్ మరియు వీటి వేరియంట్స్‌తో కూడి ఉన్నది. ఈ పిజిసిలో ఎన్‌క్లేవ్స్‌గా ఓల్డర్ మెటమార్ఫిక్స్ ఆంఫిబొలైట్స్, హార్న్‌బ్లెండ్- టాల్క్- మైకా శిస్ట్, ఫూక్‌సైట్ కార్ట్జైట్, కాల్క్ సిలికేట్‌రాక్, మార్బల్ మరియు బాండెడ్ ఫెరుజినస్ కార్ట్జైట్.

శిస్ట్ బెల్టుల రూపంలో ధార్వార్ సూపర్‌గ్రూప్‌కు చెందిన శిలలు క్వార్ట్జ్ మైకాశిస్ట్, ఆంపిబొలైట్ శిస్ట్ చాంపియన్‌నిస్ మెటాబసాల్ట్, మెటా డసైట్ మరియు బాండెడ్ ఫెరజినెస్ క్వార్ట్జైట్. ఇవి N-S దిశల్లో లీనియర్‌గా విస్తరించి ఉన్నవి. మరియు పి.జి.సి పైన నాన్‌కన్ఫర్మబుల్‌గా ఉన్నవి. ఆసిడ్ ఇంట్రూసివెస్ గ్రానైట్స్, కార్ట్జ్ వీన్స్ పి.జి.సి.లో చూడగలము. ఇవి పేలియో ప్రొటిరొజొయిక్ పీరియడ్‌కు చెందినవి. ఒక చిన్న సైనైట్ బాడీని పాలంనేర్ వద్ద చూడగలము. బేసిక్ డైక్స్‌ని డొలరైట్స్ రూపంలో చూడగలము. వీటిని మూడు దిశల్లో చూడగలము. E-W, W-S, NW-SE. వీటిలో E-W, దిశల్లో ఉన్న డొలరైట్స్ ఎక్కువగా ఉన్నది. ఇవి ఒక స్వార్మ్‌గా



నేచరల్ ఆర్చ్ (శిలా తోరణం)



ఏపార్కియాన్ అన్ కనఫార్మిటీ

చూడగలము. ఈ జిల్లాలోని దక్షిణ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన కడప బేసిన్ ఉండటం విశేషం. ఇక్కడ శేల్, క్వార్ట్జైట్ బైరంకొండ ఫార్మేశన్‌కు చెందినవి మరియు కుంభం పార్మేశన్‌కు చెందిన శేల్స్ / ఫిలైట్స్, లైమ్‌స్టోన్‌లను చూడగలము. ఈ కడప సూపర్ గ్రూప్‌కు చెందిన శిలలు పి.జి.సి పైన నాన్ కన్ఫర్మబుల్‌గా ఉన్నవి. ఇవి లీనియర్ రిడ్జ్‌స్‌గా కాలహస్తికి దక్షిణంలో మరియు నగరి పట్టణం దగ్గర అవుట్ లైయర్స్‌గా చూడగలము. ఈ అన్‌కన్ఫర్మిటిని ఎప్ఆర్క్యన్ అన్‌కన్ఫర్మిటిగా నిర్ధారించారు. జి.ఎస్.ఐ. దీన్ని నేషనల్ జియోలజికల్ మాన్యుమెంట్‌గా గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం ఇది కాకుండా తిరుమలలో న్యాచురల్ ఆర్చ్ (శిలా తోరణం)ను కూడా కేంద్రం నేషనల్ జియోలాజికల్ మాన్యుమెంట్‌గా గుర్తించారు. ఇవి రెండు నగరి క్వార్ట్జైట్‌లోనే కలవు.

గోండ్‌వానా శిలలు ఈ జిల్లాలోని ఆగ్నేయంలో పి.జి.సిపైన నాన్ కన్ఫర్మబుల్‌గా ఉన్నది. ఈ శిలలు మాటల్డ్ ఫెరుజినస్ క్వార్ట్‌జైట్, కంగ్లామరేట్ ప్లాంట్ ఫాసిల్స్‌తో కూడి యున్నవి, వీటిని సత్యవేడు ఫార్మేశన్‌గా గుర్తించారు. వీటిపైన లాటరైట్ క్యాపింగ్స్‌ను కూడా చూడగలము. నదులకు ఇరువైపులా ఫ్లడ్ ప్లేన్‌లో క్వాటర్‌నెరి సెడిమెంట్స్‌ని చూడగలము.

ఈ జిల్లాలో చాలా వరకు రెడ్ నుండి రెడ్డిశ బ్రౌన్ సాండి సాయిల్ ఉంటుంది. నదుల ఇరువైపులా సాండిలోమీ సాయిల్‌ని చూడగలము. సెడిమెంటరి శిలలపైన మిక్స్‌డ్ రెడ్, బ్లాక్‌సాయిల్స్‌ని చూడగలము. సీస్‌మిక్ మైక్రోజొనేశన్ ప్రకారం ఈ జిల్లాలోని ప్రాంతాన్ని జోన్–2గా నిర్ధారించారు.

**ఖనిజ సంపద:** ఈ జిల్లాలో కమర్షియల్ గ్రానైట్స్‌కు మరియు గ్రానైట్ పాలిశింగ్ పరిశ్రమకు ప్రసిద్ధి చెందినది. ఇది కాకుండా ఈ జిల్లాలో బైరైట్స్, క్లే, కొరండం, గోల్డ్, ఐరన్ ఓర్ మరియు సియలైట్ ఉండటం విశేషం.

**బైరైటీస్ :** బైరైట్ వీన్స్ 1 నుండి 3 సెం.మీ. థిక్‌నెస్‌తో గ్రానైట్ నైసెస్‌లో బైరాగి కంద్రీగ ప్రాంతంలో చూడగలము. బైరైటీస్ పసుపు రంగులో క్వార్ట్జ్ హెమటైట్‌తో కూడి వుంటుంది.

**డైమెన్షన్ స్టోన్స్ :** గ్రానైట్ నైసెస్, మిగ్మాటైట్స్, బైరన్ కొండ క్వార్ట్‌జైట్స్, గొండవాన సాండ్ స్టోన్స్ కమర్షియల్‌గా క్వారీ చేస్తున్నారు. వీటిని కన్‌స్ట్రక్షన్ పరిశ్రమలో ఉపయోగిస్తున్నారు. ఈ జిల్లాలో పాలిశింగ్ పరిశ్రమ కుప్పం వద్ద ఉన్నది. రాష్ట్రంలో ఈ జిల్లాలోనే మొట్టమొదటి కమర్శియల్ గ్రానైట్ క్వారియింగ్ ఆరంభించారు. కొన్ని పాపులర్ వెరైటీస్ కుప్పం గ్రీన్ (గ్రానైట్ నైస్), ఇంగ్లీశటీక్ (మల్టీకలర్డ్ గ్రానైట్), బ్లాక్ గ్రానైట్ (డొలరైట్), మదనపల్లి వైట్ (ల్యుకొగ్రానైట్).

**కొరండం:** కొరండం క్రిస్టల్స్ 1 సెం. నుండి 3 సెం. వరకు ఉంటవి. ఇవి ఎర్ర చెరువుపల్లి, పాలిచెట్టిపల్లి ప్రాంతంలో దొరుకుతుంది. దీన్ని అబ్రేసివగా వాడతారు.

**బంగారం:** వీటి అక్కరెన్సెస్ కుప్పం ప్రాంతంలోని బిసకట్టం సలచింతపల్లి, మలప్పకొండ, చిగరగుంట వద్ద దొరుకును. ఈ నిక్షేపాలు కోలార్ గోల్డ్‌బెల్ట్ యొక్క ఎక్స్‌టెన్షన్స్‌గా నిర్ధారించారు. జి.ఎస్.ఐ. శ్రీకాళహస్తి యొక్క పల్లెచెరువు పరిసరాలలో చిన్న మొత్తం గోల్డ్ అక్కరెన్సెస్ కలవు.

**హెమటైట్ (ఐరన్ ఓర్):** ఐరన్ ఓర్ హెమటైట్ రూపంలో హార్న్‌బ్లెండ్ శిస్ట్ అసోసియేషన్‌లో దొరుకుతుంది. వీటి నిక్షేపాలు సిరసనంబేదు, కోవనూర్, సురమాల వద్ద 6మీ. నుండి 7మీ. థిక్‌నెస్‌గా ఉన్నది.

**ఓఖర్:** ఓఖర్ బ్యాండ్స్ క్రీమ్, బ్రౌన్, పింక్ రంగులలో శేల్స్‌లో కరకంబాడికి పశ్చిమంలో దొరుకును. వీటిని డిస్టెంబర్స్ మరియు పెయింట్స్‌లో ఉపయోగిస్తారు.

**స్టియటైట్ :** చిన్న స్టియటైట్ నిక్షేపాలు ఒకారినరసింగ రాయనపేట, అనుగల్లు, కిరిమంజ, బింద కిందపల్లి మరియు తలుపులపల్లి ప్రాంతాలలో కలవు. వీటిని సిరామిక్ పరిశ్రమలో ఉపయోగిస్తారు.

**టాల్క్ :** టాల్క్ ట్రిమొలైట్ శిస్ట్‌లో దీని నిక్షేపాలు వెల్లంపల్లి ప్రాంతంలో దొరుకతవి.

**క్లేస్ :** కుంభం శేల్స్‌లో కరకంబాడి, తొయిడవేరు వద్ద క్లే పాకెట్స్ రూపంలో దొరుకును.

– కమతం మహేందర్ రెడ్డి, m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com



## సరస్వతి నది గురించి మరిన్ని ఆధారాలు

# రాఖీగఢీ వద్ద భారీ జలాశయం గుర్తింపు

హరియాణాలోని రాఖీగఢీలో గత నెలలో బయటపడిన జలాశయం హరప్పా ఇంజనీరింగ్‌కు సంబంధించిన ఒక అద్భుతం మాత్రమే కాదు, సరస్వతి నదిపై చురుగ్గా సాగుతున్న పరిశోధనలను మరింత ముందుకు కూడా తీసుకువెళుతుంది. ఆ విశేషాలేంటో తెలుసుకుందాం.

రాఖీగఢీలో పురావస్తు శాస్త్రవేత్తల బృందం అక్కడి గ్రామానికి చెందిన కూలీలతో కలిసి కొన్ని వారాల క్రితం 10×10 కందకం నుండి కొన్ని పిడికిళ్ల బురదను బయటకు తీసింది. ఆ బురదను చూస్తుంటే వారి కళ్ళు విప్పారాయి. పురావస్తు శాస్త్రవేత్తలంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. వణుకుతున్న బురద మరకల చేతులతో, వారు శతాబ్దాల నాటి బురదను బయటకు తీశారు. బురదను మాత్రమే కాదు... వేల ఏళ్ల నాటి చరిత్రను కూడా.

హరియాణా లోని రాఖీగఢీ లోని తవ్వకం స్థలంలో హరప్పా కాలం నాటి నీటి నిల్వ వ్యవస్థ ఉందని పురావస్తు శాస్త్రవేత్తలు ఎన్నో ఏళ్లుగా అనుమానిస్తున్నారు. కానీ బురుద బయటపడిన రోజు వారి ఆవిష్కరణ అన్ని అంచనాలను మించిపోయింది. గుజరాత్‌లోని ధోలావీరా వద్ద ఉన్న దాని తర్వాత రెండవ అతిపెద్ద జలాశయం అది. ప్రస్తుతానికి వాళ్లకు ఈ విశేషానికి మించింది మరొకటి ఉండదు.

ఈ జలాశయం ఓ ఇంజనీరింగ్ అద్భుతం. సామాన్య శక పూర్వం 2600 మరియు 1900 మధ్య వర్ధిల్లిన హరప్పా నాగరికత అతిపెద్ద పట్టణ కేంద్రాలలో ఒకటైన రాఖీగఢీ 500 హెక్టార్లలో విస్తరించి ఉంది. ఇది మొహెంజోదారో కంటే దాదాపు రెండు రెట్లు ఎక్కువ. అయినప్పటికీ ఈ స్థాయిలో ఏదీ ఇక్కడ ఇప్పటి వరకూ బయటపడలేదు. 2024 డిసెంబర్ తవ్వకాలు ఒక సంక్లిష్టమైన, అధునాతనమైన నీటి నిర్వహణ వ్యవస్థను బయటపెట్టింది. ఇప్పటివరకు, మొహెంజొదారో, హరప్పాలో బావులను మాత్రమే కనుగొన్నారు.

ఈ సందర్భంగా భారత పురావస్తు సర్వే (ఏఎస్ఐ) జాయింట్ డైరెక్టర్ జనరల్, రాఖీగఢిలో తవ్వకాలకు సారథ్యం వహిస్తున్న సంజయ్ మంజుల్ మాట్లాడుతూ, “రాఖీగఢీలో చాలాసార్లు తవ్వకాలు జరిగాయి. కానీ ఇప్పటివరకు జలాశయం గురించి ఎటువంటి సమాచారం బయటకు రాలేదు” అని అన్నారు. “మొదటిసారిగా, మౌండ్ 3 వద్ద దాదాపు 3.5 నుండి 4 అడుగుల లోతు గల నీటి నిల్వ ప్రాంతం వెల్లడైంది. పరిణతి చెందిన, హరప్పా నాగరికత చివరి కాలంలో నదులు ఎండిపోవడం ప్రారంభమైనప్పుడు, ప్రజలు నీటిని నిల్వ చేయడం ప్రారంభించినప్పుడు నీటి నిర్వహణను అర్థం చేసుకోవడంలో ఈ పరిశోధనలు సహాయపడతాయి” అని ఆయన అన్నారు.

ఈ జలాశయం భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు, పురావస్తు శాస్త్రవేత్తలలో సరస్వతి నదిపై మరింత ఆసక్తిని పెంచింది. చురుగ్గా సాగుతున్న పరిశోధనలను మరింత ముందుకు కూడా తీసుకువెళు తుంది. హరప్పా నాగరికత చివరి కాలంలో, సరస్వతి నదికి ప్రధాన వనరు అయిన దృషద్వతి నది (చౌతాంగ్ నది అని కూడా పిలు





స్త్రారు) సామాన్య శక పూర్వం సుమారు 3000 ప్రాంతంలో ఎండిపోవడం ప్రారంభమైంది. నది సన్నబడటానికి స్పందనగా ఈ జలాశయం ఏర్పడి ఉండవచ్చు. రాఖీగఢీ తవ్వకం జరిగిన ప్రాంతం నుండి కేవలం 400 మీటర్ల దూరంలో ఎండిన దృషద్వతి నుండి పాలియోచానెల్స్ ఉనికిని రిమోట్ సెన్సింగ్ డేటా నిర్ధారిస్తోంది.

గత రెండు దశాబ్దాలుగా, పురావస్తు పరిశోధనలు ఋగ్వేదంలో పేర్కొన్న గొప్ప నది అయిన సరస్వతి నది ఆలోచనను స్థిరంగా ధ్రువీకరిస్తున్నాయి. హిమాలయాల నుండి అరేబియా సముద్రం వరకు ప్రవహించే సరస్వతి నది చివరికి అదృశ్యమై, కేవలం జాడలను మాత్రమే మిగిల్చింది. ఋగ్వేదంలో కూడా సరస్వతి నదికి ముఖ్యమైన ఉపనదిగా దృషద్వతిని పేర్కొన్నారు.

"దృషద్వతి వేద కాలానికి చెందిన నది. రాఖీగఢీ సమీపంలో ఉన్న ఏకైక నీటి వనరు" అని కురుక్షేత్ర విశ్వవిద్యాలయంలోని సరస్వతి నది పరిశోధనా కేంద్రం ప్రొఫెసర్ ఎఆర్ చౌదరి అన్నారు. "ఇది మహాభారత కాలం నాటిది" అని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

2022లో రాఖీగఢీ తవ్వకాలను ప్రారంభించిన మంజుల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "దృషద్వతి ఒకప్పుడు ఈ ప్రాంతానికి జీవనాడి. ఈ పరిశోధనలు, హరప్పా ప్రజలు నీటి నిల్వ కోసం ఉపయోగించిన అధునాతన పద్ధతులను సూచిస్తున్నాయని" ఆయన అన్నారు. గతంలో, ఈ స్థలంలో పురావస్తు శాస్త్రవేత్తలు సూరజ్ భాన్, అమరేంద్ర నాథ్, వసంత్ షిండే అనేకసార్లు తవ్వకాలు నిర్వహించారు. 1924లో పురావస్తు శాస్త్రవేత్త సర్ జాన్ మార్షల్ సింధు లోయ నాగరికతను గుర్తించిన దాదాపు 100 సంవత్సరాల తర్వాత ఈ గొప్ప ఆవిష్కరణ చోటు చేసుకోవడం విశేషం.

"సుమారు 5,000 సంవత్సరాల క్రితం, నది ఎండిపోవడం ప్రారంభించినప్పుడు, ప్రజలు వ్యవసాయంతో సహా వారి వ్యక్తిగత అవసరాలకు నీటిని నిల్వ చేసుకోవలసి వచ్చింది" అని మంజుల్ అన్నారు. "ఈ పరిశోధనలు నీటి నిర్వహణ నమూనా, ఒకప్పుడు సమాజం ఎలా ఆలోచించేది అనే దాని గురించి మనకు ఒక ఆలోచనను ఇస్తాయి" అని ఆయన అన్నారు.

**ఒక అంచనా – ఒక సంచలనాత్మక ఆవిష్కరణ**

అవగాహనతో కూడిన ఊహ హరప్పా కథను కనుగొనటానికి దారితీసింది.

2022 నుండి, సంజయ్ మంజుల్ బృందం రాఖీగఢీ మౌండ్ 3 వద్ద పురాతన మట్టి-ఇటుక నిర్మాణాలను తవ్వడంలో బిజీగా ఉంది. ఇది మౌండ్ 1, 2 ప్రాంతాల మధ్య ఉంది. ఆ తరువాత 2023లో, అదే దిబ్బ అంచున ఉన్న బహిరంగ ప్రాంతాన్ని తవ్వాలనే ఆలోచన అతని మనసులోకి వచ్చింది. ఒకవేళ ఒక పురాతన జలాశయం ఉంటే, అది గుట్టలకు దూరంగా, మానవ నివాసాల నుండి వేరుగా ఉన్న బహిరంగ ప్రదేశంలో ఉండేదని ఆయన అనుకున్నాడు.

మంజుల్ ఊహ నిజమైంది. అతని బృందం 2023లో ఒక సిల్టేషన్ పొరను కనుగొంది. కానీ తన ఊహాను నిజమని చెప్పేందుకు అతనికి మరింత నిర్ధారణ అవసరమైంది.

డిసెంబర్ 2024లో, ఆయన బృందం రిజర్వాయర్ వ్యవస్థ పరిమాణం, పరిధిని అన్వేషించడానికి మరో రెండు కందకాలను తెరిచింది. వాళ్లు ఈ కందకాలలో కూడా బురదను కనుగొన్నారు. ఇది ఆ ప్రదేశంలో ఇతర చోట్ల కనిపించే ఒండ్రు నేల కంటే చాలా భిన్నంగా ఉండడం విశేషం.

కొత్తగా కనుగొన్న అంశాల నేపథ్యంలో హరప్పా జలాశయం గురించి మునుపటి అంచనాలు అకస్మాత్తుగా చిన్నవిగా కనిపించాయి. ఇది మెసొపొటేమియా, ఈజిప్షియన్ నాగరికత ప్రదేశాలలో కనుగొనబడిన మరే ఇతర జలాశయాల కన్నా కూడా పెద్దది. 1969లో పురావస్తు శాస్త్రవేత్త సూరజ్ భాన్ ఆధ్వర్యంలో రాఖీగఢీ లో తవ్వకాలు ప్రారంభమైనప్పటి నుండి సాధించిన అతిపెద్ద పురోగతి ఇది.

"మూడు పొరల సిల్టేషన్ గుర్తించబడింది. అక్కడ నీరు నిలిచి ఉందని చెప్పడానికి బురద పేరుకుపోవడమే నిదర్శనం. కానీ ఇది చౌతాంగ్ నది బురద కాదు, అంటే ఇది నిల్వ ప్రాంతం" అని ఆ తవ్వకాన్ని పర్యవేక్షించిన ఏఎస్ఐ చండీగఢ్ సర్కిల్ అసిస్టెంట్ పురావస్తు శాస్త్రవేత్త పంకజ్ భరద్వాజ్ అన్నారు.

రాఖీగఢీ డ్రైనేజీ వ్యవస్థను ముందే కనుగొన్నప్పటికీ, తరువాతి





దశల్లో హరప్పా వాసులు నీటిని ఎలా నిల్వ చేశారో ఇప్పటి వరకూ ఎవరూ కనుగొనలేదు.

చివరి హరప్పా కాలంలో ఈ జలాశయం వచ్చినప్పటికీ, సరస్వతి-దృషద్వతిపై పారుదల వ్యవస్థ నాగరికత మూడు దశలలో స్పష్టంగా ఉందని ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త కె.ఎన్. దీక్షిత్ 2013లో 'ఆరిజిన్ ఆఫ్ ఎర్లీ హరప్పా కల్చర్స్ ఇన్ ది సరస్వతి వ్యాలీ: రీసెంట్ అర్కియాలాజికల్ ఎవిడెన్స్ అండ్ రేడియోమెట్రిక్ డేట్స్' అనే అధ్యయన పత్రంలో రాశారు.

మెసొపొటేమియా, ఈజిప్షియన్ ప్రదేశాలలో కాలువ వ్యవస్థలు ఎక్కువగా పాలకుల కోసం రూపొందించబడ్డాయి. అక్కడి మాదిరిగా కాకుండా రాఖీగఢీ, ధోలావీరాలోని పెద్దపెద్ద హరప్పా జలాశయాలు సామాన్య ప్రజల కోసం ఉద్దేశించబడ్డాయి. నీటి లభ్యతపై వివాదాలను తగ్గించడానికే ఇలా చేసి ఉంటారని నిపుణులు అంటున్నారు.



“పరిశుభ్రత, బావులు, మురుగు కాలువలు అనే భావన పరిశుభ్రత గురించి కాదు, సంఘర్షణ నివారణ గురించి. కాబట్టి ఇది ప్రజలు ఒకరితో ఒకరు పోట్లాడుకోకుండా ఉండటానికి ఒక వ్యూహం” అని ప్రొఫెసర్ జోనాథన్ మార్క్ కెనోయర్ 2016లో భారతదేశ పర్యటన సందర్భంగా అన్నారు.

రాఖీగఢీ కందకాలలో లభించిన రాగి ఫిష్‌హుక్స్, సముద్రపు గవ్వలు హరప్పా ప్రజల దైనందిన జీవితాలు, వాణిజ్యాన్ని మరింతగా తెలియజేశాయని భరద్వాజ్ అన్నారు.

### చరిత్రను తిరగరాస్తున్న సైట్

గత రెండు దశాబ్దాలుగా, రాఖీగఢీ భారతదేశ పురావస్తు తవ్వకాల్లో ఒక మకుటంగా మారింది. భిర్రానా, ఫర్మానా వంటి సమీప ప్రదేశాల నుండి కనుగొన్న విషయాలు సింధు లోయ నాగరికత మూలాలను కనీసం 2,000 సంవత్సరాలు వెనక్కి నెట్టాయి - గతంలో అంచనా వేసిన సామాన్య శక పూర్వం 4000 నుండి సా.శ.పూ. 6000 వరకు.

ఈ సైట్ సంవత్సరాలుగా ఎంతో చర్చను కూడా రేకెత్తించింది. 4,600 సంవత్సరాల పురాతనమైన ఒక మహిళ అస్థిపంజరంపై నిర్వహించిన జన్యు పరీక్ష 2019లో ఆర్యుల దండయాత్ర సిద్ధాంతం గురించి చర్చలను తిరిగి ప్రారంభించింది. ఆమె అవశేషాలలో “స్టెప్పీ పాస్టోరలిస్టుల నుండి లేదా అనటోలియన్, ఇరానియన్ రైతుల నుండి గుర్తించదగిన పూర్వీకులు” లేరని ఫలితాలు చూపించాయి.

“హరప్పా నాగరికతలోని ఇతర ప్రాంతాలతో పోల్చితే హరియాణా ప్రాంతం ఇప్పటివరకు తొలి రేడియోమెట్రిక్ తేదీలను అందించింది” అని కె.ఎన్. దీక్షిత్ అదే 2013 అధ్యయనపత్రంలో రాశారు.


రాఖీగఢీ రహస్యాలను ఛేదించడాన్ని ఏఎస్ఐ కొనసాగిస్తుండటంతో, ఈ ప్రదేశం వివిధ కార్యకలాపాల కేంద్రంగా మారింది. గతాన్ని ఒకచోట చేర్చేందుకు నెమ్మదిగా, శ్రమతో జరుగుతున్న ప్రక్రియను చూడటానికి ఆసక్తిగల సందర్శకులు వస్తున్నారు.

కానీ ఇంతటి జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రదేశమైన రాఖీగఢీ నిర్లక్ష్యానికి గురవుతోంది. 2020-21 కేంద్ర బడ్జెట్ దీనిని “ఐకానిక్ సైట్”గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆవు పేడ కుప్పలు ఆ ప్రాంతమంతా పేరుకుపోయాయి. కందకాల చుట్టూ వీధికుక్కలు, పందులు, ఆవులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి.

అదే సమయంలో ఈ తవ్వకం స్థానిక విద్యాసంస్థలు, చరిత్ర ఔత్సాహికుల ఆసక్తిని సొంతం చేసుకుంది.

జనవరిలో చలిగా ఉండే ఒక మధ్యాహ్నం, శిక్షణ పొందిన గ్రామస్తులు కందకాలు తవ్వుతుండగా సమీప గ్రామాల విద్యార్థులు ఆసక్తిగా చూశారు. ఇలాంటి దృశ్యాలు అనేకం చోటు చేసుకున్నాయి.

“ఇస్సే క్యా పతా చలేగా, ఇత్నా గెహ్రా ఖోదా హై (ఇంత లోతుగా తవ్వితే మనకు ఏమి తెలుస్తుంది)” అని 10వ తరగతి విద్యార్థిని సృష్టి సిరోహి అడిగాడు.






సమాధానం క్లుప్తంగా ఉంది. "మేం తవ్వుతున్నాం," అని గ్రామస్తులలో ఒకరు అన్నారు.

**అదృశ్యమైన దృషద్వతి నది**

వేల సంవత్సరాల క్రితం, దృషద్వతి నది రాఖీగఢీ మధ్యలో ప్రవహించి, ప్రాచీన హరప్పా నాగరికతకు జీవనాధారంగా పనిచేసింది. దాని జలాలు ఇక్కడి నేల స్వరూప స్వభావాలను మార్చివేశాయి. దాని ఒడ్డున వృద్ధి చెందిన అధునాతన పట్టణ కేంద్రాలను పోషించాయి.

"ఇది ఈ ప్రాంత నీటి నిర్వహణ వ్యవస్థలలో కీలకమైన భాగం. ఇది ఇక్కడి వ్యవసాయం, దైనందిన జీవితానికి మద్దతు ఇచ్చింది" అని 2011 నుండి 2016 వరకు రాఖీగఢీలో తవ్వకాలకు నాయకత్వం వహించిన ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త ప్రొఫెసర్ వసంత్ షిండే అన్నారు.

శతాబ్దాలుగా, దృషద్వతి శూన్యంగా మారిపోయింది. శీతోష్ణస్థితి మార్పులు, భౌగోళిక మార్పుల కారణంగా అది ఎండిపోయి భూమి అడుగున అదృశ్యమైంది, ఒకప్పటి తన గొప్ప ఉనికి ఆనవాళ్లను మాత్రమే మిగిల్చింది.

ఈ నది ఒకప్పుడు కర్నాల్, జింద్, హిసార్ వంటి నేటి జిల్లాల గుండా ప్రవహించి, రాజస్థాన్‌లోని సూరత్‌గఢ్ సమీపంలో సరస్వతి నదిలో కలిసేది. రాఖీగఢీతో పాటు, దాని మైదానాల వెంబడి ఉన్న కీలకమైన హరప్పా ప్రదేశాలలో సోథి, సిస్వాల్, మితాతల్, బాలు, దౌలత్‌పుర్ ఉన్నాయి.

హరప్పా స్థావరాలలో మూడింట రెండు వంతులు సరస్వతి పరీవాహక ప్రాంతంలో ఉన్నాయని షిండే అన్నారు. ఇది సింధు లోయ నాగరికతను సింధు-సరస్వతి నాగరికతగా పేరు మార్చడానికి దారితీసింది. దీనిని పాఠ్యపుస్తకాల్లో కూడా చేర్చారు.

**ఒక 'అద్భుత' జలాశయం**

హరప్పా ప్రజలు నీటిని సద్వినియోగం చేసుకోవడంలో ఎంత ముందుకు సాగారో చూపించే ఒక ప్రదేశం ధోలావీరా. ఇది రాన్ ఆఫ్ కచ్‌లోని పాక్షిక శుష్క ద్వీపంలో ఉంది.

1989-2005 మధ్య పురావస్తు శాస్త్రవేత్త ఆర్.ఎస్. బిష్త్ తవ్వకాలు జరిపిన ఈ యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంలో, జలాశయాల నుండి నగరంలోని వివిధ ప్రాంతాలకు నీటిని మళ్ళించే రాతి కాలువల నెట్‌వర్క్ కూడా ఇక్కడ కనుగొన్న అంశాలలో ఒకటి. పూర్తిగా రాతితో నిర్మించిన ఏకైక హరప్పా ప్రదేశంగా ధోలావీరా కూడా ప్రత్యేకమైనది. ప్రజలు తమ నీటి వ్యవస్థను నిలబెట్టుకోవడానికి మన్సార్, మన్హర్ అనే రెండు కాలానుగుణ నదులపై ఆధారపడ్డారు.

హరప్పా జల నిర్వహణకు ధోలావీరా అత్యుత్తమ నిదర్శనం అని నిపుణులు పేర్కొంటున్నారు. జలాశయాలు వివిధ ఆకారాలు, పరిమాణాలలో వచ్చాయి - కొన్ని దీర్ఘచతురస్రాకార లేదా వృత్తాకార డిజైన్లలో నిర్మించబడ్డాయి. బహిరంగ జలాశయాలు కూడా ఉన్నాయి.

ఆకస్మిక వరదలను మళ్లించడం ద్వారా, నివాస స్థలం లోపల ట్యాంకులు నిర్మించడం ద్వారా నీటిని నిల్వ చేశారని వసంత్ షిండే అన్నారు. అప్పట్లో నగరం వెలుపలికి మురికి నీటిని ఒక కాలువ ద్వారా విడుదల చేసేవారు.

"ఇటువంటి వ్యవస్థను మెసొపొటేమియా లేదా ఈజిప్టులో కనుగొనలేదు" అని షిండే అన్నారు. "ఇది అసమానమైనది" అంటూ ఆయన అభివర్ణించారు.

ఇలా తవ్వకాలు జరుగుతున్న సమయంలోనే వర్షంతో నిండిపోయిన రాఖీగఢీలో, డిసెంబర్‌లో ఒక చిన్న విచారకర సంఘటన చోటు చేసుకుంది. కందకం నీటితో నిండిపోయింది. ఒక భాగం కుంగిపోయింది.

"మేం ఇక్కడ చాలా నెలలుగా కష్టతరమైన తవ్వకం పనిని చేస్తూ చాలా కష్టపడి పనిచేస్తున్నాం" అని భరద్వాజ్ గుర్తు చేసుకున్నారు. "జరిగిన సంఘటనతో మేం కన్నీళ్లు పెట్టుకున్నాం" అని ఆయన అన్నారు.

\- కిషన్ మురారి

(ది ప్రింట్ సౌజన్యంతో)

అనువాదం : ఎన్. వంశీ

# నకాశి కళకు వన్నె తెచ్చిన
# చేర్యాల్ స్క్రోల్ పెయింటింగ్



చేర్యాల్ స్క్రోల్ పెయింటింగ్ అనేది నకాశి ఆర్ట్‌కు స్థానిక ప్రత్యేక శైలిని జోడించిన హస్తకళ. తెలంగాణకు మాత్రమే పరిమితమైన అద్భుతకళారూపాలను ఇందులో చూడవచ్చు. ఈ శైలి తెలంగాణలో మాత్రమే కానవస్తుంది. వీటినే పటం బొమ్మలుగా వ్యవహరిస్తుంటారు. ఫిల్మ్ రోల్, కామిక్ స్ట్రిప్ తరహాలో ఈ పటాలు పురాణగాథలను, ఇతిహాసాలను వివరిస్తుంటాయి. సాధారణంగా జానపద పురాణాల, చిన్న చిన్న కథలకు దృశ్యరూపం వీటిలో ఉంటుంది. ఒకప్పుడు ఈ కళ దేశం లోని వివిధ ప్రాంతాల్లో కూడా ప్రాచుర్యంలో ఉండింది. ఎక్కడికక్కడ ఈ కళ ప్రాంతీయ విశిష్టతలను పొంది ఒక్కో చోట ఒక్కో శైలిగా పేరొందింది. స్థానిక సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఈ కళను ప్రభావితం చేస్తూ వచ్చాయి. అదే విధంగా చేర్యాల్ పటం చిత్రాలు తెలంగాణలో బాగా పేరొందాయి. టీవీలు, సినిమాలు, కంప్యూటర్ల రాకతో వివిధ ప్రాంతాల్లో ఈ కళ సన్నగిల్లుతూ వచ్చి చివరకు చేర్యాల్ గ్రామాన్ని చివరిస్థానంగా చేసుకొని స్థిరపడింది.

పటం బొమ్మలకు సుసంపన్న చరిత్ర ఉంది. ఆసియా కళాత్మక సంప్రదాయాల్లో ఇవి ముఖ్యపాత్రను పోషించాయి. చైనాలో స్క్రోల్ పెయింటింగ్స్ అనేవి రాచరికపు ఆచార వ్యవహారాల్లో భాగంగా ఉండేవి. భారతదేశంలో మాత్రం ఈ కళ గ్రామీణుల జీవితాలకే పరిమితమై జానపదకళగా వెలుగొందింది.



భారతదేశంలో ప్రతి ప్రాంతం, గ్రామం కూడా తనదైన శైలిలో పటం బొమ్మల సంప్రదాయాన్ని వృద్ధి చేసు కుంది. స్థానిక విశ్వాసాలు, ఆదరణ, సామాజిక-ఆర్థిక పరిస్థితులపై ఆధారపడి విషయం, రూపం, సాంకేతికతలలో తమదైన ముద్రను కలిగి ఉంటాయి.

రాజస్థాన్‌లో ఈ కళ ద్వారా పభుజీకి పాద్, దేవ్‌నారాయన కథ, ధోలా, మరు లాంటి కథలు ప్రచారం చేస్తారు. గోవాలో దశావతారం ప్రఖ్యాతి గాంచింది. మహారాష్ట్రలో పింగులి, చిత్రకథా సంప్రదాయాలు పేరొందాయి. మహారాష్ట్ర, గుజరాత్ అధునాతన స్క్రోల్ పెయింటింగ్ సంప్రదాయం 'ప్రశస్తి పత్ర'కు ప్రఖ్యాతి చెందాయి. ఒడిషా, బెంగాల్‌లు పట చిత్ర సంప్రదాయానికి పేరొందాయి.

### తెలంగాణలో...

నకాశిపెయింటింగ్స్, చేర్యాల స్క్రోల్ పెయింటింగ్స్, పట చిత్రాలు.. పేర్లు వేరైనా కళ ఒక్కటే. ఈ ఆర్ట్‌కు వందల ఏళ్ల చరిత్ర ఉంది. పటం చిత్రాలను గీసే కళాకారులు నకాశిలు. ఒకప్పుడు వీరు ఎక్కువగా కరీంనగర్‌లో ఉండేవారు. ఇప్పుడు వేములవాడ తదితర ప్రాంతాల్లో ఉన్నారు. దేవాలయాలలో విగ్రహాలు, హంస వాహనం, గరుడవాహనం, సింహవాహనం, చెక్క రథాలు లాంటివి తయారు చేయడంలో వీరు నిష్ణాతులు. వీటిని ఎత్త పొనికి కర్రతో చేసేవారు. పండుగల సమయంలో ఉత్సవ విగ్రహాలకు, రథాలకు రంగులు వేసేవారు. గ్రామ దేవతలు ఎల్లమ్మ, మైసమ్మ, మహంకాళమ్మ, దుర్గమ్మల విగ్రహాలను తయారు చేసేవారు.

తెలంగాణలో నకాశి వారసత్వం వందల ఏళ్ళుగా కొనసాగుతున్నది. ఆ కళాకారుల కుంచె పురాణాల కథలను బొమ్మల రూపంలో చెబుతున్నది. చరిత్రను చిత్రరూపంలో చిత్రిస్తున్నది. సాంస్కృతిక సంపదను భావితరాల వారికి వారసత్వంగా అందిస్తున్నది. సంప్రదాయం, పురాణం, విశ్వాసాలు, ఊహల సమ్మేళనంగా ఆ చిత్రం రూపుదిద్దు కుంటుంది. అదే నకాశి. పటం చిత్రకారులుగా పేరొందిన నకాశీలు తెలంగాణకు ప్రత్యేకతను సంతరింపచేశారు. కొన్ని దశాబ్దాలుగా ఇతర అనేక హస్తకళలకు పట్టిన దుర్గతే దీనికీ పట్టింది. ఆ కళకు ఆదరణ తగ్గి చేతిలో పనిలేకపోవడంతో ఆ కళాకారులంతా వేరే వృత్తుల్లోకి వెళ్ళిపోయారు. మిగిలిన ఒకటి అరా కుటుంబాల వారు పల్లెలను విడిచి నగరాలకు వలస వెళ్ళారు. వారు తమకళకు ఆధునిక టెక్నాలజీ, మార్కెటింగ్ ఎత్తుగడలను జోడిస్తున్నారు. తద్వారా

ఈ కళను సజీవంగా ఉంచడంతో పాటు ఎంతో కొంత ఆదాయాన్ని కూడా పొందుతున్నారు.

## నకాశి పటాలు కుల పురాణాలకు కీలకం

వివిధ కులాల ఆవిర్భావం, గొప్పదనాన్ని వివరించే కులపురాణాలను ఆయా కులాల ఆశ్రిత కులాల వారు చెబుతారు. అలా చెప్పడం ద్వారా వచ్చే కొద్దిపాటి ఆదాయంతో తమ బతుకులు గడుపు తుం టారు. ఆవిధంగా ఆ కుల పురాణాలను పటాలపై దృశ్యీకరించి ఇచ్చేవారు నకాశిలు. పద్మశాలీలకు భక్త మార్కండేయ కథను చెప్పే కూనపులివారికి, గౌండ్లకు కంఠమ మహేశ్వర పురాణం చెప్పే ఏనుటివారికి, చాకలివారికి దక్షపురాణం, చాకలి పురాణం వివరించే పటపోళ్లకు, మాది గలకు జాంబవ, ఆది పురాణాలు చెప్పే డక్కలివారికి, మాలలకు గుర్రం మల్లయ్య కథను చెప్పే గుర్రపోళ్లకు, మంగళి కులానికి రామాయణం చెప్పే అద్దపోళ్లకు, ముదిరాజ్‌లకు మహా భారతం చెప్పే కాకి, గొల్ల కురుమలకు కాటమరాజు కథలను చెప్పే మందహెచ్చులకు వీరిచ్చిన చిత్రపటాలే ఆధారం. అయితే ఒక్కసారి గీసిచ్చిన బొమ్మలు రెండు, మూడు వందల సంవత్సరాలపాటు పాడవ్వకుండా ఉంటాయి. తరతరాలుగా ఈ పటాలను వారసత్వంగా అందిపుచ్చుకునే కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. అదీ నకాశి చిత్రకళ విశిష్టతగా చెప్పవచ్చు.



## చేర్యాల పెయింటింగ్స్‌గా మారిన వైనం

ఇలా ఒక్కసారి చేసి ఇచ్చిన పటాలు వందల ఏళ్లపాటు ఉండటం, ఆ ఒక్క చిత్రపటంపైనే పదుల కుటుంబాలు ఆధారపడటం వల్ల... చిత్రపటాల కొనుగోలు అంతంత మాత్రమే. దీనికితోడు ఆధునికత నకాశి కళపై ప్రభావం చూపింది. ఫొటోస్ వచ్చాయి. సిమెంట్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వర్క్, ఎనామిల్ కలర్స్ వాడకం పెరిగింది. దీంతో రానురాను నకాశి పని తగ్గిపోయింది. వివిధ ఆశ్రిత కులాల కళాకారులు కూడా ఆ వృత్తిలో నుంచి బయటకు వస్తున్నారు. దీంతో నకాశీ కళాకారులు బతుకు దెరువు నిచ్చే ఇతర పనులను ఆ శ్రయించారు. 1942లో ఒకరిద్దరు కళాకారులు వరంగల్ జిల్లా చేర్యాలకు వలస వచ్చి తమ కుటుంబసభ్యులకు నకాషి నేర్పించారు. ఆ విధంగా కొన్నేళ్ళ తరువాత నకాశి పటచిత్రాలు కాస్తా చేర్యాల పెయింటింగ్స్‌గా మారి పోయాయి.



1978లో ప్రభుత్వం వీరిని గుర్తించింది. ఆ గుర్తింపే వీరి జీవితాలను మలుపు తిప్పింది. లేపాక్షితో అనుబంధంతో కొంత మార్పు వచ్చింది. ప్రాచీనతకు ఆధునికతను జోడించడం మొదలుపెట్టారు. రామాయణ, మహాభారతాలను చిత్రీకరించి ఇవ్వడం, ఫొటో ఫ్రేమ్స్‌ను తయారు చేయడం, విగ్రహాలను తయారు చేసే పద్ధతిలోనే మాస్క్‌లను తయారు చేయడం మొదలుపెట్టారు. దేశవ్యాప్తంగా జరిగే ఎగ్జిబిషన్స్‌లో పాల్గొంటున్నారు. అయినప్పటికీ 500 ఏళ్ల చరిత్ర ఉన్న కళకు రావాల్సినంత ప్రచారం రాలేదు. ఇప్పుడిప్పుడే పరిస్థితి కాస్తంత మెరుగు పడుతోంది.

## సహజమైన రంగులు

నకాశి కళలో సహజసిద్ధ రంగులకే పెద్దపీట. మొదట ఖాదీ కాన్వాస్‌ను పెయింటింగ్‌కోసం సిద్ధం చేసుకుంటారు. సహజంగా తయారు చేసిన రంగులను ఉపయోగించి పెయింటింగ్స్ వేస్తారు. రంగురాళ్లను కొనుగోలు చేసి... వాటిని నూరుకొని రంగులు తయారు చేసుకుంటారు. తిరుమని చెట్లనుంచి తీసిన బంకను నూరి నీళ్లు కలిపి సిద్ధం చేసుకుంటారు. ఈ రెంటిని కొంచెం కొంచెంగా కలిపి రంగులద్దుతారు. ఒక్కో పెయింటింగ్ కొన్ని నెలలు కూడా పట్టవచ్చు. ఇక మాస్క్‌లు, విగ్రహాల తయారీ పెద్ద తతంగమే. ఒక్క మాస్క్ తయారీకి వారం రోజుల సమయం పడుతుంది. ముందుగా బుర్కపెడ్డల మట్టి, కోడిగుడ్డు సొన, బంక కలిపి బొమ్మను తయారు చేస్తారు. ఇది ఆరడానికి రెండు రోజులు పడుతుంది. దానికి చింత అంబలితో బట్టను అతికిస్తారు. అతికించిన బట్టపై రెండుమార్లు సున్నం నీటిని అద్దుతారు. ఆ తరువాత వాటర్ కలర్స్ వేస్తారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయితే గానీ ఆకట్టుకునే కళాఖండాలు తయారుకావు.

## కాలంతోపాటు మారుతూ...

ఇప్పుడు కృష్ణలీల, రామాయణ, మహాభారతాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. కృష్ణుడి పటాలను ఇళ్లలో ఇంటీరియర్ డెకరేషన్ కోసం వాడుతున్నారు. నగరాల్లో పెరుగుతున్న ఇప్పటి తరానికి గ్రామీణ వాతావరణం గురించి తెలుసుకోవాలన్న తపన మొదలైంది. తమ మూలాల గురించి అన్వేషణ ప్రారంభమైంది. అందుకే కులవృత్తులు, వ్యవసాయం, గ్రామీణ వాతావరణం, గంగి రెద్దులు, హరిదాసులు, బతుకమ్మ, బోనాలు, ముగ్గులు వంటి చిత్రపటాలకు డిమాండ్ ఎక్కువ ఉంటోంది. ఆయా సంస్థల ఆవరణలలో హ్యాంగ్ చేయడానికి, హోటల్స్‌లో ఇంటీరియర్ డిజైనింగ్ కోసం కూడా ఈ పెయింటింగ్స్‌ను వాడుతున్నారు. కళ మీద ఉన్న మక్కువతో ఇంట్లో మార్బుల్స్‌పైనా ఈ పెయింటింగ్‌ను వేయిస్తున్నారు. వాటర్‌ప్రూఫ్ కోసం వార్నిష్ కోటింగ్ ఇస్తారు.

ఆధునికత మోజులో పడి పురాతన కళారూపాలను మర్చిపోతున్న తరుణంలో ఏదోవిధంగా వాటికి జీవం పోస్తున్న వారికి యావత్ తెలంగాణ సమాజం రుణపడి ఉంటుంది. అలాంటి వారి చరిత్రలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

–సువేగా,
m : 9030 6262 88
e: edit.deccan@gmail.com

# భారత దేశ అభివృద్ధిలో రేడియో పాత్ర

## ఫిబ్రవరి 13న రేడియో దినోత్సవం

*1946 ఫిబ్రవరి 13న ఐక్యరాజ్యసమితి రేడియో ప్రారంభించబడింది. కాబట్టి ఆ సందర్భంగా ప్రతిఏటా ఫిబ్రవరి 13న ఈ దినోత్సవం జరుపుకునేలా జనరల్ కాన్ఫరెన్స్ 36వ సెషన్‌లో ప్రపంచ రేడియో దినోత్సవాన్ని ప్రకటించాలని బోర్డు యునెస్కోకు సిఫారసు చేసింది. ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు, ఐక్యరాజ్యసమితి సంస్థలు, అంతర్జాతీయ ప్రాంతీయ సంస్థలు, వృత్తి సంఘాలు, ప్రసార సంఘాలు, ప్రభుత్వేతర సంస్థలు మొదలైనవన్ని ప్రపంచ రేడియో దినోత్సవాన్ని జరుపుకోవాలని బోర్డు ఆహ్వానించింది. ప్రపంచ రేడియో దినోత్సవాన్ని జనరల్ అసెంబ్లీలో ఆమోదించడానికి, ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవం జరుపుకునే విధంగా యునెస్కో డైరెక్టర్ జనరల్ ఈ తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ దృష్టికి తీసుకురావాలని బోర్డు అభ్యర్థించింది. ఈ అభ్యర్థనను యునెస్కో జనరల్ కాన్ఫరెన్స్ పరిగణించి, 36 సి/63 ఫైల్‌లో ఉన్న తీర్మానాన్ని ఆమోదించింది. ప్రపంచ రేడియో దినోత్సవాన్ని 2011 నవంబరులో యునెస్కోలోని అన్ని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ప్రకటించాయి.*



ఒకప్పుడు రేడియో సగటు మనిషి జీవితంలో అంతర్భాగం.. కలత చెందిన మనసుకు అదే ఓదార్పు. సంతోష సమయంలో అదే తోడు! సమాచారానికి అదే చేదోడు! కబుర్లు చెప్పే నెచ్చెలి అదే! ఇప్పటి తరానికి రేడియోతో అంత గొప్ప అనుభవాలు ఉండకపోవచ్చు కానీ, అప్పట్లో రేడియోనే సమస్తం! పొద్దున్నే సిగ్నేచర్ ట్యూన్ సుప్రభాతం అయ్యేది.. మధ్యాహ్నం కార్మికుల కార్యక్రమంతో పొద్దుపుచ్చేది! సాయంత్రం జనరంజకంగా పలకరించేది.. రాత్రి మనసును ఆహ్లాదపరచి నిద్రపుచ్చేది.. రేడియోతో ఉన్న సౌలభ్యమేమిటంటే అది మన రోజువారి పనులను చెడగొట్టేది కాదు.. పాటలో, కబుర్లో వింటూనే పనులు చేసుకునేవారు! అందుకే రేడియో అంత పాపులరయ్యింది. ఇవాళ్టికీ రేడియోనే వినోదసాధనం! ప్రపంచ జనాభాలో 70 శాతానికి పైగా ప్రజలు రేడియోను వినియోగిస్తున్నారంటే నమ్మి తీరాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంబంధించి 75 శాతం మందికి పైగా గృహిణులు వివిధ అంశాల సమాచారం కోసం రేడియోపై ఆధార పడుతున్నారన్నది పచ్చి నిజం! రేడియో ఎవర్‌గ్రీన్! ఈనాటికి ప్రధాని మోదీ మన్ కీ బాత్ పేరిట దేశ ప్రజలతో తన మనసులో మాటలను, అభిప్రాయాలను షేర్ చేసుకుంటున్నారంటేనే రేడియో ఎంత గొప్ప మాధ్యమమో తెలిసిపోతున్నది.

దేశాభివృద్ధిలో ప్రభుత్వాధీంలో ఉన్న రేడియో, అన్ని రంగాలలోను సమాచారాన్ని ఇస్తూ దేశ సమగ్రతకూ, అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతోంది.

### వ్యవసాయ అభివృద్ధిలో

1966 ప్రాంతాలలో వ్యవసాయ విషయాలను రైతులకు చెప్పటానికి పంటసీమలు కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ఈ కార్యక్రమం రూపొందించటంలో ఆ తరువాత నిర్వహించటంలో

ఆకాశవాణి విజయవాడ కేంద్రం కృషి ఎంతగానో ఉంది. పంటలగురించి, కొత్తరకాల వంగడాలు, సస్యరక్షణ, వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు చక్కగా వివరించే కార్యక్రమాలు ప్రసారం చేసి, ఆయా కార్యక్రమాల ద్వారా వ్యవసాయదారులకు ఎంతగానో ఉపయోగపడే సమాచారాన్ని అందించేవారు. రైతులకు వారి భాషలో, అయా ప్రాంతాల యాసలలో, ఒక్కొక్క సారి అనుభవజ్ఞులైన రైతులతో సంభాషణలు పొందుపరచి కార్యక్రమాన్ని



రక్తి కట్టించేవారు. ప్రభుత్వ వ్యవసాయ విభాగాలు, రైతులకు తెలియ చెప్పవలసిన విషయాలను ఈ కార్యక్రమం ద్వారా అందచేసేవారు. పంటల గురించే కాక, పశు సంరక్షణ, పాడి పశువులను సాకటం గురించి కూడా చక్కగా విశదపరచేవారు.

## సంఘం రేడియో

దళిత మహిళలు ప్రారంభించిన సంఘం రేడియో ఆసియాలోనే తొలి మహిళా రేడియో, భారత్‌లోనే తొలి గ్రామీణ సామాజిక (కమ్యూనిటీ) రేడియో (Community Radio). జహీరాబాద్‌కు ఐదారు మైళ్ల దూరంలోని మాచునూరు గ్రామంలో ప్రాణం పోసుకుంది. ఇది జనం కోసం, జనమే నడిపే, జనం రేడియో.

ఈ 'రేడియో' కార్యక్రమాలు ప్రతిరోజూ రాత్రి ఎనిమిది గంటల నుంచి తొమ్మిదిన్నర దాకా, గంటన్నర సేపు ప్రసారమవుతాయి. జహీరాబాద్ చుట్టుపక్కల పాతిక కిలోమీటర్ల పరిధిలోని నూట యాభై పల్లెల్లో వినొచ్చు. పస్తాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీ.డీ.ఎస్.) అనే స్వచ్ఛంద సంస్థ వాళ్ల తరఫున ముందుండి పోరాడింది.

సంఘం మనుషులు ఏ చెట్టు కిందో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న పెద్దల ముందు మైకుపెడతారు. వాళ్ల అనుభవ సారమంతా టేపుల్లో నిక్షిప్తం అవుతుంది. వారి జీవితానుభవాలను పిల్లలు తెలుసుకొనడానికి ఇదొక మంచి అవకాశం. కొంత మంది కథలు చెప్పవచ్చును, సంగీత కచేరీ కూడా చేయవచ్చును.

## దక్కన్ రేడియో (నిజాం రేడియో 1932)

దక్కన్ రేడియో అనేది హైదరాబాద్ స్టేట్ యొక్క మొదటి రేడియో స్టేషన్. ఇది 1935 ఫిబ్రవరి 3న ప్రత్యక్ష ప్రసారం చేయబడింది. ప్రారంభంలో ఇది 200 వాట్ల ప్రసార శక్తితో ప్రైవేట్ ప్రసార స్టేషన్‌గా ప్రారంభించబడింది. కార్యక్రమాలు ఉర్దూలో ప్రసారం చేయబడ్డాయి. ఇది హైదరాబాద్ నగరంలోని అబిడ్స్, చిరాగ్ అలీ లేన్ వద్ద ఉంది.

మీర్ ఉస్మాన్ అలీ ఖాన్, అసఫ్ జా VII దక్కన్ రేడియోను స్వాధీనం చేసుకుని 1935 ఫిబ్రవరి 3న జాతీయం చేశారు. ఖైరతాబాద్‌లో కొత్త రేడియో స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇంగ్లండ్‌లోని మార్కోని కంపెనీ నుండి కొనుగోలు చేసిన 730 kHzతో 500 వాట్ల కొత్త ట్రాన్స్‌మిటర్‌ని ఏర్పాటు చేశారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో తాజా వార్తా కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేయడానికి సరూర్‌నగర్‌లో ప్రత్యేక ప్రసార స్టూడియోను ఏర్పాటు చేశారు. అదే సంవత్సరం ఔరంగాబాద్ (అప్పటి నిజాంల డొమైన్)లో కొత్త రేడియో స్టేషన్ ప్రారంభించబడింది. ఇక్కడ మునుపటి 200 వాట్ల ట్రాన్స్‌మిటర్ హైదరాబాద్ నుండి మార్చబడింది. జనాభాలో ఎక్కువ మంది మరాఠీ మాట్లాడతారు. కాబట్టి ఉర్దూ, మరాఠీలలో కార్యక్రమాలను ప్రసారం చేయడానికి ఇది జిల్లా స్థాయి రేడియో స్టేషన్. 1948 డిసెంబరు 1న, మీడియం వేవ్ స్టేషన్‌తో అప్‌గ్రేడ్ చేయబడిన 800-వాట్ షార్ట్‌వేవ్ ట్రాన్స్‌మిటర్ వ్యవస్థాపించబడింది. 3335, 6210 kHzలలో నిర్వహించబడింది. నిజాంలు ఈ కొత్త యూనిట్‌ను ప్రారంభించారు. ఈ స్టేషన్ వరల్డ్ రేడియో హ్యాండ్‌బుక్ యొక్క వరుస సంచికలలో జాబితా చేయబడింది. బ్రిటీష్ కంటోన్మెంట్ ఆఫ్ సికింద్రాబాద్ 1919 ప్రారంభంలో హైదరాబాద్ స్టేట్‌లో ప్రారంభ కమ్యూనికేషన్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. 1924లో అదే ప్రాంతం నుండి స్పార్క్ స్టేషన్ నిర్వహించబడింది. ఆ సంవత్సరం ఆస్ట్రేలియన్ రేడియో మ్యాగజైన్ దీనికి VWT స్టేషన్‌గా పేరు పెట్టింది.

ఇది హైదరాబాద్ నిజాంల అధికారిక ప్రసారకర్తగా పనిచేస్తుంది. 1950 ఏప్రిల్ 1న దక్కన్ రేడియోను భారత ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 1956లో ఇది ఆల్ ఇండియా రేడియో (AIR)లో విలీనం చేయబడింది. అప్పటి నుండి దీనిని AIR-హైదరాబాద్ అని పిలుస్తున్నారు.

- ఎసికె. శ్రీహరి
m : 9849930145
e : ackvs08@gmail.com

# దక్కన్‌ల్యాండ్ రచయిత పుట్టా ఓబులేసుకు

# ఉత్తమ రచయిత అవార్డు!!



యువ రచయిత పుట్టా ఓబులేసును ప్రశంసా పత్రంతో సత్కరిస్తున్న కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



పుట్టా ఓబులేసును అభినందిస్తున్న కడప జిల్లా విద్యాశాఖాదికారి డా॥ షంషుద్దీన్

దక్కన్‌ల్యాండ్ మాసపత్రికలో ప్రతినెలా సైన్స్ అండ్ టెక్నాలజీపై చక్కటి వ్యాసాలు రాస్తున్న యువ రచయిత పుట్టా ఓబులేసు కృషికి తగిన గుర్తింపు లభించింది. సైన్స్ & టెక్నాలజీ సబ్జెక్ట్‌లో ఎంతో విలువైన, నాణ్యత కలిగిన వ్యాసాలు రాస్తూ యువతను, సమాజాన్ని చైతన్యపరుస్తున్నందుకు గానూ ఓబులేసును ఉత్తమ రచయితగా గుర్తిస్తూ, ఆయన సేవలను ప్రశంసిస్తూ, గణతంత్ర దినోత్సవం సందర్భంగా కడప పెరేడ్ గ్రౌండ్స్‌లో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రశంసా పత్రంతో పుట్టా ఓబులేసును సత్కరించారు.

పుట్టా ఓబులేసు కడప జిల్లా జమ్మలమడుగు చెందినవారు. అదే జిల్లా, సింహాద్రిపురం మండలం, రావులకొలను గ్రామ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు బోధిస్తూనే, విభిన్న సామాజిక అంశాలను స్పృశిస్తూ ఎన్నో వ్యాసాలను రాశారు. గత 15 సం॥రాలుగా రచనా రంగంలో కొనసాగుతున్న ఆయన, ప్రస్తుతం ప్రత్యేకంగా సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంపైనే దక్కన్ ల్యాండ్ మాస పత్రికలో వ్యాసాలు రాస్తున్నారు. ఆ వ్యాసాలు చక్కటి విషయ పరిజ్ఞానంతో గ్రూప్స్, సివిల్స్ అభ్యర్థులకు బహుళ ప్రయోజనకరంగా ఉంటున్నాయి. అక్టోబర్‌లో జరిగిన తెలంగాణ గ్రూప్-1 పరీక్షల్లో సైన్స్ & టెక్నాలజీ విభాగంలో 100 మార్కులకు పైగా ప్రశ్నలు పుట్టా ఓబులేసు వ్యాసాలనుండే వచ్చాయని పలువురు అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అంశంపై దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక గత డిసెంబర్ 2024 సంచికలో ప్రత్యేక కథనాన్ని ప్రచురించడం పాఠకులకు విదితమే.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తూనే, వారు భావి రచయితలుగా ఎదిగేందుకు ఓబులేసు తోడ్పాటునందిస్తున్నారు. పదవ తరగతి ఫలితాలలో వారి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. పలు పుస్తకాలను ప్రచురించారు. తన ప్రతిభకు గుర్తింపుగా గతంలో ఆయన విభిన్న సంస్థల నుండి పలు అవార్డులు పొందారు.

ఉత్తమ రచయితగా గుర్తించి కడప జిల్లా కలెక్టర్ తనకు అవార్డు ఇవ్వడం తనలో నూతనోత్తేజాన్ని కలిగించిందని, తాను రెట్టించిన ఉత్సాహంతో మరిన్ని విలువైన వ్యాసాలు రాసేందుకు ఈ అవార్డు తోడ్పడుతుందని, అదేవిధంగా **దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక ఎడిటర్ మణికొండ వేదకుమార్ మట్టిలో మాణిక్యం లాంటి తనను గుర్తించి** ఎంతగానో ప్రోత్సహించారని, ఫలితంగానే తనకు ఈ అవార్డు వచ్చిందని, ఈ సందర్భంగా వేదకుమార్ సర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాని రచయిత ఓబులేసు అన్నారు.

కలెక్టర్ చేత అవార్డు తీసుకున్న సందర్భంగా పుట్టా ఓబులేసును కడప జిల్లా విద్యాశాఖాధికారి డా॥ షంషుద్దీన్ ప్రత్యేకంగా అభినందిచారు. రావులకొలను ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు యువరచయిత పుట్టా ఓబులేసును అభినందించారు.

– కె. సచిన్, m : 97010 01036
e : desk.deccan@gmail.com

# ఆదివాసీల ఐక్యతారాగం నాగోబా జాతర

ఆదివాసీల ఐక్యతారాగం... శిశిర రుతువులో విరిసే వసంతగానం... నాగోబా జాతర. ఇంద్రవెల్లి కానలో గోండు తెగకు చెందిన మెస్రం వంశీయులు మీసం మెలేస్తే... తెలంగాణమంతా పరవశించే ఘట్టం ఇది. తరతరాల ఆచారాలకు కాపుకాస్తూ... తాము నమ్మిన నాగరాజుకు కొమ్ముకాస్తూ... ఘనంగా జరిగే జనజాతరకు కేస్లాపూర్ స్వాగతం పలుకుతున్నది. జనవరి 28న మొదలైన నాగోబా జాతర ఐదు రోజులపాటు ఆదివాసీల జీవన వైచిత్రికి, నమ్మకాలకు అద్దం పడుతుంది.



ఆదివాసీల తెగువకు 'సమ్మక్క-సారలమ్మ' జాతర ప్రతీక అయితే.. 'నాగోబా జాతర' వారి ఆచారాలకు ఆలంబనగా నిలుస్తుంది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ వేదికగా జరిగే ఈ ఆదివాసీ సంబురం తెలంగాణలో రెండో అతిపెద్ద జాతరగా పేరొందింది. ఏటా పుష్యమాసంలో నెలవంక తొంగి చూడటంతోనే.. నాగోబా జాతరకు సన్నాహాలు మొదలవుతాయి. నెలవంక కనిపించిన రెండో రోజు మెస్రం వంశీయులు నాగోబాకు తొలిపూజలు చేస్తారు. తర్వాత ప్రత్యేకంగా తయారుచేసిన ప్రచార రథంలో వారం రోజులు గ్రామాల్లో తిరుగుతూ.. జాతరకు హాజరు కావాల్సిందిగా మెస్రం వంశీయులను ఆహ్వానిస్తారు.

జాతరకు పక్షం రోజుల ముందు ఈ మహత్తర క్రతువుకు శ్రీకారం చుడతారు. తమ దైవం నాగోబాకు అభిషేకానికి గానూ గంగాజలం తీసుకురావడానికి మెస్రం వంశీయులు ప్రయాణం అవుతారు. కేస్లాపూర్ నుంచి జన్నారం మండలం కలమడుగు వరకు దాదాపు వంద కిలోమీటర్లు కాలినడకన బయల్దేరి వెళ్తారు. అడవి దారిలో చెప్పుల్లేకుండా నడక సాగిస్తారు. అక్కడి హస్తలమడుగు దగ్గర పంచలింగాలకు పూజ చేసి 151 కలశాలతో గోదావరి జలాలను తీసుకొని కాలినడకన తిరుగు ప్రయాణం అవుతారు.

**పెద్దలను మెప్పించి:** గంగమ్మ జలాలతో అందరూ ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. కేస్లాపూర్ నాగోబా ఆలయ సమీపంలో ఉన్న మర్రిచెట్ల వద్ద ఓ మోదుగు చెట్టుపై గంగాజలంతో ఉన్న ఝరిని ఐదురోజులు భద్రపరుస్తారు. పుష్య అమావాస్యకు ముందురోజు మెస్రం వంశీయులు ఒకే చోట తూం (పితృ కర్మ) పూజలు చేస్తారు. అమావాస్య నాడు సాయంత్రం సంప్రదాయ బద్ధంగా ఎడ్లబండ్లతో ఆలయ సమీపంలోని గోవాడ్‌కు చేరుకుంటారు. రాత్రి నాగోబా ఆలయాన్ని పవిత్ర గంగాజలంతో శుద్ధి చేస్తారు.

**22 పొయ్యిలు:** నాగోబా దేవతకు గోండు తెగకు చెందిన మెస్రం వంశీయులే అర్చకులుగా వ్యవహరిస్తారు. వీరిలో 22 వంశాలు ఉన్నాయి. జాతరకు వచ్చే మెస్రం వంశీయులకు చెందిన మహిళలు వంటలు చేసుకునేందుకు గోవాడ్‌లో 22 పొయ్యిలను ఏర్పాటుచేస్తారు. మహాపూజలకు కావాల్సిన నైవేద్యాలు అక్కడే వండుతారు. గోవాడ్‌లో ఇతరులు రాకుండా నిబంధనలు విధిస్తారు. మెస్రం వంశీయులు వేలమంది తరలి వచ్చినా.. ఈ 22 పొయ్యిల మీద వండిన వంటనే అందరూ ప్రసాదంగా స్వీకరిస్తారు. ఇతర ఆదివాసీలు, జాతరకు వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో బస చేస్తారు.

**బాన్ దేవతలకు మొక్కులు :** నాగోబా ఆలయం వెనుక ఉన్న బాన్ దేవతలకు మెస్రం మహిళలు సంప్రదాయ పూజలు చేస్తారు. గోవాడ్‌లో ఉన్న మహిళలతోపాటు భేటింగ్‌కు వచ్చిన కొత్త కోడళ్లను సంప్రదాయ వాద్యాలతో సతీదేవతల వద్దకు తీసుకువస్తారు. అక్కడినుంచి మహిళలు మర్రిచెట్ల సమీపంలో కోనేరు వద్దకు చేరుకుని పూజలు చేస్తారు. కోనేరు నీటిని తీసుకుని బాన్ దేవతలు ఉన్న చోటికి చేరుకుంటారు. అక్కడ మట్టితో బాన్ దేవతలను తయారుచేసి పూజలు నిర్వహిస్తారు. జాతర జరిగినన్ని రోజులు మెస్రం వంశీయులు కేస్లాపూర్‌లోనే ఉంటారు. ఆదివాసీల ఐక్యత, సంస్కృతికి చిరునామాగా నిలిచే ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా.. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఆదివాసీల సంప్రదాయం ప్రకారం నాగోబాకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకుంటారు. జాతరలో మరో ముఖ్యఘట్టం 'ప్రజాదర్బార్'. ఈ కార్యక్రమానికి ఆదివాసీ పెద్దలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారు. అక్కడి ప్రజల స్థితిగతులు, అవసరాలు తెలుసుకొని, వారి సమస్యలకు పరిష్కారం చూపుతారు.

**నాగరాజు దైవం:** క్రీ.శ.740 లో కేస్లాపూర్ గ్రామ గిరిజనుడు పడియేరు శేషసాయి నాగదేవతను దర్శించుకునేందుకు నాగలోకానికి వెళ్లాడట. అక్కడ ద్వారపాలకులు అడ్డగించి నాగరాజు లేరని చెబుతారు. శేషసాయి నిరుత్సాహంతో నాగరాజు శేషతల్పాన్ని తాకి కేస్లాపూర్‌కు వెనుదిరుగుతాడు. శేషతల్పాన్ని మానవుడు తాకిన విషయం తెలుసుకుని నాగేంద్రుడు ఆగ్రహిస్తాడు. శేషసాయిని అంతం చేయాలని భూలోకానికి వస్తాడు. ఈ విషయం తెలుసుకున్న శేషసాయి ప్రాణభీతితో కాలజ్ఞాన పురోహితుడు ప్రధాన్ పడమార్ దగ్గరికి వెళ్తాడు. నాగరాజును శాంతింపజేసే మార్గాన్ని తెలుసుకుంటాడు. ఏడు కడవల ఆవుపాలు, పెరుగు, నెయ్యి, తేనె, బెల్లం, పెసరపప్పు తదితర ఏడు రకాలతో నైవేద్యంగా సమర్పిస్తాడు. గోదావరి హస్తలమడుగు నీటిని 125 గ్రామాల మీదుగా తిరుగుతూ తీసుకొచ్చిన గంగాజలంతో నాగరాజును అభిషేకిస్తాడు. దీంతో కేస్లాపూర్ వద్ద ఉన్న పుట్టలోకి నాగరాజు వెళ్లి, దాన్నే తన నివాసంగా మార్చుకున్నాడట. అప్పటినుంచి ప్రతి సంవత్సరం పుష్యమాసం అమావాస్య రోజున అర్ధరాత్రి మెస్రం వంశీయులు నాగోబాకు పూజలు చేసి, జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

– కె. శ్యామల m : 9030 6262 88
e: desk.deccan@gmail.com


వేణుగోపాలస్వామి గుడి


మంటపం


వేణుగోపాలస్వామి గుడి

# ఎడితనూర్-రాతిపుటల్లో రాసిన చరిత్ర

సంగారెడ్డి జిల్లా, మండలంలోని ఎడితనూర్ గ్రామాన్ని చూడ్డానికి వెళ్ళినప్పుడు అక్కడ పాతరాతి యుగం నుండి చారిత్రిక యుగాల దాకా విలసిల్లిన అఖండ నాగరికత గురించిన ఆనవాళ్లు మాలో ఆనందాన్ని నింపాయి.

ఎడితనూరు గోదావరి నది, ఉపనది మానేరుకు పిల్ల నదులైన వాగులో ఒకటైన నక్కవాగు ఒడ్డున ఉంది. ఇప్పుడున్న ఎడితనూర్ గ్రామానికి ఉత్తరాన కొండల గుంపు ఉంది. ఆ కొండల్లో తూర్పు దిక్కున ఎత్తయిన బండలతో కూడిన ప్రాకారం లాంటిది ఉంది. ఈ గుట్టలను 'చౌడమ్మగుట్టల'ని పిలుస్తారు. చౌడమ్మ గుట్టలో వున్న ఈ పెట్రోగ్లైఫ్స్ చౌడమ్మ గుడినానుకుని వున్న గుహలో వున్నాయి. గుడిలోంచి ఒక దారి వుంది. గుహలో దక్షిణపు రాతిగోడపై 5 అడుగుల ఎత్తు, 6 అడుగుల వెడల్పు కొలతలతో అద్భుతమైన గంటుబొమ్మల వేటదృశ్యం కాన్వాస్ వుంది. అన్ని బొమ్మల్ని ఒకే ఫ్రేంలో చెక్కిన కళాత్మకమైన రాతిచిత్రాల పటం. ఈ చిత్రపటంలో పొడవైన కొమ్ములున్న రెండు పెద్ద ఎద్దులు చెక్కబడ్డాయి. బొమ్మల లోపల ఎన్నో చిన్న, చిన్న ఎద్దులు, మనుషుల బొమ్మలు నింపబడి వున్నాయి. ఇట్లాంటి చిత్రాలు అరుదు. మహబూబ్ నగర్ జూపల్లిలోని పెట్రోగ్లైఫ్స్ కంటె పెద్దవి ఇవి. ఎద్దుల చిత్రాలతో పోలికలున్నాయి.


ఉన్మత్త భైరవుడు

చిత్రించిన తీరులో అక్కడి కన్నా ఎక్కువ కళాత్మక ప్రతిభ వుంది. చేయి తిరిగిన కళాకారుల సృష్టినే సవాలుచేసే గొప్ప కళాఖండమిది. రెండు ఎద్దులను చుట్టుముట్టిన లేదా ఆరాధనలో వున్న మనుషులను పుల్లగీతలతో (Stick Drawing) చెక్కారు. మొదటి ఎద్దుబొమ్మను పరిశీలనగా చూస్తే అది పిల్ల ఏనుగు ఆకారంలో కనిపిస్తుంది. దాన్ని ఏనుగు బొమ్మగానే భావించారు. కాని అది కొమ్ములు చిత్రించడంలో లోపం వల్ల ఏనుగువలె కన్పడ్డదేమో. ఈ బొమ్మలకాన్వాసులో ఎద్దులలోపల చిత్రించిన బొమ్మలు గీతలతో, చతురస్రాకారాలతో, వివిధ ఆకృతులతో వున్నాయి. వీటినే కృష్ణశాస్త్రి గారు గణితరేఖలుగా భావించారు.

గుహలో నలువైపుల పెట్రోగ్లైఫ్స్ చిత్రించబడి వున్నాయి. ఉత్తరపు గోడలపై ఒక చోట కుక్క, 5 మొనల ఈటె చెక్కబడి వున్నాయి. మరొకచోట అలలవంటి గీతలు, వృత్తాకారాలు, నీటిలో చేప వలె చిత్రించబడివున్నాయి కాని పరిశీలనగా చూస్తే అది ఒక స్త్రీమూర్తిచిత్రమని, ఆమె అమ్మదేవత అయివుండొ లనిపిస్తుంది. అన్ని చిత్రాలను కలిపి చూస్తే ఇది ప్రాచీనమానవుని ఆరాధనా ప్రదేశమని తేలుతున్నది. జనుల రాకపోకలు, కూర్చుండడంవల్ల ఇక్కడి బండరాళ్ళు బాగా అరిగి పోయి నున్నబారిపోయి వుంటాయి.

ఇపుడున్న చౌడమ్మదేవతను తర్వాతి కాలంలో ప్రతిష్టించి వుంటారు. దేవతవున్న గుహలో వంద మంది కూర్చునేంత విశాలంగా వుంది. ఈ గుహలో నుండే 6 అడుగుల ఎత్తులో వున్న ఇరుకైన మార్గం నుండే ప్రధాన ఆరాధనాలయమైన ఎద్దుబొమ్మల గుహలోనికి ఒక దారి వుంది. ఈ తొలువుడు బొమ్మల్లో పుల్లగీతల వంటి ఆకృతిలో మనుషులు, చేతి ఆకారాలు, గణిత సంబంధమైన అనేక రూపాలు న్నాయి. అయితే, ప్రపంచంలోని అనేక ఆదిమానవుల ఆవాసాల్లో ఇటువంటి గంటు బొమ్మలు అగుపిస్తుంటాయి. మన దేశంలో లడఖ్‌లో, గోవా-ఉస్గరిమల్, తమిళనాడు-పెరుముక్కల్, కేరళ-ఎడక్కల్‌ల లోనూ ఈ గంటు బొమ్మలున్నాయి. ఇవన్నీ ఆదిమానవుల ప్రతీకాత్మక (Symbolic) రేఖారూప భాషలు.

**'గంగిగోవులబండ'**

చౌడమ్మగుట్టలోని 17.610942 ఉత్తర అక్షాంశాలు, 78.171787 తూర్పురేఖాంశాలపై ప్రాచీనమానవుని మధ్యశిలా యుగపు, నవీనశిలాయుగపు గంటు బొమ్మలు (Petroglyphs or Rock carvings), ఎరుపురంగు రాతిచిత్రాలు (Rock paintings) వున్నాయి. వీటిని స్టేట్ ఆర్కియాలజీకి చెందిన నరహరిగారు మొదట కనుగొన్నారు.

'గంగిగోవులబండ' మీద చిన్నపడిగెరాయి కింద ఎరుపు రంగు చిత్రాలున్న చిత్రితశిలాశ్రయ ముంది. లోపలికి దారి చేసుకుని వెళితే గుట్ట అంచున ఒక పడిగెరాయికింద లోపలివైపు


వేంకటేశ్వరుడు


చౌడమ్మ


వీరగల్లులు


మనిషి


వీరగల్లులు


వీరగల్లులు


వీరగల్లులు

రాతి చిత్రాలు ఉన్నాయి. ఈ చిత్రిత శిలాశ్రయం మధ్య శిలా యుగాల (Mesolithic Period) నాటిదిగా తెలుస్తోంది. ఆ చిత్రాలలో వేటలో ఉన్న ఆదిమానవుల చేతుల్లో వలరి, రాగోల వంటి పనిముట్లు బరిసె, వలలున్నాయి. మూపురాలున్న ఎద్దులు, ఆవులు, ఎడ్లబండి, బండి కిరువైపుల ఆవు, ఎద్దు, ఆవుదూడ, తాబేలు బొమ్మలు కన్పిస్తున్నాయి. మరికొన్ని రాతి పెచ్చులూడి వర్షానికి తడిసి పాడైపోయి తేటగా కన్పించడం లేదు. ఈ బొమ్మల వల్ల అప్పటి మనుషులు జంతువులను మచ్చిక చేసుకుని ఉంటారని, వేట, వ్యవసాయాలు తెలిసిన వారై ఉంటారని, ప్రాచీనులనీ తెలుస్తున్నది. ఈ చిత్రాలు నవీనశిలాయుగపు ఆదిమానవ జీవనానికి ఆనవాళ్ళు. జంతువుల వేట నుండి జంతువులను మచ్చిక చేసుకున్న మానవుని నాగరికపు అంతర్దశకు అద్దం పడుతున్న చిత్రాలివి. అక్కడ అనేకచోట్ల రాతిపనిముట్లు గొడ్డళ్ళు, గీకుడురాళ్ళు లభిస్తున్నాయి.

ఈ రాతిచిత్రాలలో ఎద్దుల బండి చిత్రణ గురించి న్యూమెయిర్ అనే ప్రసిద్ధ రాతిచిత్రాల నిపుణుడు ప్రత్యేకంగా పరిశోధనాపత్రమే సమర్పించాడు. భారతదేశంలోని రాతిచిత్రాలలో బండ్లు, రథాల మీద అదొక గొప్ప అన్వేషణ. ఒకనాటి పురామానవుల జీవనంలోనికి వచ్చిచేరిన వస్తువులు, వాటి సంస్కృతి, మార్పులు వాళ్ళను ముందుకే ప్రగతివైపే నడిపించాయి. వీటిని అర్థం చేసుకోవడానికి రాతిచిత్రాల పరిశీలన, పరిశోధనలు అవసరం.

**చౌడమ్మతల్లి**

ఈ ఆదిమానవుల ఆవాసాల నుంచి వెనకకు పోతే 30, 40 అడుగుల ఎత్తున్న ఏటవాలు కొండగుహలలో చౌడమ్మతల్లి వెలసింది. అమ్మ దేవతల ఆరాధనలకు ప్రతీక ఈ చౌడమ్మ దేవత. ఆమె పేరు మీదే ఈ గుట్ట చౌడమ్మ గుట్ట అయింది. ఈ తల్లి గిరిజనుల దేవతే. తర్వాత ఎవరో దుర్గ విగ్రహాన్ని ప్రతిష్టించినట్లుంది. ఇక్కడ ఏటేటా జాతర చేస్తారు. ఈ గుహాలయం పక్క మరొక సన్నని దోనెలో భైరవుని (బయ్యన్న) విగ్రహం ఉంది. ఈ శిల్పాన్ని బట్టి 5, 6 శతాబ్దాల కిందటిది అనిపిస్తుంది.


చౌడమ్మ, బయ్యన్నల గుళ్ళ ముందరి విశాలమైన వేదిక వంటి బండ మీద కప్పులేని మంటపం ఒకటి వుంది. పడమట శివాలయంగా మార్చబడ్డ ఒక రాతిగూడు ఉంది. లోపల రాష్ట్ర కూటుల నాటి పానవట్టంపై శివలింగం, బయట మెడ తెగిపోయిన ఇసుకరాతి నంది ఆకారం ఉన్నాయి. ఆ పక్కనే చిన్న జలాశయం.

పడమటి వైపు గుట్ట దిగబోతుంటే ఏదులబండగా పిలువబడే నీటి చెలిమె సొరికె ఉంది. దాంట్లోంచి ప్రవహించే నీటితో అక్కడొక రైతు రెండు ఎకరాలు పండించుకుంటున్నాడు. మిగిలిన నీరు కొండదిగి కట్టుకాలువ ద్వారా చెరువులోకి పోతున్నది.

**గిరిజన గణరాజ్యం**

ఏనుగులలొద్దికివతల ఆ పొలందాటి గుట్టలనడుమ లోయలోకి ప్రవేశించగానే ఎదుట మూడు రాళ్ళ వరుస గుండు కన్పిస్తుంది. అదే గద్ద గుండు. దీని గురించే కాశీపాండ్యన్ తన పుస్తకం మరుగున పడ్డ వారసత్వంలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ గుండుకు పడమటి వైపు ఎనుపోతు ఆకారం (గీత రూపంలో) చెక్కి ఉంది.

ఈ మహిషం బొమ్మ ఇక్కడ వేలాది ఏళ్ళుగా జీవించి రాజ్యాల నేలిన మహిషగణం-టోటెం, ఒక జాతి చిహ్నం. ఆదిలాబాద్‌లో భైంసా వంటి గ్రామాలైనా, మన వూర్లలోని మైసమ్మలైనా మహిషకుల ప్రతినిధులే కదా! ఎర్రనూరులో వర్ధిల్లిన పురాతన జాతి మహిషకగణంలోనిదని దీని భావం. మేం దీనిని రెండవసారి పరిశీలించినపుడు మరొక మహిషం పెట్రోగ్లైఫ్ అగుపించింది. మొదటి మహిషం 30 అంగుళాల ఎత్తు, 50 అంగుళాల వెడల్పులో వుంది. రెండవ మహిషం 26 అంగుళాల ఎత్తు, 33 అంగుళాల వెడల్పుతో వుంది. బొమ్మల్లో సగం వరకు విస్తరించిన పెద్దకొమ్ములతో ఈ రెండు గద్దగుండు బొమ్మలు


మహిషగణం టోటెంలు



ఎద్దులో ఎన్నో ఎద్దులు


గద్దగుండు


రాతిచిత్రాల గుహలో మురళీకృష్ణతో


మా గైడ్స్


వేటగాళ్ళు


బండి, ఎద్దులు


వేటగాళ్ళు


తాబేలు

చరిత్రాత్మకమైనవి. ఎర్ధనూరు అతి ప్రాచీనకాలం నుండి ఆధునిక కాలం వరకు వర్ధిల్లిన గొప్ప గ్రామం, గిరిజన గణరాజ్యం.

Ancient Society అనే పుస్తకంలో రచయిత మోర్గాన్ జాతుల పేర్లు ఆయా జాతుల చిహ్నాలను బట్టి వచ్చాయని, ఈ పేర్లన్నీ పక్షులు, జంతువులవిగానే ఉన్నాయని చెబుతూ, ఆదిమ సమాజాలు ఆటవిక దశలో తమకు పక్షినో, జంతువునో తమ గుర్తు (టోటెం)గా పెట్టుకునే వారంటూ, ఆ గుర్తులతోనే ఆయా గణసముదాయాలన్నీ గుర్తించబడ్డాయనీ రాశారు. ఎడితనూరు గుట్టల వరుస చౌడమ్మ గుట్టనుండి సిద్ధేశ్వరుని గుట్టవరకు 6 గుట్టలుగా విస్తరించి ఉంది. ప్రతిగుట్ట కొక పేరు, వాటి చేరువలో ఆదిమానవుల ఆవాసాల గుహలు అగుపిస్తున్నాయి. చౌడమ్మ గుట్ట, దేవతల కుచ్చె, వెంకన్న గుట్టల మధ్య గద్ద గుండు ఉంది.

దానికి తూర్పు, పడమరలుగా విస్తరించిన విశాలమైన లోయను ఏనుగుల లొద్ది అని పిలుస్తారు. ఈ లోయలో రాజుల కాలంలో ఏనుగుల సంత జరిగేదని పెద్దలు చెబుతుంటే విన్నామని మాకు గైడ్‌గా వచ్చిన యం. నరేందర్ తెలిపారు. ఏనుగుల లొద్దిలో కొంత దూరంలో ఒక Ringing rock లేదా Musical stone ఉండేదట. అది తర్వాత కాలంలో క్వారీ పనుల వల్ల పాడైపోయిందని, దానిమీద నిలబడి రాయిని తొక్కుతూ ఊపితే చప్పుళ్ళొచ్చేవని ఆయన వివరించారు. పూర్వం ఒంటరిగా ఉన్న రాయసగాంధ్రు రాయిని ఊపి పుట్టించిన నాదంతో వారకాంతలను తమ ఏకాంత సేవలకు రమ్మని పిలుచుకునే వారట. దానిని గ్రామస్తులు లంజగుండు అని పిలుస్తారు. ఇది ఒకప్పటి ఆదిమానవులు, ఆపై గిరిజనులు వార్తలు పంపుకునే తుడుం వంటి రాతివాద్యమే. ఆదిమానవుల ఆవాసాలున్న ఇట్లాంటి Ringing stones గల అనేక ప్రాంతాలు తాజాగా వెలుగుచూస్తున్నాయి.

ఇంకా ఇక్కడ ఆ లోయ పరిసరాల్లో పాటిగడ్డలు (పాత ఊరి దిబ్బలు) రెండు చోట్ల కనిపించాయి. అక్కడ మొద్దు పెంకలు, రాతి పనిముట్లు దొరికాయి. నాలుగైదు రక్కసిగూళ్ళు (సిస్ట్‌లు) పెదరాతియుగపు ఆనవాళ్ళుగా మిగిలి కనిపించాయి.

ఆ సమాధులకు ఒక పక్కన చిన్నగుట్ట, గుట్టకొక గుహ. ఆ గుహలో వెంకన్నగా పిలువబడే రెండు చేతుల దేవుడు, కుడి పక్కనే ఒక స్త్రీ మూర్తి ఉబ్బెత్తు బొమ్మలు చెక్కబడి ఉన్నాయి. దానికున్న ద్వారం చౌడమ్మ తల్లి గుడికున్న మాదిరే చిన్నదిగా ఉంది. పరిశీలనగా చూస్తే ఆ దేవుడి చేతిలో శంఖుచక్రాలు లేవు. ఫలమో, తామర మొగ్గో ఉన్నట్టుగా ఉంది. ఏదైనా, జైనయక్షిణులై ఉండొచ్చు! అక్కడికి దగ్గరలో రెండు నాగయక్షిణుల బొమ్మలు దొరికాయి. ఇక్కడున్న గుహాలయాల్లో మరొకటి సిద్ధేశ్వరుని గుట్టపై ఉంది. ఇప్పుడా గుడిలో శివలింగం లేదు. ముస్లింల సమాధి రాయొకటి, ఊదు పాత్రలు ఉన్నాయి. రాజులు మారినప్పుడల్లా వారి మతాధిపత్యాలు కూడా మారిపోతాయి, దేవుళ్ళు కూడా, అనిపించింది, చూస్తుంటే!

ఎడితనూరు గ్రామానికి వాయవ్యాన వున్న చెరువుకు అంచున జంగిడి గుళ్ళుగా పిలువబడే చోట రెండు వీరగల్లున్నాయి. ఇద్దరు గిరిజన వీరుల, (స్త్రీ, పురుషుల) వీరగల్లులలో విల్లమ్ములు, గొడ్డలి ఆయుధాలున్నాయి. తలకట్టు, ఆభరణాలు గిరిజన సంప్రదాయాలే. మరొక వీరగల్లు 6, 7 శతాబ్దాల కాలం నాటి ఆహార్యం ధరించిన వీరుని స్మారకశిలగా ఉన్నది.

జంగిడిగుళ్ళు అనగానే మా ఊళ్ళో మా చిన్నప్పుడు బలాదూరుగా తిరిగే పిల్లల్ని ఏమిరా! మిమ్మల్ని జంగిడి కొదిలిరా అనేవాళ్ళు. జంగిడికి విడవడం అంటే జన్నె (యజ్ఞం) కొదిలిన అర్థంలో దేవుడికి అంకితం చేసినట్టా లేక జంగిడి అంటే జంగల్ (అడవి) అనే అర్థంలోనా? ఆలోచించాల్సిన మాటే! ఎడితనూరు వేలయేళ్ళుగా వర్ధిల్లిన గిరిజన రాజ్య కేంద్రమని, పాతరాతి యుగం నుండి ఆధునిక రాజ్యాలదాకా చారిత్రిక కాలాన్ని తనలో దాచుకుని రాతిపుటల్లో రాసుకున్నదని ఈ ఊరిని సందర్శించిన వాళ్ళకెవరికైనా అనిపిస్తుంది.


ఈ ఊరిలో ఎక్కడా శాసనాలు లభించలేదు. కాని, ఊరికి దక్షిణాన చెరుకు తోటలో ఒక శిథిల దేవాలయం బయటపడింది. ఆలయ ద్వారబంధం మీద వేణు వూదుతున్న కృష్ణుడు, ఇరువైపుల గోపికలు, గోవులు అందంగా చెక్కబడి ఉన్నాయి. అంతరాళం పూర్తిగా తవ్వేయబడి ఉంది. ఆ ద్వారానికి ఆరాకుల పువ్వు చెక్కబడి ఉంది. ఇట్లాంటి చిహ్నాలే ఉన్న ఆలయాలు రాష్ట్రకూటుల కాలం నాటివని, వర్గల్‌లో కూడా ఇట్లాంటి గుర్తులున్నాయని మా గురువు విరువంటి గోపాలకృష్ణ (కొలనుపాక) చెప్పారు.

**ధన్యవాదాలు:** మాకు గైడ్‌గా వచ్చిన ఎడితనూర్ గ్రామస్తుడు యం.నరేందర్ బృందానికి.

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com





# భారతదేశంలోని 43 యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలు

1972లో స్థాపించబడిన వరల్డ్ హెరిటేజ్ సైట్ యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్(UNESCO) వరల్డ్ హెరిటేజ్ కన్వెన్షన్, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముఖ్యమైన సాంస్కృతిక మరియు సహజ ప్రదేశాలను గుర్తించి సంరక్షిస్తుందిప్రపంచంలో అత్యధిక UNESCO వారసత్వ ప్రదేశాలలో భారతదేశం ఆరవ స్థానం. UNESCO భారతదేశంలోని 43 ప్రదేశాలు: 35 సాంస్కృతికమైనవి, 7 సహజమైనవి మరియు 1 మిశ్రమ (సాంస్కృతిక మరియు సహజమైనవి). ఈ ప్రదేశాలలో పురాతన దేవాలయాలు, కోటలు, రాజభవనాలు, గుహలు, జాతీయ ఉద్యానవనాలు మరియు వన్యప్రాణుల అభయారణ్యాలు ఉన్నాయి.

| నెం | సైట్ల పేరు | సంవత్సరం | రాష్ట్రం |
|---|---|---|---|
| 1 | అజంతా గుహలు | 1983 | మహారాష్ట్ర |
| 2 | ఎల్లోరా గుహలు | 1983 | మహారాష్ట్ర |
| 3 | ఆగ్రా కోట | 1983 | ఆగ్రా |
| 4 | తాజ్ మహల్ | 1983 | ఆగ్రా |
| 5 | సూర్య దేవాలయం | 1984 | ఒరిస్సా |
| 6 | మహాబలిపురం స్మారక చిహ్నాలు | 1984 | తమిళనాడు |
| 7 | కజిరంగా నేషనల్ పార్క్ | 1985 | అస్సాం |
| 8 | కియోలాడియో నేషనల్ పార్క్ | 1985 | రాజస్థాన్ |
| 9 | మనస్ వన్యప్రాణుల అభయారణ్యం | 1985 | అస్సాం |
| 10 | గోవా చర్చిలు మరియు కాన్వెంట్లు | 1986 | గోవా |
| 11 | ఖజురహో స్మారక చిహ్నాలు | 1986 | మధ్యప్రదేశ్ |
| 12 | హంపి స్మారక చిహ్నాలు | 1986 | కర్ణాటక |
| 13 | ఫతేపూర్ సిక్రి | 1986 | ఆగ్రా |
| 14 | ఎలిఫెంటా గుహలు | 1987 | మహారాష్ట్ర |
| 15 | గ్రేట్ లివింగ్ చోళ దేవాలయాలు | 1987 | తమిళనాడు |
| 16 | పట్టడకల్ స్మారక చిహ్నాలు | 1987 | కర్ణాటక |
| 17 | సుందర్బన్స్ నేషనల్ పార్క్ | 1987 | పశ్చిమ బెంగాల్ |
| 18 | నందా దేవి & వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ నేషనల్ పార్క్ | 1988 | ఉత్తరాఖండ్ |
| 19 | బుద్ధుని స్మారక చిహ్నాలు, సాంచి | 1989 | మధ్యప్రదేశ్ |
| 20 | హుమాయున్ సమాధి | 1993 | ఢిల్లీ |
| 21 | కుతుబ్ మినార్ & స్మారక చిహ్నాలు | 1993 | ఢిల్లీ |
| 22 | డార్జిలింగ్, కల్కాసిమ్లా & నీలగిరి పర్వత రైల్వేలు | 1999 | డార్జిలింగ్ |
| 23 | మహాబోధి ఆలయం | 2002 | బీహార్ |
| 24 | భింబెట్కా రాక్ షెల్టర్స్ | 2003 | మధ్యప్రదేశ్ |
| 25 | ఛత్రపతి శివాజీ టెర్మినస్ | 2004 | మహారాష్ట్ర |
| 26 | చంపానేర్ పావగఢ్ ఆర్కియోలాజికల్ పార్క్ | 2004 | గుజరాత్ |
| 27 | ఎర్రకోట | 2007 | ఢిల్లీ |
| 28 | జంతర్ మంతర్ | 2010 | ఢిల్లీ |
| 29 | పశ్చిమ కనుమలు | 2012 | కర్ణాటక, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర |
| 30 | కొండ కోటలు | 2013 | రాజస్థాన్ |
| 31 | రాణి కి వావ్ (క్వీన్స్ స్టెప్‌వెల్), పటాన్ | 2014 | గుజరాత్ |
| 32 | గ్రేట్ హిమాలయన్ నేషనల్ పార్క్ | 2014 | హిమాచల్ ప్రదేశ్ |
| 33 | నలంద | 2016 | బీహార్ |
| 34 | ఖంగ్‌చెండ్‌జోంగా నేషనల్ పార్క్ | 2016 | సిక్కిం |
| 35 | లే కార్బుసియర్ (కాపిటల్ కాంప్లెక్స్) యొక్క ఆర్కిటెక్చరల్ వర్క్ | 2016 | చండీగఢ్ |
| 36 | ది హిస్టారిక్ సిటీ | 2017 | అహ్మదాబాద్ |
| 37 | విక్టోరియన్ గోతిక్ మరియు ఆర్ట్ డెకో సమిష్టి | 2018 | ముంబై |
| 38 | ది పింక్ సిటీ | 2019 | జైపూర్ |
| 39 | కాకతీయ రుద్రేశ్వర (రామప్ప) దేవాలయం | 2021 | తెలంగాణ |
| 40 | ధోలవీర | 2021 | గుజరాత్ |
| 41 | శాంతినికేతన్ | 2023 | పశ్చిమ బెంగాల్ |
| 42 | బేలూర్, హళేబీడ్ మరియు సోమనంతపుర హొయసల దేవాలయాలు | 2023 | కర్ణాటక |
| 43 | మొయిడమ్స్ సమాధులు | 2024 | అస్సాం |





# విహంగం.. వీక్షణం..

బైనాక్యులర్స్, కెమెరాలతో బర్డ్ లవర్స్ సిద్ధమవుతున్నారు. ఆకాశానికి ఎక్కుపెట్టిన చూపులతో విహంగాలను తీక్షణంగా వీక్షించనున్నారు. అరుదైన అందాలను కెమెరాలతో బంధించనున్నారు. బర్డ్ అట్లాస్ పేరిట సమగ్ర విహంగ విశేషవాహిని రూపకల్పనలో మేము సైతం అంటూ పాలు పంచుకోనున్నారు నగరంలోని పలువురు పక్షి ప్రేమికులు.

నగరాలు కాంక్రీట్ జంగిల్స్‌గా మారిపోయిన పరిస్థితుల్లో జీవవైవిధ్యం కనుమరుగవుతోంది. అదే క్రమంలో ఎన్నెన్నో అరుదైన పక్షి జాతులు అంతరించిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పర్యావరణ ప్రేమికుల ఆలోచనల్లో నుంచే బర్డ్ అట్లాస్ ఊపిరిపోసుకుంది. నగరాల్లో పక్షుల సంచారాన్ని గుర్తించడం, సమగ్ర వివరాలతో డేటాను మ్యాప్ రూపంలో తయారు చేయడం తద్వారా వాటి రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేయడం వంటి లక్ష్యాలతో రూపొందేదే బర్డ్ అట్లాస్. మొదట ఈ తరహా రాష్ట్ర వ్యాప్త బర్డ్ అట్లాస్‌ను రూపొందించిన ఘనత కేరళ సొంతం చేసుకోగా.. నగరాలకు సంబంధించి కోయంబత్తూర్, మైసూర్ మాత్రమే ఈ ప్రక్రియను పూర్తి చేశాయి. వాటి తర్వాత హైదరాబాద్ కూడా సిద్ధమై వాటి సరసన నిలిచేందుకుప్రయత్నిస్తోంది..

**700 మంది వాలంటీర్లు..**

నగర జీవవైవిధ్యాన్ని అర్థం చేసుకోవడం, పరిరక్షించడంలో భాగంగా పక్షుల విశేషాలను ఒడిసిపట్టుకునేందుకు బర్డ్ అట్లాస్ రూపకల్పనలో నగరానికి చెందిన వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్, హైదరాబాద్ బర్డ్ పాల్స్, డెక్కన్ బర్డర్స్ సంస్థలు చేతులు కలిపాయి. నగరం, చుట్టుపక్కల లేక్స్, పార్క్స్ నుంచి ఔటర్ రింగ్ రోడ్‌లోని అడవులు, గడ్డి భూములు, చిత్తడి నేలలతో పాటు 180 సెల్స్ (పక్షుల జాడ కనిపించే ప్రాంతాలను) గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో సర్వేలో పాల్గొనే వాలంటీర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నవంబర్‌లో ప్రారంభం కాగా, గత డిసెంబర్‌లో పూర్తయ్యింది. ఇప్పటికి 700 మంది వాలంటీర్లుగా నమోదయ్యారు. వీరిని 90 లేదా 45 బృందాలుగా విభజించనున్నారు. జనవరి నెల మొత్తం ఈ వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

**పక్షులపై పట్టణీకరణ ప్రభావం..**

'బర్డ్ అట్లాస్‌లు శాస్త్రవేత్తలు, పర్యావరణ పరిరక్షకులు, విధాన నిర్ణేతలకు అమూల్యమైన సాధనాలు. అవి పక్షుల జనాభాలో మార్పులను విశ్లేషించడంలో సంతానోత్పత్తి స్థలాలు, వలసలను నిలిపివేసే ప్రదేశాలు తదితర కీలకమైన విషయాలను గుర్తించడంలో సహాయపడతాయి. ఈ డేటా పక్షి జనాభా క్షీణత లేదా మార్పులు వంటి ముఖ్యమైన పోకడలను వెల్లడిస్తుంది. తద్వారా జీవవైవిధ్యానికి హాని చేయకుండా నగరాభివృద్ధి, విస్తరణ జరిపేందుకు సహకరిస్తాయి అని వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్‌కు చెందిన ఫరీదా తంపాల్, హైదరాబాద్ బర్డ్ పాల్స్ ప్రతినిధి, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీరామ్‌రెడ్డి, డెక్కన్ బర్డర్స్‌కు చెందిన స్నుదీర్‌మూర్తి అంటున్నారు. 'పక్షి జాతులను పట్టణీకరణ ఎలా ప్రభావితం చేస్తుందనే దానిపై అట్లాస్ అవగాహన అందిస్తుంది. భవిష్యత్తులో మానవ కార్యకలాపాలు, వాటిని ఎలా ప్రభావితం చేస్తాయో అంచనా వేయడంలో కూడా సహాయపడుతుంది' అని వీరు స్పష్టం చేస్తున్నారు. నగర పర్యావరణ పరిరక్షణకు వీలు కలిగేలా వీరు చేపట్టిన బృహత్తర యత్నం విజయవంతం కావాలని.. ఆకాశహార్మ్యాలతో పాటు ఆకాశంలో విహరించే పక్షులు కూడా పెద్ద సంఖ్యలో మనకి కనువిందు చేయాలని కోరుకుందాం.

**మూడేళ్ల పాటు సాగనున్న వేట..**

సంవత్సరానికి రెండు సార్లు-శీతాకాలంలో (ఫిబ్రవరి) వేసవిలో (జూలై) ఒకసారి.. ఇలా మూడు సంవత్సరాల పాటు పక్షుల సర్వేలను నిర్వహిస్తారు. తొలిగా వచ్చే ఫిబ్రవరిలో సర్వే ప్రారంభం అవుతుంది. టీమ్స్, వాలంటీర్ల వెసులుబాటును బట్టి ఆ నెల మొత్తం సర్వే కొనసాగుతుంది. అనంతరం మ్యాప్ తయారు చేస్తారు. ఇదే విధంగా మూడేళ్ల పాటు ఈ క్రతువు కొనసాగుతుంది.

– ఖైజర్ భాష
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# మానవ, వన్యప్రాణులకు 'వన్ హెల్త్' విధానం

నాగ్‌పూర్ జూలో H5N1 బర్డ్‌ఫ్లూతో 3 పులులు, 1 చిరుతపులి మృతి చెందడంతో అధికారులు ఆందోళన చెందారు. మానవ ఆరోగ్యం మరియు వన్యప్రాణులతో సహా వివిధ రంగాలలోని ప్రయత్నాలను ఏకీకృతం చేయడానికి ఒక-ఆరోగ్య విధానాన్ని కోరడానికి అధికారులు తక్షణ శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు.

నాగ్‌పూర్‌లోని బాలాసాహెబ్ థాకరే గోరేవాడ ఇంటర్నేషనల్ జూలాజికల్ పార్క్‌లో సాధారణంగా 'బర్డ్ ఫ్లూ' అని పిలువబడే హైలీ పాథోజెనిక్ ఏవియన్ ఇన్ఫ్లుఎంజా (HPAI) H5N1 వైరస్ బారిన పడి మూడు పులులు మరియు ఒక చిరుత మరణించింది. టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రచురించబడిన ఒక నివేదిక ప్రకారం, మానవ-జంతు సంఘర్షణల తరువాత, చంద్రపూర్ నుండి 2024 డిసెంబర్‌లో జంతువులను అడవి నుండి రక్షించారు.



భారతదేశంలో బందీలుగా ఉన్న వన్యప్రాణుల మరణాలకు కారణమైన వ్యాధికి ఇది మొదటి ఉదాహరణ. ఈ పరిణామం మహారాష్ట్రలోని ఇతర జంతు ప్రదర్శన శాలలకు రెడ్ అలర్ట్ జారీ చేయవలసి వచ్చింది. వెంటనే నిలిపివేయాలని అధికారులు పిలుపునిచ్చారు. జూ జారీ చేసిన లేఖ ప్రకారం, మరణాల తరువాత, డిసెంబర్‌లో భోపాల్‌లోని ICAR-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్‌కు నమూనాలను పంపినట్లు దాని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (CEO) చంద్రశేఖరన్ బాలా ఎన్ అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌కు 2024 డిసెంబర్ 31న తెలియజేశారు. ఇటీవలి కాలంలో పౌల్ట్రీ పక్షులలో మొదటిసారిగా నివేదించబడిన H5N1, 500 జాతులకు పైగా, కనీసం 70 క్షీరద జాతులకు సోకడానికి "వన్యప్రాణులలోకి చిందించబడింది" అని ఐక్యరాజ్యసమితి తెలిపింది.

ఈ వైరస్ ఐదు ఖండాల్లోని 108 దేశాలలో తన ఉనికిని స్థాపించింది. ధ్రువ ఎలుగుబంట్లు, అంటార్కిటికా పెంగ్విన్‌లకు సోకడానికి ప్రపంచంలోని చాలా మూలాలకు చేరుకుంది.

జనవరి 1, 2025న ICAR-NIHSAD నాలుగు పులులు మరియు రెండు చిరుతపులిల నమూనాలను స్వీకరించింది. మూడు పులులు మరియు రెండు చిరుతపులులు H5N1 ఏవియన్ ఇన్ఫ్లుఎంజా వైరస్‌కు పాజిటివ్ పరీక్షించబడ్డాయి. అయితే ఒక మగ పులికి నెగెటివ్ వచ్చింది. ఈ సంఘటన జంతు ప్రదర్శనశాలలు, రెస్క్యూ సెంటర్లు మరియు ట్రాన్సిట్ ట్రీట్‌మెంట్ సెంటర్‌లలో ఏవియన్ ఇన్ఫ్లుఎంజా (H5N1) వ్యాప్తిని అరికట్టడానికి అవసరమైన చర్యలను వివరిస్తూ వైల్డ్‌లైఫ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (WRTC) ఒక సలహాను జారీ చేయడానికి ప్రేరేపించిందని లేఖలో పేర్కొన్నారు.

ఇన్ఫెక్షన్ యొక్క మూలం గురించి, స్ట్రెయిన్ 2.3.4.4 b అనే దాని గురించి మాట్లాడలేదు. ఈ జాతి ప్రపంచవ్యాప్తంగా వన్యప్రాణులు మరియు పశువులలో మరణాలు మరియు వ్యాధిని కలిగించింది. మానవులకు కూడా సోకింది.

వ్యాధి వ్యాప్తిని అరికట్టడానికి WRTC ఒక సమగ్ర సలహా, కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. "అడవి జంతువులలో H5N1 వ్యాప్తి, ముందస్తుగా గుర్తించడం కోసం రాష్ట్రం, పొరుగు రాష్ట్రాల్లోని జంతుప్రదర్శనశాలలు, రెస్క్యూ కేంద్రాలకు దీనిని ఫార్వార్డ్ చేయవచ్చు" అని WRTC నుండి గోరేవాడ జూ CEOకి ఒక లేఖలో పేర్కొంది.

యాక్షన్ ప్లాన్‌లో వలలు, కవర్ల వాడకంతో పక్షులు ఇతర జంతువులలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి బయోసెక్యూరిటీ చర్యలు ఉన్నాయి. పరిశుభ్రతను నిర్వహించడం, పాదరక్షలు, పరికరాలను క్రిమిసంహారక చేయడం తదితర అంశాలు యాక్షన్ ప్లాన్‌లో ఉన్నాయి.

తెలియని లేదా ధృవీకరించని మూలాల నుండి మాంసాహారులకు పచ్చి పౌల్ట్రీ లేదా ఇతర మాంస ఉత్పత్తులను తినిపించడాన్ని నివారించడం కూడా ఈ చర్యలలో ఉంటుంది. జంతువుల ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని WRTC పిలుపునిచ్చింది. ముఖ్యంగా అసాధారణ ప్రవర్తన సంకేతాలు లేదా ఏవియన్ ఇన్ఫ్లూఎంజాను సూచించే లక్షణాలు. జనవరి 3న, పశుసంవర్ధక శాఖ కమిషనర్, అభిజిత్ మిత్ర, సోకిన లేదా రోగలక్షణ పులులు, ఇతర పిల్లి జాతులు లేదా ఏదైనా ఇతర జంతువులను మరింత వ్యాప్తి చెందకుండా వేరుచేయాలని మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు.

తాత్కాలికంగా మూసివేయాలని, బయోసెక్యూరిటీ చర్యలను పెంచాలని నిర్దేశించబడింది. HPAIకి పాజిటివ్ పరీక్షించిన పులులు, చిరుతపులుల మరణాలు వైరస్ వేగంగా వ్యాప్తి చెందడం గురించి తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తుతున్నాయని లేఖ పేర్కొంది.

"జంతువు-మానవ" ఆరోగ్యం రెండింటికీ ప్రమాదాలను తగ్గించడానికి పరిస్థితి. తక్షణ శ్రద్ధ అవసరం. సమస్యను సమగ్రంగా పరిష్కరించడానికి మానవ ఆరోగ్యం, వన్యప్రాణులతో సహా వివిధ రంగాలలోని ప్రయత్నాలను ఏకీకృతం చేస్తూ, 'వన్-హెల్త్' విధానాన్ని అమలు చేయాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

-హిమాన్షు నిత్నావేర్

*(డౌన్ టు ఎర్త్ సౌజన్యంతో)*

అనువాదం: ఎ. శ్రీహరి



# జీవవైవిధ్య నష్టం-పిల్లల ఆరోగ్యానికి చేటు

వేడి తరంగాల నుండి వాయు కాలుష్యం వరకు, పర్యావరణ సంక్షోభాల మధ్య పిల్లలు పెరుగుతున్న ఆరోగ్య ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. UNICEF ప్రకారం, 820 మిలియన్ల మంది పిల్లలు హీట్‌వేవ్‌లకు ఎక్కువగా గురవుతున్నారు. ఇది హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్ మరియు లెర్నింగ్ కష్టాల సంభావ్యతను పెంచుతుంది. ప్రకృతి, పిల్లల ఆరోగ్యంపై విస్తృత శ్రేణి ప్రభావాలతో, వేడెక్కుతున్న గ్రహం యొక్క ఆరోగ్య ప్రభావాలను జీవవైవిధ్య నష్టం ఎలా వేగవంతం చేస్తుందో ప్రదర్శించడానికి ఇప్పటికే ఉన్న సాహిత్యాన్ని సంశ్లేషణ చేసింది.

1970 నుండి ప్రపంచవ్యాప్తంగా పర్యవేక్షించబడిన వన్యప్రాణుల జనాభా 69 శాతం తగ్గడంతో జీవవైవిధ్యం నాటకీయంగా క్షీణించింది. ఈ నష్టం క్లయిమేట్ డైనమిక్స్‌పై తీవ్ర ప్రభావాలను చూపుతుంది. ఇది పిల్లలను అసమానంగా ప్రభావితం చేస్తుంది. సూక్ష్మజీవుల వైవిధ్యాన్ని తగ్గించడం, హరిత ప్రదేశాలు తగ్గడం, హీట్‌వేవ్‌లు, వరదలు, వెక్టర్-బోర్న్ వ్యాధులు, వాయు కాలుష్యం వంటి వాటికి హాని కలిగించే అవకాశంతో సహా జీవవైవిధ్య నష్టం పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపే బహుళ మార్గాలను గుర్తించింది.

సూక్ష్మజీవుల వైవిధ్యం - పర్యావరణ వ్యవస్థలలో బ్యాక్టీరియా మరియు శిలీంధ్రాలు వంటి వివిధ రకాల సూక్ష్మజీవులు - మునుపటి అధ్యయనాల ద్వారా రోగనిరోధక నియంత్రణతో ముడిపడి ఉన్నాయి. వైవిధ్యమైన సూక్ష్మజీవులకు గురికావడం వల్ల పిల్లల రోగనిరోధక వ్యవస్థలకు ప్రయోజనం చేకూరుతుంది. అలెర్జీలు మరియు ఇన్‌ఫ్లమేటరీ రుగ్మతల ప్రాబల్యాన్ని తగ్గిస్తుంది. అయినప్పటికీ, జీవవైవిధ్య నష్టం ఈ రక్షిత యంత్రాంగాన్ని బలహీనపరుస్తుంది.

పచ్చని ప్రదేశాలకు పర్యటన అనేది పిల్లలలో మెరుగైన మానసిక ఆరోగ్యం మరియు అభిజ్ఞా అభివృద్ధితో బలంగా ముడిపడి ఉంది. 296 అధ్యయనాల యొక్క క్రమబద్ధమైన సమీక్షలో ప్రకృతి సంపర్కం శ్రద్ధ, మానసిక స్థితి మరియు మానసిక ఆరోగ్యానికి ప్రయోజనం చేకూరుస్తుందని కనుగొంది. ముఖ్యంగా శ్రద్ధ-లోటు/హైపర్‌యాక్టివిటీ డిజార్డర్ మరియు ఆందోళన వంటి పరిస్థితులు ఉన్న పిల్లలలో. అంతేకాకుండా, ఆకుపచ్చ ప్రదేశాలకు సామీప్యత శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది గురక మరియు బ్రోన్కైటిస్‌ను తగ్గిస్తుంది.

దీనికి విరుద్ధంగా, ఉద్యానవనాలు లేదా ఆకుపచ్చ ప్రదేశాలు లేకపోవడం వల్ల పిల్లలలో ఊబకాయం, శారీరక నిష్క్రియాత్మకత మరియు సరిపోని నిద్రతో ముడిపడి ఉంది.

శీతోష్ణస్థితి మార్పుల వల్ల తీవ్రతరం అయిన వేడిగాలులు మరియు వరదలు పిల్లలకు గణనీయమైన నష్టాలను కలిగిస్తాయి. UNICEF ప్రకారం, 820 మిలియన్ల మంది పిల్లలు హీట్‌వేవ్‌లకు ఎక్కువగా గురవుతారు. ఇది హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్ మరియు అభ్యాస ఇబ్బందుల సంభావ్యతను పెంచుతుంది. విపరీతమైన వేడి యొక్క ప్రభావాలు పుట్టకముందే ప్రారంభమవుతాయి. అధిక ముందస్తు జననాలు మరియు తక్కువ జనన బరువులు నివేదించబడ్డాయి.

వరదలు ఆరోగ్య ప్రమాదాలను మరింత తీవ్రతరం చేస్తాయి. 240 మిలియన్ పిల్లలు ప్రపంచవ్యాప్తంగా తీరప్రాంత వరదలకు

గురవుతున్నారు.. విపరీత వాతావరణ సంఘటనలు నీటి ద్వారా వచ్చే వ్యాధులు, పోషకాహార లోపానికి గురికావడాన్ని కూడా పెంచుతాయి.

వేడెక్కుతున్న ప్రపంచం మలేరియా, డెంగ్యూ వంటి వెక్టర్ ద్వారా వ్యాపించే వ్యాధుల భౌగోళిక పరిధిని విస్తరించింది. 600 మిలియన్ పిల్లలు అధిక ప్రమాదంలో ఉన్నారు. పిల్లల్లో దీని రోగనిరోధక వ్యవస్థలు పెద్దల కంటే తక్కువ అభివృద్ధి చెందాయి. ముఖ్యంగా ఈ ఇన్ఫెక్షన్లకు గురవుతారు.



వాయు కాలుష్యం, జీవవైవిధ్య నష్టంతో దగ్గరి సంబంధం కలిగి ఉంది. ప్రపంచవ్యాప్తంగా 2 బిలియన్ల మంది పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఇది ఉబ్బసం వంటి శ్వాసకోశ వ్యాధులకు దోహదం చేస్తుంది. ఐదేళ్లలోపు పిల్లల మరణానికి ప్రధాన కారణం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) వాయు, నీటి కాలుష్యం కారణంగా ఏటా 1.5 మిలియన్ల పిల్లల మరణాలకు కారణమైంది.

వైద్యపరమైన ఆవిష్కరణలకు జీవవైవిధ్యం చాలా కీలకం. అనేక ఆధునిక ఔషధాలు సహజ వనరుల నుండి తీసుకోబడ్డాయి. ఉదాహరణకు క్వినైన్, మలేరియా చికిత్సకు దక్షిణ అమెరికా సింకోనా చెట్టు నుండి ఉద్భవించింది.

జీవవైవిధ్య నష్టం అటువంటి వనరుల లభ్యతను దెబ్బతీస్తుంది. మలేరియా వంటి వ్యాధులను ఎదుర్కోవడానికి ప్రయత్నాలను క్లిష్టతరం చేస్తుంది. ఇది 2023లో ప్రపంచవ్యాప్తంగా 597,000 మరణాలకు కారణమైంది. వీరిలో 76 శాతం మంది ఆఫ్రికాలో ఐదేళ్లలోపు పిల్లలలో ఉన్నారు.

జీవవైవిధ్య నష్టం, వాతావరణ మార్పు కేవలం పర్యావరణ సమస్యలే కాకుండా, పిల్లల హక్కుల సంక్షోభం కూడా అని ఈ వ్యాసంలో చెప్పబడింది. ఆగస్టు 2023లో, బాలల హక్కులపై ఐక్యరాజ్యసమితి కమిటీ పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన మరియు స్థిరమైన వాతావరణం కోసం పిల్లల హక్కును పునరుద్ఘాటించింది. వారి భవిష్యత్తును రక్షించడానికి తక్షణ చర్యను కోరింది.

– మధుమితా పాల్

*(డౌన్ టు ఎర్త్ సౌజన్యంతో)*

అనువాదం: ఎ. శ్రీహరి

## చందాదారులుగా చేరండి... చేర్పించండి...

***పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు... నమస్సులు.***

తెలంగాణ ఉద్యమ సందర్భంలో పుట్టిన తెలుగు మాసపత్రిక దక్కన్‌లాండ్. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేలా ఎందరో ప్రముఖుల వ్యాసాలను అందించింది. టిఆర్‌సి 'చర్చ' సారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది. తెలంగాణ భావజాలాన్ని బలోపేతం చేసింది. స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దక్కన్‌లాండ్ తెలంగాణ పునర్ నిర్మాణంతో తనదైన పాత్రను పోషిస్తున్నది. తెలంగాణ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మరింత పరిపుష్టం చేసుకునేదానికి దోహదం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో సామాజిక అంశాలతోపాటు, పర్యావరణం, చరిత్ర, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యాటకం లాంటి అంశాలపై కథనాలను వెలువరిస్తున్నది. ప్రజా సంక్షేమం కోసం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లుతుంది. 2012 సెప్టెంబర్‌లో ప్రారంభమైన పత్రిక ఇప్పటి వరకూ మీ అందరి సహకారాలతో కొనసాగుతూ వస్తుంది. ఇప్పటికే ఎంతో మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ చందాలతో పాటు, చందాదారులను చేర్పించడంలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారికి ధన్యవాదాలు.

అయినప్పటికీ పత్రిక నిర్వహణ కష్టసాధ్యంగా ఉంది. దక్కన్‌లాండ్ మనందరిది. పదికాలాల పాటు పత్రిక సజావుగా వెలువడే బాధ్యత మన అందరిదీ.

చందా పూర్తయిన వారు తమ చందాలను రెన్యూవల్ చేసుకుని కాంప్లిమెంటరీ కాపీలు అందుతున్న వారు కూడా చందాదారులుగా చేరి, మిత్రులను చేర్పించి సహకరిస్తారని ఆశిస్తూ...

ధన్యవాదాలతో... మీ

**– మణికొండ వేదకుమార్**

సంపాదకులు

**చందా వివరాలు:**

వార్షిక చందా : రూ. 300 2 సంౢలకు : రూ. 600

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎంఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**చిరునామా :**

**DECCAN LAND :**
**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com ww.deccanland.com

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:**

| | |
|---|---|
| Name | : DECCAN LAND |
| Bank | : KOTAK MAHINDRA BANK |
| A/c No | : 7111218829 |
| IFSC Code | : KKBK0007463 |
| Branch Code | : 007463 |





# గిరి 'గడబ' ప్రకృతితో మమేకం

ఆధునిక ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న గిరిజన తెగ 'గడబ' ఇప్పుడిప్పుడే తన రూపు మార్చుకుంటోంది. అయితే, వీరి అరుదైన సంస్కృతి అంతరించిపోకుండా కాపాడుకుంటోంది.

ప్రాచీన కాలం నుంచి ఈ తెగ గోదావరి పరివాహక ప్రాంతానికి దాపుగా ఉంటోంది. 'గ' అంటే గొప్పతనం అని, 'డ' అంటే నీటికి సూచిక అని అర్థం. 'గడ' అంటే గొప్పదైనా నీరు అని, గోదావరి అనే పేరు ఉంది.



ఒరియాలో 'గడబ' అంటే సహనం గలవాడు అని అర్థం. గడబ తెగలు ఒరిస్సా వింధ్య పర్వత ప్రాంతాల్లో స్థిరపడ్డాయి. మధ్యప్రదేశ్‌లోనూ ఈ తెగ ఉంది. ఈ తెగను భాష గుటబ్! వీరిలో అక్షరాస్యులు, నిరక్షరాస్యులూ ఉన్నారు. మన రాష్ట్రంలో గడబలు విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల్లో ప్రముఖంగా కనిపిస్తారు.

**అటవీ ఉత్పత్తులే ఆధారంగా!**

వీరు గడ్డి, మట్టి, కలపను ఉపయోగించి ఇండ్లను నిర్మించుకుంటారు. ఈ గుడెసెలు త్రికోణాకారంలోనూ, మరికొన్నింటికి కింది భాగం గుండ్రంగా ఉండి పైకప్పు కోన్ ఆకారంలో ఉంటుంది. మహిళలు కుట్టని రెండు వస్త్రాల ముక్కలను ధరిస్తారు. అలాగే, రెండు వలయాలుగా ఉండే నెక్‌పీస్‌ను ధరిస్తారు. వీటిలో అల్యూమినియమ్, వెండి లోహం ప్రధానమైంది. తృణధాన్యాలు, వరి పండిస్తారు. అటవీ ఉత్పత్తుల మీద ఆధారపడే వీరంతా సహజ పద్ధతుల్లో తయారుచేసుకున్న సారాయి, కల్లు పానీయాలను సేవిస్తారు.

**థింసా నృత్యం**

మహిళలు అర్ధచంద్రాకారంలో నిలబడి, ఒకరి మీద ఒకరు చేతులు వేసి, ఒక వైపుకు లయబద్ధంగా కాళ్లు కదుపుతూ నృత్యం చేస్తారు. వీరు నృత్యం చేస్తున్నప్పుడు పురుషులు సంగీత వాయిద్యాలను వాయిస్తారు. ఈ థింసా నృత్యం ఆధునిక ప్రపంచాన్ని విశేషంగా ఆకట్టుకుంటుంది.

**సులువైన జీవనం**

ఇంటిపేర్లను బట్టి వావివరసలను లెక్కించుకుంటారు. మేనబావ, మేనమరదలు వరసలు గలవారు వీరిలో ఎక్కువగా పెళ్లి చేసుకుంటారు. పెళ్లి వద్దని అమ్మాయి అనుకుంటే కుల పెద్దలతో పంచాయితీ నిర్వహించి వారి సమక్షంలో ఓలి ఖర్చు పెట్టుకుంటే చాలు విడిపోవచ్చు. అబ్బాయి కూడా ఇదే పద్ధతి పాటిస్తాడు.

**అన్నీ చిన్న కుటుంబాలే!**

గడబలో ఎక్కువగా చిన్నకుటుంబాలే. వీరికి ఇటెకుల, కొత్త అమావాస్య, తొలకరి, కులదేవత పండగలు ప్రధానమైనవి. వీరిని గద్బా అని మధ్య ప్రదేశ్‌లో, గడబాస్ అని ఆంధ్రప్రదేశ్‌లో పేరుంది.

– కె. సచిన్,
m : 86866 64949
e:desk.deccan@gmail.com



## సూరజ్‌కుండ్ (హర్యానా)

# 38వ అంతర్జాతీయ క్రాఫ్ట్ మేళా

**38**వ సూరజ్‌కుండ్ ఇంటర్నేషనల్ క్రాఫ్ట్స్ ఫెయిర్ 2025 ఫిబ్రవరి 7 నుండి 23, 2025 వరకు ఫరీదాబాద్ (హర్యానా)లోని సూరజ్‌కుండ్‌లో జరుగుతుంది. కేంద్ర పర్యాటక, సంస్కృతి, విదేశీ వ్యవహారాలు, జౌళి, ICCR మరియు హర్యానా ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించే ఈ ఫెయిర్, భారతదేశం అంతటా, అలాగే ఇతర దేశాల నుండి వచ్చిన క్రాఫ్ట్స్, టెక్స్‌టైల్స్, సంస్కృతి మరియు వంటకాల యొక్క అత్యుత్తమ సంప్రదాయాలను ప్రదర్శిస్తుంది. కొన్ని సంవత్సరాలుగా, ఈ ప్రాంతం యొక్క పర్యాటక క్యాలెండర్‌లో ఈ ఫెయిర్ ఒక ప్రముఖ కార్యక్రమంగా మారింది.

37వ సూరజ్‌కుండ్ ఫెయిర్ 2024లో 45 కంటే ఎక్కువ దేశాలు మరియు 592 మంది విదేశీ కళాకారులు పాల్గొన్నారు. ఇది 1.3 మిలియన్లకు పైగా సందర్శకులను ఆకర్షించింది. 38వ సూరజ్‌కుండ్ ఇంటర్నేషనల్ క్రాఫ్ట్స్ ఫెయిర్ 2025 కోసం, బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ-సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (BIMSTEC)ని భాగస్వామి సంస్థగా ఆహ్వానించాలని ప్రతిపాదించబడింది.




సాంస్కృతిక బృందాలను (సుమారు 10 నుండి 15 మంది సభ్యులు), వారి వారసత్వాన్ని ప్రదర్శించగల కళాకారులను పంపడం ద్వారా ఆ దేశాలు ఫెయిర్‌లో పాల్గొనవచ్చని మేము మీకు తెలియజేస్తున్నాము. సూరజ్‌కుండ్ మేళా అథారిటీ వారు ఢిల్లీ విమానాశ్రయం నుండి ఫెయిర్ గ్రౌండ్‌లకు ఉచిత వసతి, భోజనం, రవాణా సౌకర్యాన్ని అందిస్తుంది. మెయిల్: haryanatourism74@gmail.com.

సూరజ్‌కుండ్ ఇంటర్నేషనల్ క్రాఫ్ట్స్ మేళా ప్రపంచ వైవిధ్యాన్ని అనుభవించడానికి ప్రేక్షకులను ఆకర్షిస్తుంది. ఇది విభిన్న సంస్కృతుల సంగమం. సూరజ్‌కుండ్ ఇంటర్నేషనల్ క్రాఫ్ట్స్ మేళా సందర్శకులు హస్తకళలను, వస్త్రాల షాపింగ్ చేయడానికి, సాంస్కృతిక ప్రదర్శనలను, మరియు వంటకాల శ్రేణిని ఆస్వాదించడానికి అద్భుతమైన ఈవెంట్.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



# చాళుక్యుల శిల్ప సంపదకు ముప్పు!

మహబూబ్ నగర్ జిల్లా గంగాపురం చెన్నకేశవ స్వామి ఆలయంలో చారిత్రక ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి. ఆలయం నిర్లక్ష్యం కారణంగా అద్భుతమైన చాళుక్యుల శిల్ప సంపదకు ముప్పు వాటిల్లుతుంది. ఇప్పటికే చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన కోట గోడలు ధ్వంసమయ్యాయి. చారిత్రక ఆధారాలుగా నిలిచిన శాసనాలు కనుమరుగయ్యాయి. ఆలయంలోపల శిల్పాల్లో కొన్ని ధ్వంసమయ్యాయి. ఉప ఆలయాలు పట్టించుకునేవారు లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రధాన ఆలయం ద్వారం శిల్ప శోభితంగా కనిపించేది. అది ఇప్పుడు రంగు వెలిసి కళావిహీనంగా కనిపిస్తోంది. లోతైన మెట్ల బావి ఇప్పటికీ భక్తులకు దర్శనమిస్తూ నాటి చారిత్రక వైభవాన్ని చాటుతోంది. ఆలయంలోని ఉప ఆలయాలను పట్టించుకునేవారులేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. చారిత్రక వారసత్వంసంపదను పరిరక్షించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిని సారించాలని భక్తులు కోరుతున్నారు. ప్రాచీన వారసత్వ సంపద జాబితాలో ఈ ఆలయాన్ని చేర్చి నిధులు విడుదల చేసి కాపాడాలని భక్తులు కోరుతున్నారు. రంగు వెలుస్తున్న నల్ల రాతి శిల్పాలకు ప్రముఖ శిల్పుల సలహాలు తీసుకుని పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. చెల్లాచెదురైన చారిత్రక శాసనాలను ఒకచోట చేర్చి ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయాలని హిందూ ధార్మిక సంస్థలు కోరుతున్నాయి.

### అసలు చరిత్ర ఇది

దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రాచీన ఆలయంగా ప్రసిద్ధి చెందిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామంలో ఉంది. జడ్చర్ల నుండి కల్వకుర్తికి వెళ్లే ప్రధాన రహదారి వెంట 6 కిలోమీటర్లు ప్రయాణిస్తే గంగాపురం ఆలయ ముఖద్వారం కనిపిస్తుంది. కొద్ది లోపలికి వెళ్తే చెన్నకేశవ స్వామి ఆలయం దర్శనమిస్తుంది. బాదామీ చాళుక్యుల కాలంలో ఈ ప్రాంతం ఎంతో ప్రసిద్ధిగాంచింది. కళ్యాణి చాళుక్య రాజు త్రైలోక్య మల్ల సోమేశ్వరుడు క్రీ.శ.1042 -1063 మధ్య ఆలయాన్ని నిర్మించినట్లు ఇక్కడ లభించిన శాసనాల ద్వారా తెలుస్తోంది. స్కాంద పురాణంలోనూ గంగాపురం ఆలయ ప్రస్తావన ఉంది. ఈ ఆలయంలో ప్రధాన దైవం చెన్నకేశవస్వామి. లక్ష్మీదేవితో దర్శనమిస్తాడు. అప్పట్లో కేశవపురంగా ప్రసిద్ధి చెందింది. చెన్నకేశవుడు మీసాలతో గంభీరంగా భక్తులకు దర్శనమిస్తాడు. ఆలయ పరిసరాలన్నీ శిల్ప సంపదతో భక్తుల మనసును దోచుకుంటాయి. శిల్పుల పనితనాన్ని కళ్లకు కట్టినట్టు చూపించే అనేక శిల్పాలు ఈ ఆలయం వద్ద ఉన్నాయి. జైన శైవ మతాలు విరాజిల్లినట్లు చరిత్రకారులు స్పష్టం చేస్తున్నారు.

### ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు

గంగాపురం లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రతిఏటా రథసప్తమి నుండి ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి 2 నుండి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 2 ఆదివారం తిరు కళ్యాణము, 3 సోమవారం పుష్పరథము, 4 మంగళవారం ప్రధాన రథోత్సవం, 5 బుధవారం శకటోత్సవం జరుగుతుంది. బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి జిల్లా నుండి కాకుండా ఇతర జిల్లాల నుండి, కర్ణాటక రాష్ట్రం నుండి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. బ్రహ్మోత్సవాల కోసం ఆలయ పాలకమండలి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. బ్రహ్మోత్సవాల పూజలు జనవరి 30 నుండి ఫిబ్రవరి 6 వరకు కొనసాగనుండగా ప్రధాన ఘట్టం మాత్రం ఫిబ్రవరి 2 నుండి ప్రారంభమవుతుంది.

-గుముడాల చక్రవర్తి గౌడ్
e:gcgoud1971@gmail.com






# చెమట చుక్కలకు తర్ఫీదు

## యువతకు దేశ, విదేశాల్లో విద్య, ఉపాధి అవకాశాలపై సింగరేణి వినూత్న కార్యక్రమం

సింగరేణి విస్తరించి ఉన్న కోల్ బెల్ట్ ప్రాంతంలోని సింగరేణి ఉద్యోగుల పిల్లలు, స్థానిక యువతకు దేశ, విదేశాల్లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించి వారిని మంచి స్థానాల్లో నిలిపేలా ప్రోత్సహించేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు "చెమట చుక్కలకు తర్ఫీదు" పేరిట సింగరేణి యాజమాన్యం ఈ పథకానికి రూపకల్పన చేసింది. రాష్ట్ర సచివాలయం ఎదుట ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహ ప్రాంగణంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, మహ్మద్ అలీ షబ్బీర్ ఈ పథకం లోగోను ఆవిష్కరించారు.




ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశాన్ని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ వివరించారు. సింగరేణి కార్మికుల పిల్లలు కేవలం కార్మికులుగానో లేదా ఇతర చిన్న ఉద్యోగాలకే పరిమితం కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ఎదిగేందుకు ఉన్న అవకాశాలపై వర్కుషాప్‌లు, సెమినార్లు, కెరీర్ గైడెన్సెలను ప్రముఖ నిపుణులతో సింగరేణి ప్రాంతంలో ఏర్పాటు చేయిస్తామన్నారు. దీనివల్ల జాతీయంగా, అంతర్జాతీయంగా ఉన్న అవకాశాలను వారు అందిపుచ్చుకొని వివిధ రంగాల్లో ఉజ్వల కెరీర్లను మలచుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్ కో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### కంపెనీ భవిష్యత్‌కు మొదటి ప్రాధానం

సింగరేణిలో పని చేస్తున్న ప్రతీ ఒక్క ఉద్యోగికి సమాజంలో మంచి గౌరవం, గుర్తింపు లభిస్తున్నాయని. మనల్ని ఉన్నత స్థాయిలో నిలబెడుతున్న సంస్థ భవిష్యత్తే ప్రతీ ఒక్కరికీ ప్రథమ ప్రాధాన్యం కావాలని సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. సింగరేణి ఉజ్వల భవిష్యత్ కోసం ప్రతీ ఒక్కరూ తమకు కేటాయించిన 8 గంటల పాటు అంకితభావంతో పనిచేయాలన్నారు. నూతన సంవత్సరం నేపథ్యంలో గురువారం (జనవరి 2) సింగరేణి భవన్‌లో ఉద్యోగులందరినీ ఉద్దేశించి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కొత్త ఏడాదిలో సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు ప్రతీ ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఉద్యోగుల పనితీరుపై పూర్తిస్థాయిలో మదింపు ఉంటుందని, పనిచేసే వారికి తగిన గుర్తింపు, నిర్లక్ష్యంగా ఉండే వారి పట్ల కఠిన చర్యలు ఉంటాయన్నారు. రక్షణ, నాణ్యతతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదక సాధించాలని, ప్రతీ ఒక్కరూ వారికి కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వర్తించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్, జీఎం కో ఆర్డినేషన్ ఎస్డి.ఎం.సుభానీ, జీఎం మార్కెటింగ్ రవి ప్రసాద్, జీఎ సోలార్ సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

–చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్
దివి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ప్రభుత్వ సంస్థ)
ప్రజా సంబంధాల విభాగం, హైదరాబాద్

# కొల్లాపురం సంస్థానం

తెలంగాణ లోని ఏ ప్రాచీన చారిత్రక ప్రదేశాన్ని చూసినా దాని వెనక వందల సంవత్సరాల చరిత్ర ఉంటుంది. ఆనాటి రాజులు రాజ్యాలు, సంస్థానాలు సంస్థానాధీషులు, కళలు సాహిత్యాలు, పరిపాలనా రీతులు నీతులు నేటి ఆధునిక ప్రపంచ జీవితానికి పునాదులుగా నిలబడతాయి, అట్లా నిలబడే వాటిలో సంస్థానాల సంస్థానాధీషుల పరిపాలన ప్రధానమైనది. తెలంగాణ లోని ప్రసిద్ధి చెందిన సంస్థానాలకు మహోన్నత చరిత్ర ఉంది. అలా ప్రసిద్ధి చెందిన సంస్థానాలలో కొల్లాపురం సంస్థానం ఒకటి. ఈ సంస్థానం ప్రస్తుతం తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉంది. దీని వైశాల్యం 191 చ.మై. ఇందులో 30 వేల జనాభా దాదాపు 90 గ్రామాలు ఉండేవి. వార్షిక ఆదాయం ఇంచుమించుగా రెండు లక్షలు. ఈ సంస్థానం కృష్ణానది పరివాహక ప్రాంతంగా ఉన్నది.



పూర్వం జటప్రోలు సంస్థానానికి కొల్లాపురం రాజధాని, సురభి లక్ష్మారాయ బహద్దూర్ వరకు అంటే సుమారు క్రీ.శ. 1840. వరకు వీరి రాజధాని జటప్రోలు. వీరి కాలం నుండి రాజధాని కొల్లాపురంకు మారింది. అప్పటి నుండి కొల్లాపురం సంస్థానంగా పేరొంది ఈ ప్రాంతాన్ని పరిపాలించిన వారంతా కొల్లాపురం సంస్థాన ప్రభువులుగానే ప్రసిద్ధులయ్యారు. వీరు మొదట్లో పెంట్లవెల్లి రాజధానిగా పాలన సాగించారు.

సురభి వంశస్తుల పూర్వీకులు దేవరకొండ (నల్గొండ) ప్రాంతం నుంచి ఇక్కడికి వలస వచ్చారని చరిత్రకారుల అభిప్రాయం. వీరు మొదట్లో జటప్రోలులో కోటను నిర్మించుకొని నిజాం ప్రభువులకు సామంతులుగా ఉన్నారు. ఇక్కడి సువిశాలమైన కోటలు, చక్కని భవనాలు సురభి సంస్థానాధీషుల కళాభిరుచిని చాటుతున్నాయి. ఇది మొదట విజయనగర చక్రవర్తులకు చివరి నిజాం ప్రభువుకు సామంతరాజ్యంగా ఉంది. భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత, హైదరాబాద్ పోలీస్ చర్య జరిగి తెలంగాణంలోని సంస్థానాలు భారత్‌లో విలీనం అయ్యేవరకు ఈ సంస్థానం సివిల్ మెజిస్ట్రేట్ అధికారాలతో ఉంది. తెలంగాణలోని గద్వాల, వనపర్తి, కొల్లాపురం మొదలైన సంస్థానాలు సివిల్ మెజిస్ట్రేట్ అధికారంలో ఉన్నవి. నిజాం ప్రభువులు తమ ఆధీనంలో ఉన్న సంస్థానాలకు సర్వాధికారాలు ఇవ్వటం వల్ల ఆయా సంస్థానాలు స్వేచ్ఛగా పరిపాలన సాగించి సర్వజన సమ్మతమైన పాలనను అందించాయి.

ఈ సంస్థాన పాలకులు రాచవెలమ తెగకు చెందినవారు. సురభి వీరి ఇంటి పేరు. వీరి గోత్రం రేచెర్ల. వీరి మూలపురుషుడు పిల్లలమర్రి బేతాళనాయుడు అని పిలువబడే చెవిరెడ్డి. ఈయన కాకతీయ చక్రవర్తి గుణపతి రుద్రదేవుని పరిపాలన కాలం వాడు. ఇతనికి తొమ్మిదవతరం వాడైన అనపోతనాయుడు క్రీ.శ. 1243 కొల్లాపురం సంస్థానాన్ని ఎంతో అభివృద్ధి చేసాడు. ఈ వంశం వారికి 'కంచి కవాట చూరకార', 'పంచపాండ్య దళవిధాళ', 'ఖడ్గనారాయణ' అనే బిరుదులు ఉన్నాయి. వీరు ఈ ప్రాంతంలో ఉన్న చిన్నమరూరు, పెంట్లవల్లి, వెల్లూరు మొదలగు గ్రామల్లో కోటలు కట్టి, చెరువులు త్రవ్వి, దేవాలయాలు కట్టించి సుమారు రెండు వందల సంవత్సరాల క్రింద ప్రస్తుతమున్న కొల్లాపురం రాజధానిగా చేసుకొని పరిపాలన సాగించారు. వీరిలో బేతళ నాయుని తరువాత చెప్పుకోదగ్గ పరిపాలకులలో దామానాయుడు, చెన్నమనాయడు. సింగమ నాయుడు, అనపోతా నాయుడు, మాధవరావు, ధర్మానాయుడు, తిమ్మానాయుడు, పెద్దినేడు మల్లభూపతి, జగన్నాథరావు, వేంకట లక్ష్మారావు మొదలగు వారు చెప్పుకోదగ్గవారు.

వీరిలో మాధవరావు తరువాత పరిపాలనకు వచ్చిన రెండవ జగన్నాథరావు అనేక కోటలను కట్టించి పాలన కొనసాగించాడు. ఈయన 1871 ప్రాంతంలో చంద్రమహల్ అనే రాజప్రసాదాన్ని నిర్మించాడు. అక్కడి నుండే రాజ్యపాలన చేసాడు. ఈయన తరువాత వచ్చిన సురభి వెంకటలక్ష్మారావు గొప్ప పరిపాలనదక్షుడుగా పేరు పొందాడు. కొల్లాపురం సంస్థానంలో గొప్పగా చెప్పుకోదగ్గ వారు రాజా వెంకటలక్ష్మారావు. ఈయన గొప్ప షికారి (వేటగాడు). ఈయన వేటలో చంపిన పులులను, సింహాలను ఫోటో తీయించి రాజ ప్రసాదంలో ఉంచేవాడు. ఈయనే కొల్లాపురంలో సుందరమహల్ నిర్మించాడంటారు. ఈయన పరిపాలన కాలంలోనే కొల్లాపురం సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దబడ్డది.

కొల్లాపురం సంస్థానాధీషులు కళలు, సాహిత్యం, ఆయుర్వేదం లాంటి అంశాలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. కృష్ణా ఉపనదిపై లక్ష్మారావు పేరు మీద లక్ష్మాసాగర్ ప్రాజెక్టు నిర్మించారు. మంచాలకట్టలో మాధవస్వామి ఆలయం, సింగపట్నంలో లక్ష్మీ నరసింహసాగర్ అనే పెద్ద చెరువును నిర్మించారు. దీనికి ఆనుకునే శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. ఇది పెద్ద పుణ్య క్షేత్రం. ఈ ఆలయం సమీపంలో ఉన్న చెరువును 'సింగపట్నం శ్రీవారి సముద్రం చెరువు'గా పిలుస్తారు. ఈ చెఱువుకు ఎదురుగా ఉన్న

గుట్టపై లక్ష్మీదేవమ్మ ఆలయం ఉంటుంది. ఈ ఆలయం పేరుమీదుగానే ఆ గుట్టను లక్ష్మీదేవమ్మ గుట్ట అని పిలుస్తారు. కొల్లాపురం ప్రభువులు లక్ష్మీదేవమ్మను దర్శించుకొనుటకు వచ్చి ఇక్కడే విడిది చేసేవారు. అందుకోసం సుందరమైన భవనాలని నిర్మించారు.

సింగపట్నానికి 6 కి.మీ దూరంలో ఎత్తైన గట్టు ఉంది. ఆ గట్టు మీద రామస్వామి ఆలయం ఉంది. దానిని కొల్లాపురం ప్రభువులే నిర్మించారని చెప్తారు. సిద్ధేశ్వరం, మల్లేశ్వరం, సోమశిల ప్రాంతంలో వీరు కట్టించిన దేవాలయాలు శ్రీశైలం డ్యామ్ కట్టడం వల్ల వెనకకి వచ్చిన నీళ్ళలో మునిగిపోతుండడం చేత వాటిని అక్కడి నుండి తొలగించి జటప్రోలు, కొల్లాపురం, సోమశిలలో పునఃనిర్మించారు. విమానయానం కోసం కొల్లాపూర్లో జఫర్ మైదానం నిర్మించారు. ప్రస్తుతం ఇందులో జూనియర్ కళాశాల కొనసాగుతుంది. రాజువారి కోటలో ఒక పెద్ద గంట వుండేది. ప్రతి గంటకు ఒక సారి దీనిని కొట్టేవారు. ఇది సమయ సూచి. ఈ గంట శబ్దం కొల్లాపురం మొత్తం వినిపించేది.

అంతేకాక వీరు కవులను, కళాకారులను పోషించటమే కాక వేదశాస్త్ర పండితులను. సంగీత నృత్యాది లలిత కళానిపుణులను సన్మానించి విజ్ఞాన, వినోద, వికాసాలకు కారణమయ్యారు. సంస్థానాధీషులలో కొందరు సాహితీ సంస్థలకు, గ్రంథ ప్రచురణ సంస్థలకు విరాళాలు ఇచ్చి తెలుగు భాషా సాహిత్యాలను పోషించారు. కొల్లాపురం సంస్థానంలో ఉన్న కవి పండితులనే కాక ఇతర ప్రాంత కవి పండిత గాయకులను గౌరవించి సన్మానించారు. కొల్లాపురం సంస్థానాదీషుల్లో కొందరు కవి పోషకులే కాక స్వయంగా కవులు కూడ.

ఈ సంస్థానంలో సర్వజ్ఞ సింగభూపతి కాలం నుండి చివరి సంస్థానాధీషుల వరకు సాగిన నిరంతర సాహితీసేవ ప్రసిద్ధమైనది. ముమ్మడి మల్లభూపాలుడు ఎలకూచి బాలసరస్వతి (క్రీ.శ. 1610-1670) తెలుగు అనువాదం చేసిన సుభాషిత త్రిశతికి కృతిభర్త, నీతిశతకంలో "సురభి మల్లా నీతి వాచస్పతీ" అనీ శృంగార శతకంలో "సురభీమల్లా మానినీ మన్మథా." అనీ వైరాగ్య శతకంలో "సురభీమల్లా వైదుషీ భూషణా" అనే మూడు మకుటాలతో రూపొందిన మత్తేభ శార్దూల వృత్తాలలో ఉన్నది. ఎలకూచి బాలసరస్వతి ఈ త్రిశతిని మల్లభూపాలుని కోరిక మేరకు భర్తృహరి సంస్కృతంలో రాసిన సుభాషితాలను తెలుగు చేసి గొప్ప పారితోషికాన్ని పొందాడు. ఈ విషయం అందులోని పద్యంలో చూడవచ్చు.

**శా.** *"శ్రీమద్బాలసరస్వతీ ప్రకటలక్ష్మీ హేతువై, శాంతమై*
*ఆమోదావహమై, నిజానుభవ వైద్యంబై, అనే పెూదిగా*
*ద్యామేయ ప్రవిబోధ రూపమహితంబై యొప్పుతేజంబు ప్రా*
*పై మీకున్ సిరులిచ్చుతన్ సురభిమల్లా! నీతివాచస్పతీ!"*

(సంస్థానముల సాహిత్య సేవ, పేజి 25)

ఈ త్రిశతిని శ్రీ సురభి వేంకట లక్ష్మారాయ బహద్దూరు గారు శ్రీ కందుకూరి విరేశలింగం గారి చింతామణిలో ముద్రింప జేసాడు. అంతేకాక 'చంద్రికాపరిణయం', 'మల్లభూపాలీయం', 'సురభివంశచరిత్ర' లాంటి గ్రంథాల్ని ఈయనే అచ్చు వేయించాడు. ఈయన ధర్మపత్ని రాణి వేంకటరత్నమాంబ సంస్థాన మహారాణిగా ఎందరో కవి పండితులను పోషించింది. శ్రీ వనం సీతారామశాస్త్రిగారు ఆస్థాన కవిపండితునిగా అనేక శాస్త్ర విషయాలు చర్చించేవారు. మహారాణి గారి పోషణలో ఉన్న పండితులు సింగపట్నం ఓరుగంటి లక్ష్మీనారాయణ శాస్త్రి, పల్లా చంద్రశేఖర శాస్త్రి, శ్రీధర కృష్ణశాస్త్రి ముఖ్యులు, రాణీగారే వీరి కావ్యాలను అచ్చువేయించారు. ఆంధ్రాస్థానకవి, కవిసార్వభౌమ శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి వీరి అభిమానాన్ని పొంది ఇతోధికంగా ఆర్థిక సహాయం పొందాడు. మల్లభూపాలుని నాల్గవ భార్య వెంకటాంబ కొడుకు చినమల్లన్నపతి, ఈయన భార్య చెన్నాంబకు రామరాయుడు, మల్లభూపతి, మాధవరాయలు అని ముగ్గురు కొడుకులు, మాధవరాయడు రాసిన 'చంద్రికా పరిణయం' శ్లేష చమత్కార ప్రౌఢ ప్రబంధము. ఇది రామరాజ భూషణుని వసుచరిత్రకు దాదాపు సాటిరాగలిగిన ప్రౌఢ ప్రబంధం అని పండితులంటారు. మాధవరాయల కొడుకు నరసింగరావు 'క్షత్రఖేలన' అనే గ్రంథాన్ని రాసాడు. ఈయన కుమారుడు 'శూద్రస్మృతి' అనే సంస్కృత గ్రంథాన్ని రాసాడు.

లక్ష్మారాయ మనుమడు అయిన వేంకటలక్ష్మారావు (క్రీ.శ. 1850-1883) గారి కాలంలో ఈ సంస్థానంలో విద్వత్కవులు అనేక మంది సాహితీ సమారాధన చేసారు. కవితార్కిక సింహ మంచాలకట్ట గోవిందాచార్యులు, కవి కంఠీరవ కృష్ణమాచార్యులు, వైయాకరణ గజకంఠీరవ యణయవల్లి కృష్ణమాచార్యులు, వెల్లాల సదాశివశాస్త్రి, అవధానం శేషశాస్త్రి, అక్షింతల సింగరశాస్త్రి. అక్షింతల సుబ్బాశాస్త్రి మొదలగు పండిత కవులు కొల్లాపురం ప్రభువుల పోషణలో ఉన్నవారే.

ఈ విధంగా రాజ్యవిస్తరణలో, పరిపాలన నిర్వహణలో సాహిత్య పోషణలో కొల్లాపురం సంస్థానానికి సుధీర్ఘమైన చరిత్ర వుంది.

**ఉపయుక్త గ్రంథ సూచిక**

1) సంస్థానములు - సాహిత్య పోషణ, ఆచార్య తూమాటి దొణప్ప ఆంధ్ర విశ్వకళా పరిషత్తు- 1969
2) గోల్కొండ కవితా సంచిక
3) కాకతీయ కవితా సంచిక
4) సంస్థానముల సాహిత్య సేవ శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 2012
5) The Ruling chiefs, Nobles & Zamindars of India, A. Vadivelu, 1915

-డా॥ కె.కృష్ణమూర్తి
m : 8500167845
e : drkmurthy75@gmail.com

# చదువురాని సోగ్గాడు

**కథ:** రామ రామ రామ రామ - రామా రామా
రాజులమ్మ రాడవేణి రామ - రామా రామా

కోనరావుపేట మండలంలో తెల్ల కాగితం మీద నల్ల గీత తెలుపని సోకుల వడుతున్న కొండయ్య కతేందో ఇందామా!

**వంత:** నీ యవ్వ గీతలెందుకు తెలువయి ఒకటి రొండో లెక్కేసుకొని శెప్పచ్చు గదా!

**కథ:** ఓరి ఎర్రి ఎంగలయ్య అక్షరాలు రావని అర్థం..

**వంత:** అ ఆ... ఇ ఈ గన్వి రావానే..!

**కథ:** ఒరే మోకాళ్ల మెదడున్నోడా! సదువు రానోడని అర్థం.

**వంత:** గట్లయితే జర్ర జెప్పే..!

**కథ:** కోనరావు పేటలోన రామా రామా!
సోగ్గాడు కొండయ్య రామా రామా!
పనికేమో శేతగాడు రామా రామా!
తిండి కేమో బండయ్య రామా రామా!
అయ్యవ్వను హరిగోసజేసి రామా రామా!
పైసలేమో లాగుతాడు రామా రామా!
సిర్సిల్ల సీనిమాలకు రామా రామా!
సిందు లేస్తు పోతాడు రామా రామా! హరి హరి రామా



హరి గోస వెడుతూ.. అడ్డమైన తిరుగుళ్లకు అలవాటు వడ్డడు రామా..! అయ్యవ్వ పెద్దసారుకు మొరవెట్టుకుండ్రు రామా! సదువచేటట్లు చెయ్యి మన్నరయ్యా రామా..! ఒగనాడు కొండయ్య ఇంటికి పెద్దసారు ఎట్ల బయలు దేరినాడు రామా..!

మా ఊరి పెద్దసారు రామా రామా!
రాతిరనక పగలనక రామా రామా!
టకాటికా నడ్చుకుంటు రామా రామా!
కొండయ్య ఇంటికి బోయే రామా రామా!

కొండయ్యను బడికెందుకు తోలలేదని రామా! రాత్రి బడికైన పంపుండి! లేకుంటే నీ కొడుకు ఎందుకు గొరగాని రౌడీ అవుతడమ్మా..! రామా! ఓయి పంతులయ్య వాని ఈ పంత పల్లగొట్టి బర్లెకు తీసుకుపోండ్రి అని ఏడ్సిండ్రు నాయినా..! కొండయ్య ఉన్నప్పుడు మల్లా వస్తానని పెద్దసారు పోయిండు నాయనా..! ఒగనాడు పట్నంల సోపతిగాడు రంగని పెండ్లికోసం ఇంగెట్లు తయారైతుండు కొండయ్య రామా..!

అయ్యవ్వ నదరగొట్టి రామా రామా!
అంగిలాగు దొడిగినాడు రామా రామా!
టక్కుబిక్కు వేసిండు రామా రామా!
టై గట్టి బూట్లు వేసిండు రామా రామా!
సెంటు గింటు రాసుకొని రామా రామా!
టక్కుటిక్కు బస్సు ఎక్కి రామా రామా!
ఇమ్లీబన్ బస్టాండులో రామా రామా!
దిగీ దిక్కులు జూస్తుండు రామా రామా!

అమీర్‌పేట్ పంక్షన్ హాల్లో పెళ్ళి జరుగుతంది రామా! బుర్రు బర్రు మోటార్ల, ఆటోల, కార్ల హెూరు జూసి ఎవ్వరిని అడుగాలో ఏమీ దిక్కుతోచని స్థితిలో ఉన్నడూ నాయనా? గిదంత గమనిస్తున్న ఆటోడ్రైవర్! యాడికి బోవాలె సార్ అని అడిగిండు నాయనా..! సార్ అనగానే కొంచెం పొంగిపోయి, అమీర్‌పేట్ ఏ బస్సు పోతుంది? అని కొండయ్య అడుగానే పేరు సదువుకోని ఎక్కండి? సార్.. అనగానే నీళ్ళు నములుతున్నడయ్యా రామా! గిది పూర్తిగా అర్థం జేసుకున్న డ్రైవర్ నా ఆటోలో రాండి సార్.. పొగ్గించి ఆటోలో కూకుండు బెట్టుకోని రామా!

సందు గొందు తింపుతుండు రామా రామా!
గంటలు గంటలు దింపిండు రామా రామా!
అమీర్‌పేట చౌరస్తాల రామా రామా!
ఆపిండు ఆటో ట్రైవర్ రామా రామా!
మీటరు జూసి పైసలియ్యు రామా రామా!
అన్నడయ్య డ్రైవరయ్యా రామా రామా!
రాజులమ్మ రాడవేణి రామా రామా!

సదువు కొండయ్య మీటర్ జూడుమంటే దిక్కులు అటూ ఇటూ జూసి రామా..! ఎంత అని మళ్ళడిగిండు కొండయ్య రామా..! వీడొక అన్నాడి సదువురాని మొద్దు అనుకొని వందరూపాయలు మీటరు చార్జీ ఉంటే రెండు వందలన్నడయ్యా రామా! కొండయ్య గుండెలో దడ మొదలయ్యి నా కాడ అరువై రూపాయలే ఉన్నయి

అనగానే ముక్కోపి డ్రైవర్ ఎడాపెడా వాయించి ఉన్నయి దీసుకొని ఎక్కడి దరిద్రపోడు సూటుబూటు ఏసుకున్నడు సదువురాని సన్నాసి అంటు బూతులుగక్కుత వెళ్ళిండు నాయనా..!

పంక్షన్ హాలు కోసం హాలు సుట్టే 20 సుట్ల దిరిగిండు నాయనా! ఇంగ్లీషులో పేరు రాసి ఉన్నయి గాని సదువురాని సన్నాఇ కొండయ్య గప్పుడే గంట గంగయ్య కొండయ్యను శూశాడు నాయనా! విషయమంత తెలుసుకున్న గంగయ్య ఏమంటాడు రామా..!

పెళ్ళి కొడుకు పేరు రామా రామా!
పెళ్ళి కూతురు పేరు రామా రామా!
కమాను ముందటా రామా రామా!
రాసి ఉన్నాయి గదరా! రామా రామా!
సదివితే తెలిసేది గదరా! రామా రామా!
పరేశాను ఎందుకైనావు రామా రామా!
సూటుబూటు సేకున్నవు రామా రామా!
కళ్ళకద్దాలు వెట్టుకున్నవు రామా రామా!
బడి దొంగ వైతివెందుకు రామా రామా!
సదువురాని సన్నాసివైయ్యి రామా రామా!
నల్లుట్ల నవ్వులపాలైతివి రామా రామా!
నేల గీతలు గీయవడ్తివి రామా రామా!

ఓరి కొండయ్య నువు ఒక్కనివి ఇంగ ఎటు పోకు నాయనా..



ఇంగ అక్షంతలేసి బుక్కెడ బువ్వ దిని మేము వచ్చిన ప్రయివేటు బస్సు గిదే ఇంగో నెంబరు జూసుకో..! ఇంగ వచ్చి గింట్లనే కూకోరా కొండయ్య..! మల్ల నవ్వు కాటగలిసి మమ్ము పరేషాన్ చెయ్యకురా..! రామా..! ఇంగ పెళ్ళికాడికి... బువ్వ కాడికి పోదారారా కొండయ్యా..! పెళ్ళి జూపిచ్చిండు! బువ్వ దినే కాడికి దొల్కపోయిండు. ఇద్దరు బువ్వ దిన్నరు. బస్సుల కూకున్నరు నాయినా..! కొండయ్య మనసున పడ్తలేదు.

సదువు నేర్చుకోక నేను.. రామా రామా!
గిన్ని కట్టాలు వడితి గాద... రామా రామా!
వింత జంతువు వోలే.. రామా రామా!
నా గతి అయి పాయే.. రామా రామా!
పెద్దల మాట సద్దిమూట.. రామా రామా!
సదువు కున్న తెలివి... రామా రామా!
ఎట్ల ఉంటదో తెలినాది... రామా రామా!
ఇంటికి పోయి నంకా.. రామా రామా!
రాత్రి బడికి వోయి నేను.. రామా రామా!
సదువు నైతే నేర్చుకుంటా.. రామా రామా!
ఏవో ఏవో ఆలోచనలు... రామా రామా!
మనుసు నిండ తిర్గవట్టే.. రామా రామా!

కోనరావుపేటకు బస్సు జేరుకున్నది నాయనా! కొండయ్య గంపెడు సిగ్గుతో తలవంచుకొని ఇంటికి వోయిండు గానీ! రాత్రంత నిదురవోక ఆలోచనలో పడ్డడు. తప్పుజేసినోన! తెల్సుకున్నడయ్యా.. పొద్దుగాల లేసి కాలకృత్యాలు తీర్చుకొని పెద్దసారు దగ్గరికి దండాలు బెట్టి రామా! నాకు సదువు వచ్చే తొవ్వ జూపుండ్రి సారూ అని కాళ్ళమీద వడ్డడయ్యా!

బిడ్డా! కొండయ్య! నీ ఇష్టంతోని సదువు నేర్చుకుందామని వచ్చినవు. నువ్వు మంచి విద్యావంతునివి ఇంకెంతో మందికి నువ్వు తొవ్వ జూపుతవు బిడ్డా! అని రాత్రిపూట బడికి పోవాలె! ఆదివారం నా దగ్గరి రావాలే గట్లయితే కొద్ది రోజుల్లోనే సదువత్తది బిడ్డా! అని ముద్దుగ జెప్పినాడు నాయనా!

పలక బలపం బట్టినాడు రామా రామా!
పట్టుబడి సదువు తుండు రామా రామా!
వారం రోజుల వరకు రామా రామా!
అక్షరాలు ఒంట బట్టే రామా రామా!
గుణింతాలు నేర్చి నాడు రామా రామా!
రొండు వారాల వరకు రామా రామా!
బాల శిక్ష జదివినావు రామా రామా!

కొండయ్య మొద్దు నిద్ర మానిండు పెద్దసారు అండదండలతో పదో తరగతి పీజు గట్టించిండు నాయనా! ఏనుగు లెక్కన్న మనిషి కట్టెపుల్లోలె ఎండిపోయ్యిండు అయ్యవ్వ చిత్ర పతుతుండ్రు. పదిల పాసై, ఇంటర్, డిగ్రీ పూర్తిజేసి బిఈడి ప్రయివేటు జేసిండు నాయనా! ఉదుంపట్టువట్టి డిఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగమే అందుకుండు నాయనా..! తన కథనే జెప్పుకుంటూ పిల్లలను విద్యావంతులు తీర్చిదిద్దుతుండు నాయనా!

ఊరు జనమంతా రామా రామా!
ముక్కు మీద వేలేసుకొని రామా రామా!
సదువేమి రానోడూ రామా రామా!
సారు ఎట్ల అయ్యినాడు రామా రామా!
బోయ వాడు వాల్మీకి రామా రామా!
అయ్యి నట్లు రాత మారే రామా రామా!
సంకల్పం గట్టి గుంటే రామా రామా!
పట్టుదల గట్టి గుంటే రామా రామా!
జగతిలోన అన్ని గూడ రామా రామా!
సాధించ వచ్చు నయ్య రామా రామా!

గప్పటి నుంచి ఊరోళ్ళందరు ఎవ్వలకు సదువురాకున్న నాయనా ఏమి రాని కొండయ్య ఎట్లెదిగినాడో జూడుండ్రి నాయనా! గందుకే "కష్టేఫలి" అన్నరు పెద్దలు నాయనా! కష్టపడిన వాళ్ళకు ఫలితము తప్పక దక్కుతుంది నాయనా! అందరికి తొవ్వ జూపిన వాడు అయ్యిండు రామా..! అందరు కష్టాని ఇష్టపడి మీ గమ్యస్థానాన్ని చేరుకోండి.

మంగళంబు కథ విన్నవాళ్ళకు రామా రామా
మంగళంబు కష్టపడేవాళ్ళకు రామా రామా!

– డా॥ జనపాల శంకర్
m : 8074727108

# లీలావతీ గణితం

ఆర్యభట్టు (క్రీ శ 476), బ్రహ్మగుప్తుడు (క్రీ శ 598) వంటి గొప్ప శాస్త్రవేత్త ఆచార్య ద్వితీయ భాస్కరుడు. వీరు క్రీ శ 1114 సం లో జన్మించినట్టు చెబుతారు. ఇతని జన్మస్థలం కర్ణాటక ప్రాంతంలోని బీదరు లేదా బీజాపురం అని కొందరు భావిస్తే, మరికొందరు మహారాష్ట్ర ప్రాంతాల్లోని బీడ్ అని నమ్ముతారు.

భాస్కరాచార్యుడు క్రీ శ 1150లో రచించారని భావించే 'లీలావతీ గణితం' తొలిసారి 19వ శతాబ్దం ప్రారంభంలో పాశ్చాత్యుల దృష్టిలో పడింది. చార్లెస్ హట్టన్ (1737 -1823) రచించిన ఆంగ్ల గ్రంథంలో భారతీయ బీజగణితం గురించి ప్రస్తావిస్తూ 'లీలావతీ గణితం' గురించి ప్రస్తుతించారు. వివరాలు తరచి చూస్తే 1587లో అక్బర్ పాదుషా సలహా ననుసరించి ఫైజీ ఈ గ్రంథాన్ని పర్షియన్ భాషలోకి అనువదించారని తెలుస్తుంది. "నైరాశ్యంలో జీవితం వ్యర్థం కాకుండా, కుమార్తెను గణిత శాస్త్ర విశారదను చేశాడు. లీలావతీ గణితం గ్రంథం నిజంగానే జీవితేచ్ఛ గలిగించే స్ఫూర్తిదాయకమైన రచన", అని నెథాన్ ఎ కోర్టు తన 'మేథమేటిక్స్ ఇన్ ఫన్ అండ్ ఇన్ ఎర్నెస్ట్' గ్రంథంలో రాశారు.




భాస్కరుడు తన కాలం వరకు భారతదేశంలో వృద్ధి చెందిన గణిత శాస్త్ర జ్ఞానమంతటినీ క్రోడీకరించి, దోషాలు సవరించి, లోపాలు పూరించి 'సిద్ధాంతశిరోమణి' అనే సంస్కృత రచన చేశారు. ఇందులో గురుత్వాకర్షణ నియమం, కలన,సమాకలనగణితాలు ఉన్నాయి. అలాగే శూన్య సంఖ్య, సహజ సంఖ్యలు, ఋణ సంఖ్యలు, భిన్నాంకాలు, కరణీయ సంఖ్యలు వంటి భావనలను కూడా ప్రతిపాదించారు. ఋణాత్మక సంఖ్యలను పైన చుక్క పెట్టి గుర్తించే హేతుబద్ధమైన విధానాన్ని కూడా ప్రారంభించాడు. భాస్కరాచార్యులు రచించిన 'సిద్ధాంత శిరోమణి' నాలుగు భాగాలుగా ఉంటుంది. అవి 1. వ్యక్త (అంకె/పాటీ) గణితం 2. అవ్యక్త (బీజ) గణితం 3. గ్రహగణితం 4. గోళాధ్యాయం. వీటిలో తొలి భాగమే 'లీలావతీ గణితం'గా ప్రఖ్యాతి చెందింది.

లీలావతి ఎవరు అనే సందేహం తప్పకుండా వస్తుంది. రకరకాల నమ్మకాలు ఉన్నా, ఎక్కువ మంది భావిస్తున్నది లీలావతి భాస్కరాచార్యుల కుమార్తె. ఆమె ఆనందం కోసం ఈ 'లీలావతీ గణిత' భాగాన్ని రచించారని నమ్ముతున్నారు. 19వ శతాబ్దం ఆరంభంలో కోల్ బ్రూక్, టేలర్, విల్కిన్ సన్ మొదలైన పాశ్చాత్య పండితులు లీలావతీ గణితాన్ని ఆంగ్లంలోకి అనువదించారు. ఇందులో 118సూత్రాలకు 149 శ్లోకాలు, 114 ఉదాహరణలకు 119 శ్లోకాలుంటాయి.

తడకమళ్ళ వెంకట కృష్ణారావు అనే మద్రాసు తెలుగు పండితుడు లీలావతీగణితాన్ని మొదటి సారి తెలుగు లిపిలో 1863లో ప్రచురించారు. 1934 లో వావిళ్ళ వారు వేదం లక్ష్మీనారాయణ శాస్త్రి అనువదించి ఎనిమిది వందల పుటల గల పుస్తకాన్ని సంస్కృత శ్లోకాల మూలంతో పాటు ప్రచురించారు. తెలుగు టీకా, తాత్పర్య, ఉదాహరణలతో సహా పిడపర్తి కృష్ణమూర్తి శాస్త్రి 1936లో 'లీలావతీ గణితము' పేరున 560 పేజీల గ్రంధాన్ని వెలువరించారు.

తర్వాత తెలుగు అకాడమీ 2001 సంవత్సరంలో విద్వాన్ తెన్నేటి అనువాదం, వ్యాఖ్యానంతో బీ ఆచార్య పి వి అరుణాచలం పరిష్కర్తగా 'భాస్కరాచార్యుని లీలావతీ గణితా'న్ని వెలువరించింది. 300 పేజీల ఈ గ్రంథం మూడు,నాలుగు సార్లు పునర్ముద్రణ అయినట్టు తెలుస్తోంది. ఆసక్తి ఉన్న మిత్రులు తెలుగు అకాడమీ నుంచి ఒక ప్రతిని సంపాదించి, దాచుకోవడం ఉత్తమం. ఎందుకంటే మీరు పెద్దయిన తర్వాత కూడా ఎంతో ఆనందంగా చదువుతూ ఈ గణిత శాస్త్రాన్ని ఎంజాయ్ చేయొచ్చు కనుక.

- డా॥ నాగసూరి వేణుగోపాల్, m : 9440732392
e : venunagasuri@gmail.com

ద

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com **- ఎడిటర్**



# రాగి రకాలు - సాగు మెళకువలు

చిరుధాన్యపు పంటలు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటున్నాయి. జీవనశైలి, ఆహారపు అలవాట్లు అనేక సమస్యలకు పరిష్కారమంటున్నారు. ఒకప్పుడు చిన్నచూపుకు గురైన చిరుధాన్యాలకు ఇప్పుడు పూర్వ వైభవం వస్తోంది. చిరుధాన్యాల్లోని పోషక విలువలు, ఆరోగ్యానికి అవి చేసే మేలును గుర్తించాక మళ్ళీ వీటి వాడకం పెరిగింది. దీంతో వీటి సాగు రైతులకు లాభసాటిగా మారింది.

రాగి విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. ప్రాంతాలను బట్టి రాగిని తైదలు, చోడిగా వ్యవహరిస్తారు. రాగులు.. బియ్యానికి చక్కటి ప్రత్యామ్నాయ చిరుధాన్యం. ఒకప్పుడు రాగి సంగటి పేరు చెబితే మొహం చాటేసిన సంపన్న వర్గాలు.. నేడు అనేక ఆరోగ్యసమస్యల వల్ల, తమ ఆహారపు అలవాట్లలో దీనికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

రాగిలో ఉండే పోషక విలువలే దీనికి గల ప్రధాన కారణం. రాగుల్లో అధికంగా ఉండే కాల్షియం ఎముకలకు దృఢత్వాన్ని ఇస్తుంది. వీటిని సంకటి (గడ్క), అన్నం, జావ తయారీతోపాటు, తెల్ల రాగులను బేకరీ ఉత్పత్తుల్లో విరివిగా ఉపయోగిస్తున్నారు. రాగుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ సుగుణాలు, ఫైటోకేమికల్స్ ఆలస్యంగా జీర్ణమయ్యేలా చేస్తాయి. ఫలితంగా రక్తంలో చక్కెరస్థాయి అదుపులో ఉంటుంది. ప్రస్తుత కాలంలో మధుమేహ వ్యాధి గ్రస్తులకు రాగి మంచి ఆహారం. స్థూలకాయం, బరువును తగ్గించుకోవాలనుకునే వారికి ఇది శ్రేష్ఠమైన ఆహారం.

ఖరీఫ్‌లో వర్షాధారంగా, రబీలో ఆరుతడి పంటగా రాగిని సాగుచేసుకుంటారు. గతంలో రాగుల దిగుబడి, రేటు రెండూ తక్కువగా వుండేవి. రైతుకు లభించే గిట్టుబాటు ధరకూడా అంతంత మాత్రంగా వుండేది. కానీ ఇప్పుడు అందుబాటులో కొచ్చిన కొత్త రకాలతో రైతులు ఎకరానికి 12-15 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు. క్వింటా ధర 1500 -2000 పలుకుతుండటంతో రైతులు సాగు పట్ల ఆసక్తి చూపిస్తున్నారు.

రాగిని తేలిక రకం ఇసుక నేలలు, బరువైన నేలలు, కొద్దిపాటి చౌడు సమస్య ఉన్న భూముల్లో సాగుచేసుకోవచ్చు. నీరు నిల్వ ఉండే భూములు అనువైనవి కావు. ముఖ్యంగా సరైన సాంద్రతలో మొక్కల పెట్టినట్లు అయితే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. రాగి సాగులో ఎరువుల యాజమాన్యం కీలకం. ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువును వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. అంతే కాకుండా సమయానుకూలంగా నత్రజని, భాస్వరం, పొటాష్‌ను అందిస్తే మంచి దిగుబడులను పొందవచ్చు.

నేరుగా విత్తే పద్ధతితో పాటు నారుపోసి నాటు వేసుకునే పద్ధతిలో కలుపు యాజమాన్యం ముఖ్యం. సకాలంలో శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు కలుపును నివారిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చు. ముఖ్యంగా రాగి పంటకు అగ్గితెగులు, మెడవిరుపు తెగులు, కంకితెగులుతో పాటు ఈ మధ్య గులాబి రంగు పురుగు ఆశించి పంటను తీవ్రంగా నష్టపరుస్తోంది. సకాలంలో వీటిని గుర్తించి నివారించాలని శాస్త్రవేత్త సూచిస్తున్నారు. రాగి పంటలో ప్రస్థుతం మేలైన రకాలు అందుబాటులో వుండటం వల్ల మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరాకు 10 నుంచి 12క్వింటాళ్ల దిగుబడి సాధించే వీలుంది.

- దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# గురు శిష్యుల అనుబంధాన్ని తెలిపే కథలు

గరిపెల్లి అశోక్ బాల సాహిత్యంలో పరిచయం చేయనవసరంలేని పేరు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎంతోమంది పిల్లలకు, ఉపాధ్యాయులకు ప్రోత్సాహం కల్పిస్తూ బాల సాహిత్యంలో పిల్లల రచనలు వికసించడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేస్తున్నారు గరిపెల్లి. వయస్సు రీత్యా ఉపాధ్యాయ వృత్తి నుండి విరమణ పొందినప్పటికీ, ఇప్పటికీ పిల్లలకోసం తన సమయాన్ని కేటాయిస్తూ, వివిధ సాహితీ కార్యశాలలు నిర్వహిస్తూ పిల్లల పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకుంటున్నారు. అంతేకాక ఖాళీ సమయంలో తనకున్న విశేష అనుభవంతో పిల్లల కోసం మంచి మంచి కథలు రాసి వాటిని పుస్తకరూపంలో తెస్తున్నారు.




ఇంతకుముందే మా బడి కథలు, ఎంకటి కథలు, సరికొత్త ఆవు పులి కథల పుస్తకాలతో పిల్లలకి ఇష్టమైన కథలను రాసిన గరిపెల్లి అశోక్ గారు ఇప్పుడు “గోటీలాట” అంటూ మరో పిల్లల కథల పుస్తకంతో మన ముందుకు వచ్చారు. ఇవి కథల కావు, ఇవన్నీ బడిలో జరిగిన యదార్థ సంఘటనలు. ఇవన్నీ బడిలో ప్రతి ఉపాధ్యాయుడికి కనిపించే వాస్తవ దృశ్యాలు. ఆత్మీయతకు, అనురాగానికి, అనుబంధానికి మార్గంగా నిలిచిన సన్నివేశాలు. చిన్నారుల ఆలోచనలకు ప్రతిబింబాలు. చిట్టి మనసుల్లో కల్మషం లేని ప్రేమని తెలియజేసే గుర్తులు మొత్తంగా ఇవన్నీ ఒక మధుర జ్ఞాపకాలు.

ఇచ్చిపుచ్చుకోవడం, పెద్దలపట్ల గౌరవం, తోటి వారికి సహాయం చేయడం, ఐకమత్యం మొదలగు అనేక విలువలను తెలుపుతూ ఈ కథలు కొనసాగాయి. పిల్లలు ఏదైనా చేయగలరు ఏదైనా సాధించగలరనే ధైర్యం నింపే కథలు ఇవి. విద్యార్థులకు పుస్తకాల్లోని చదువొకటే కాదు సంస్కారంతో పాటు అనేక సామాజిక విషయాలు కూడా తెలియాలనే విషయాన్ని ఈ కథలు తెలియజేస్తాయి. మాటల్లో తీయదనం, మక్కకంకుల మాధుర్యం, చేపలు పట్టడంలో నైపుణ్యం, బొమ్మలు చేయడంలో నేర్పరితనం వంటి పిల్లలకు ఉన్న ఎన్నో నైపుణ్యాలు ఈ కథలలో మనకు కనబడుతాయి.

పిల్లలకు అనేక ఆలోచనలు ఉంటాయి. పిల్లల మనసుని గెలిచే ఉపాధ్యాయులంటే వారు దేనినైనా సాధిస్తారు. బడి పిల్లల లేత మనసుల్లోకి తొంగి చూసిన ఉపాధ్యాయుడికి అనేకానేక దృశ్యాలు గోచరిస్తాయి. గురు శిష్యుల అనుబంధాన్ని తెలిపే కథలు ఇవి. పిల్లల బంగారు భవిష్యత్తుకు బంగారు బాట పడాలంటే ఇట్లాంటి కథలను ఉపాధ్యాయులు చదవాలి. నేటి తరం పిల్లలకు నాటి తరం అనుభవాలను తెలియజేసిన ఒక మంచి పుస్తకం ఇది. ఈ తరం పిల్లలకు ఇట్లాంటి పుస్తకాలు ఎంతో అవసరం. ఇందులో ఉన్న ప్రతి కథ వాస్తవానికి దగ్గరగా ఉంది. కథ చదివే వారికి వారి బాల్యపు జ్ఞాపకాలు గుర్తుకు వస్తాయి.

పిప్పరమెంట్లు కథలలో రమేశ్ సార్ చెప్పిన పిల్లల పంచాయతీ కాకెంగిలి రుచిని తెలియజేసింది. ఈ కథ మనల్ని ఒక్కసారిగా మన బాల్యంలోకి తీసుకుపోతుంది. స్నేహితులతో తోబుట్టువులతో కాకెంగిలి చేసుకుని తిన్న రోజులు గుర్తుకు వస్తాయి. పిప్పరమెంట్లు కథలో లల్లి, చెర్రి మధ్య జరిగిన గొడవకు పరిష్కారం చూపుతూ రమేష్ సార్ వారిని మిత్రులుగా మార్చడం కొరకు వేసిన శిక్ష అది శిక్ష కాదు రక్ష అని తెలియజేస్తాడు. బఠానీలు కథ శ్యాం సార్ ద్వారా బడిలో ఏం తిన్న అందరికీ పంచాలనే స్నేహ సూత్రంను తెలుపుతుంది. బఠానీలు తింటున్న శీనుకు తన తప్పు తాను తెలుసుకొని తన తోటి పిల్లలతో పంచుకొని తినడంలో ఉన్న ఆనందాన్ని చూపిస్తాడు ఉపాధ్యాయుడు.

బిస్కట్లు కథలో ఇసుక బట్టీల నుంచి వచ్చిన కుర్రాడి బాధను విని రామారావు సార్ స్పందించిన తీరు పిల్లలకు సహాయం గుణాన్ని అలవరుస్తుంది. వలస కూలీల జీవిత కష్టాలను తెలిపే బిస్కెట్ల కథ స్నేహ బంధాన్ని తెలుపుతుంది. మధ్యతరగతి కుటుంబంలోని పేదరికపు కష్టాలు వలన చిన్నప్పుడే కుటుంబ పరిస్థితులు అర్థం చేసుకునే విధానమును పిల్లలకు తెలుపుతుంది. కూరా, చారు కథలో పద్మ బడికి లేటుగా రావడానికి గల కారణం బడిలో పెట్టిన గుడ్డును ఇంటికి తీసుకు వెళ్ళడానికి గల కారణం పెద్దసార్ తెలుసుకోవడం వల్ల పేద విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని తెలుపుతుంది. నాన్నపై పిల్లలకున్న ప్రేమను మన కళ్ళముందు నిలిపింది. పెద్దసార్ పద్మ ఇంటి పరిస్థితులను తెలుసుకొని పెన్నులు, పుస్తకాలు ఇవ్వడం ఉపాధ్యాయుడి ఔదార్య గుణమును తెలియజేస్తుంది.

ఎండ్రికాయలు- చేపలు కథలో వర్షం కొట్టినప్పుడు పిల్లలు బడికి రాకుండా చేపల పట్టడానికి వెళ్లడం, చేపలు పడుతూ సార్లకు

దొరికిపోవడం, తల్లిదండ్రులు పిల్లలను బాగా కొట్టండి అనడం జరుగుతుంది. కానీ వారు చెడిపోయిన విద్యార్థులు కారని జీవన నైపుణ్యాలు ఉన్న వారని గుర్తించి సార్ వారిని మందలించి వదిలిపెడుతారు. పిల్లలు చదువుతో పాటు బతుకుపాఠాలు కూడా నేర్చుకుంటున్నారని తల్లిదండ్రులకు చెపుతారు. పండ్ల బుట్టలు కథలో సఫాయి వెంకటయ్య కొడుకు సత్యం చేయని నేరానికి దొంగలా ముద్రపడుతాడు. తన నిజాయితీతో పోలీసుల ఆలోచనలు మార్చగలుగుతాడు. చివరికి నిర్దోషి అని తెలిసి పోలీసులు అతనిని సన్మానించడం జరుగుతుంది. సత్యం గురించి పోలీస్ తో సార్ చెప్పిన తీరు విద్యార్థి పట్ల ఉపాధ్యాయుడికి ఉన్న సదాభిప్రాయంను తెలియజేస్తుంది. అంతేకాక ఈ కథ పరిసరాల పరిశుభ్రత గురించి కూడా తెలియజేసింది.

మక్క కంకులు కథలో శీను అనే విద్యార్థి కంకులు కొని తన తోటి స్నేహితులందరితో సమానంగా పంచుకొని తినడం, మీసాల సార్ (బాల్ రెడ్డి), లచ్మన్ సార్లు కూడా సొంత పిల్లల కంటే ఎక్కువగా పిల్లల్ని ప్రేమించడమనేది ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య అనుబంధాన్ని తెలుపుతుంది. పంచుకొని తినడంలో ఉన్న ఆత్మీయతను మక్కకంకుల కథ ద్వారా తెలియజేశారు. గోటీలాట కథలో జేబు నిండా గోటీలతో పిల్లలు ఆడుకోవడం, తల్లిదండ్రులను డబ్బులు అడుక్కొని చాటుగా గోటీలు కొనుక్కోవడం, తండ్రి మందలించడం జరుగుతుంది. పిల్లలు సరదాగా ఆడుకునే గోటీలను సురేష్ సార్ గణితాన్ని బోధించడానికి ఉపయోగించడం ఉపాధ్యాయుడి సృజనాత్మకతకు నిదర్శనం. ఆటల వల్ల పిల్లల్లో ఏకాగ్రత, సృజనాత్మకత, పోటీ తత్వం, స్నేహ బంధం అలవడుతుందని చెపుతాడు.


ఎల్లిగడ్డలు కథలో తిరుపతి స్నానం చేయకుండా బడికి రావడం, ఉపాధ్యాయుడి మందలింపు, తిరుపతి తప్పు ఒప్పుకోవడం జరుగురుంది. కానీ నారాయణ సార్ అప్పజెప్పిన పనిని తిరుపతి మనసు పెట్టి చేసి గురువు మాటను గౌరవిస్తాడు. పరిసరాల పరిశుభ్రత గురించి బడికి స్వచ్ఛతా పురస్కారం వచ్చినందుకు తిరుపతి బహుమతి ఇవ్వడం కొసమెరుపు. జామకాయలు కథ స్వర్ణకార, వడ్రంగి, కుమ్మరి మొదలగు వృత్తిపని వారి నైపుణ్యంను తెలియజేయడమే కాకుండా తాత మనుమడి అనుబంధమును తెలియజేసింది.

చిప్పల పండ్లు కథలో తిరుపతి, వాళ్ల అమ్మ పడుతున్న శ్రమను గుర్తించి దసరా రోజున ఇంటికి ఆహ్వానించి వారికి కొత్తబట్టలు, నగదు ఇప్పించడం నారాయణ సార్ గొప్ప మనసును చాటుతుంది. సార్ మనవడు కూడా చుట్టుపక్కల వారిని పిలుసుకువచ్చి వారికి తోచినంత ఇప్పిచడం, పెద్దలను చూసి పిల్లలను నేర్చుకుంటారని తెలియజేస్తుంది. సెలవుల తర్వాత పోశమ్మ నారాయణ సార్ కొరకు మరియు మిగతా ఉపాధ్యాయులు కొరకు చిప్పల పండ్లు తెచ్చి తన ఆత్మీయతను చాటుకుంది.

ఇలా ఇందులో ప్రతి కథ కూడా దేనికదే ప్రత్యేకమైనది. ఇవన్నీ స్థానికతను గ్రామీణ జీవితాన్ని, బాల్యంలో పిల్లల అలవాట్లను, ఒకప్పటి పల్లె జీవనశైలిని మనకు తెలియజేస్తాయి. అన్ని కూడా ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి పిల్లల కథలు. అలతి అలతి పదాలతో అక్కడక్కడ అచ్చమైన గ్రామీణ పదాలతో చాలా చక్కగా రాశారు. ఈ కథల ద్వారా కొన్ని తెలంగాణ యాస పదాలను కూడా పిల్లలకు పరిచయం చేయడం జరిగింది. పుస్తకానికి అందమైన ముఖ చిత్రాన్ని వేయడమే కాకుండా కథలకు అనుగుణంగా గోపాలకృష్ణ వేసిన చక్కని బొమ్మలు గోటీలాట పుస్తకానికి మరింత అదనపు శోభను కలిగించాయి. గరిపెల్లి అశోక్ గారి నుండి మరిన్ని పిల్లలకు ఉపయోగపడే రచనలు రావాలని ఆశిస్తూ అభినందనలు..

-కందుకూరి భాస్కర్
m : 9441557188
e:bhaskerkandukuri2@gmail.com

## పర్యావరణంపై ప్రత్యేక వ్యాసాలు



**మన దక్కన్‌ల్యాండ్** మాసపత్రికలో పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై కథనాలు, వ్యాసాలు, ఇంటర్వ్యూల పట్ల దృష్టి సారించాలని దక్కన్‌ల్యాండ్ ఎడిటోరియల్ బోర్డు భావిస్తున్నది. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కోరుతున్నాం. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం.

**రచయితలు పై అంశాల మీద లోతైన విశ్లేషణలు, విషయాలతో తమ కథనాలను పంపగలరు.**

చిరునామా :

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND : "CHANDRAM" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
Fax: 040-27635644 Mobile: 9030626288
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

# Oxford Grammar High School

OGS JUNIORS
grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE



## We make school time the **best time** for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- Loving atmosphere & play ground
- CCTV surveillance
- Certified teachers & caring staff
- Kids zone & play area
- Interactive & Value based Learning

**CARING TEACHERS & STAFF**
Your child will get the best care and attention

**ECO-FRIENDLY PRACTICES**
We let the children play with nature friendly material

**HUGE PLAYGROUND**
Your child will get lots of fresh air and playtime

**INTERACTIVE LEARNING**
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

DECCAN LAND, Telugu Monthly Magazine Date of Publication 26th - January 2025
ISSN 2581-3188
Postal Dates: 28th & 29th Every Month
PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar